# దేవుళ్లదేశం



బలివాడ కాంతారావు

గోవా ముఖ్య పట్టణం పంజిదాటి మాండవీ నది ఒడ్డు నించి పోతూ, రిబాందర్ చేరే సరికి దివార్ కొండమీద కోటలా కనిపిస్తుందో కట్టడం. దివార్ ద్వీపం మాండవీనదిలో లంగరు వేసుకుని నిల్చున్న పెద్ద నావలా వుంది. మార్చి నెల యెండ దూర దూరాన ఆకులు రాల్చుతున్న అడవుల్లో పొగలు కక్కుస్తోంది. ఇనుము, మాంగనీసు ఖనిజాలను పొట్టలో ఇముడ్చుకున్న కొండలు మండిపోతూ నలుపెక్కాయి.

కానీ యీ దివార్ ద్వీపం చనుబాలు కుడిచి పెరిగిన బిడ్డలా యీ కాలంలోనూ పచ్చగా కనిపిస్తోంది. ఇంత మనోహరంగా కనిపించే యీ దీవికి గాలి వానలు తాకకూడదే! ఎండాకాలపు గాల్పులు చుట్టూ పారుతున్న నదిని దాటేసరికి చల్లబడిపోతుండాలి. ఈ ద్వీపవాసులకు బహుశః వేసవి వుండదేమో? అపురూపమైన పక్షులు యిక్కడినించి వలస వెళ్లే అవసరం వుండకూడదు, ఇలాంటి పచ్చదనాలు, చక్కదనాల కూడలిలో అందం, అనురాగం, ప్రేమాభిమానాలు తప్ప, చెడు మొలకెత్తలేదనిపిస్తుంది. ఇంత చక్కని పరిసరాలలో మనిషి పశువుగా మారే పరిస్థితీ రాకూడదు.

పాతగోవాలో సేకెత్రెడల్ దాటి, వాస్కొడగామా గేటులోనించి మాండవీనది ఒడ్డుకు చేరి, ఫెర్రికోసం ఆగేటప్పుడు నది నీరని నోట్లో పోస్తే ఉప్పకారు! అలా దృష్టి సారిస్తే సముద్రం నించి చొచ్చుకొని వచ్చే చేపల సమూహాలు కనిపిస్తాయి. పెద్ద చేప చిన్న చేపను మింగడానికి వెంటతరుముతుంది. ఈద్వీప వాసుల్లో యీ న్యాయం యే కాలంలో నైనా యేటుబడి చేసిందా?

దివార్ అంటే దేముళ్ల దేశముట. ఆ హిందూ దేవాలయాలు నేలమట్టమై, ఆ మానవులు బుగ్గిలో కలిసినా ఆ పేరెత్తగానే వాళ్ల హృదయ స్పందన వినిపిస్తుంది. ఫెర్రిదాటి మూడు చక్రాల టెంపోయెక్కి ద్వీపం మధ్యలో ఒక దాని కొకటి అంటుకొని వున్న నాలుగు గ్రామాలు గోర్తి, నవెలె, మలర, వార్ప. ఈ నాలుగు గ్రామాలు యిప్పుడో చిన్న పట్టణంగా కనిపిస్తున్నాయ్.

గోర్తిలో టెంపోదిగ్గానే యెదరగా 'బార్' బయట నిల్చొని పిలుస్తున్న పిలుపు, ఎప్పుడు వెళ్లినా ఆ తెలుపు యెరుపు బారల చొక్కా, బారల మధ్య అక్కడక్కడా

ఇందులో పాత్రలు, సంఘటనలు కేవలం కల్పితం

పూల లతలు, మాసినా కనిపించని నీలి బెల్‌బోటమ్ పేంటు. నిత్యం వెలుగుతున్న ఓడి నలిగి నలిగి మాసిన బట్టలను వుతక్కుండా యిస్త్రీ పెట్టి వేసుకున్నట్లు, నలిగిన జీవితానికి మెరుగులు దిద్దటానికి ప్రయత్నిస్తున్న వ్యక్తిలా కనిపిస్తాడు. వాడి ఆహ్వానం అందుకొని బార్‌లో కాలుపెడ్తే ఒక పక్క బీరు, ఫెనీ, విస్కీ వగైరా సీసాలతోపాటు యింకోపక్క సమోసాలు కనిపిస్తాయ్. కొత్త ముఖాలను మాడగానే వాళ్లకు సన్నిహితుడవడానికి మొట్టమొదట చేసేపని తన చేతులమీద నున్న పచ్చబొట్లులతో బాటు తన తల్లినీ, కోడలినీ పరిచయం చేస్తాడు, తల్లివేషం ఆ మాసిన చీర, సంస్కారం లేని పండు జుత్తు, కండరాలు కరగ్గానే ముతడలు పడ్డ శరీరం. ఈవిడా యీ కొడుకు యీ దివార్‌లో ఒకప్పుడు కలిగినవారి క్రౌర్యానికి నలిగిన దీనుల నమూనాలుగా కనిపిస్తారు. కానీ కోడలు మాత్రం అపురూపమైన అందంతో వెలిగిపోతోంది. చిక్కితే రక్తం వచ్చే శరీరంలో శృంగారాన్ని వొలగబోసే భాగాలను మాసి, ఆనందించుకోండనట్టు హాకోమాగౌను వదులుగా వేసుకుంది. ఆమె వేపు మాస్తే, అద్దాలకిటికినుంచి అపురూపమైన తాజమహల్ తొలిసారి చూస్తున్నట్లనిపిస్తుంది. ఈకోడలు కలిగిన కుటుంబాల నవ్వుల కులుకులా వుంది. వాళ్ల మెరుపుల తళుకులానూ వుంది.

అటు ముసలమ్మ, యిటు యీయువతి వేపు మాస్తే యీ దివార్ మలుపులు తిరిగిన చరిత్రను వూహించవచ్చు. కొత్త కస్టమర్‌ని కూర్చోబెట్టేశాక యింకోసారి తనమేరు గుర్తుకుతేడానికి తన కుడిచేతి మీదనున్న పచ్చబొట్టుగా రాసిన పేరును మాపిస్తూ...

"నా పేరు - ఫ్రాన్సిస్ ఫెర్డినాండో..." మెల్లగా చెవి దగ్గర నోరుపెట్టి

"ఈ గోవాలో నేను చెయ్యలేని పని యింకెవడూ చెయ్యలేడు..." కస్టమర్ వింతగా మాస్తే

"ఏమైనా పోలీసు సహాయం కావాలా? ఏరకమైన ఫారన్ సరుకులు కావాలా? క్విక్ క్విక్..."

సమోసాలు కావాలా బీరుకావాలా అని అడక్కుండా యీ సోదెందుకని మాస్తే

"నేను స్కార్పియో... వృశ్చికం...తేలుగుర్తులో పుట్టాను. ఎప్పుడూ యేక్టివ్‌గా వుంటాను. నాకు అన్నీ తెలుసు. నేను గోవాలో బెస్టు గైడుని"

ముసలమ్మ టేబిలుమీద పెట్టిన సమోసాలు బలవంతాన తినిపించి, బలవంతం చేసినా తాగని వాళ్లకు స్పెషల్ టీని ఆర్డర్ తనే చేసి ఫెర్రీ వద్దనించి వచ్చిన కొత్త కష్టమర్లను ఆహ్వానించడానికి బయటకు పోతాడు. తను నవ్వకుండా యెదుటవాళ్లను నవ్వించగలిగే చాప్లిన్‌లా వున్నాడీ ఫ్రాన్సిస్. అందుకే కొత్త కష్టమర్లదృష్టి వాడిమీదనించి మరల్చలేక పోతారు. లేచి బిల్లు చెల్లించడానికి కౌంటరు దగ్గరకు వెళ్తే, యీ కోడలు మారియామోనాలిజా నవ్వు కలుపుకొని రెండు సమోసాలు, ఒక స్పెషల్ టీ ధర యైదు రూపాయలు. అమ్మో యింతే అనియే మగాడూ బాధ పడని ఘట్టం అది. ఎంచేతంటే యీ అపురూప సుందరి కష్టమరు దగ్గిరనించి, ఆ డబ్బు అతని చేతిని తాకి తాకి మరీ తీసుకుంటూంది.

బయటకు వచ్చి ఫ్రాన్సిస్‌కి థేంక్సు చెప్తే మళ్లీ అంటాడు. పోలీసుల సహాయం కావాలా? ఫారెన్ గూడ్సు కావాలా? ఒకప్పుడు పోలీసుల సహాయం, ఫారెన్‌గూడ్సు కావాలని బహుశః పరితపించాడేమో? అందుకే యీ రెండు చాల విలువైనవీ గొప్పవీ అన్నట్లుగా ముఖం పెట్టి మరీ అడుగుతున్నాడు. దీవార్ గురించి తెలుసుకోవాలని వచ్చిన ఒక టూరిస్టు.

"ఫ్రాన్సిస్! అంత గొప్పగైడ్ అంటున్నావే - వస్తావా? ఈ దివార్‌లో చూడవలసినవి మాపిస్తావా?"

"నేను చాల బిజీ మనిషిని. ఇక్కడ లేకపోతే బార్ బండి నడవదు"

"పోదు! బార్, నీ వించి నడలేదు - నీ కోడలి వించి నడుస్తోంది. నీ కోడలు ఎడిపిస్తోంది".

"ఈ ఆర్గు మెంటెందుకు? ఎన్ని బక్స్ యిస్తావ్?"


"ఎంతకావాలి?"

"కష్టమర్స్ సాటీస్‌ఫేక్షన్ బట్టి బిజినెస్ విలువ కట్టాలి కదా! పద... పద..."

తిన్నగా రోడ్డుమీదపడి నాలగడుగులు వేసి ఫ్రాన్సిస్ ఆగాడు.

"చూడు వరసగానున్న మూడు అపురూపమైన యిళ్ళు చూడు"








"పాడుపడినట్లున్నాయ్"

"ఆ మధ్య యిలు... పోర్చుగీస్ వచ్చునా?"

"రాదు"

"ఆ మార్బుల్ ప్లేటు మీద పేరు..."

"ఏం పేరు?"

"ఆ పేరెత్తడానికి యిప్పటికీ నాకు భయమే"

"ఏం?"

"అందులో యీ దివార్‌కి - కింగ్‌లా యేలుబడిచేసిన వాడుండేవాడు".

"వాడిపేరు"

"రోనీ మేనేజిన్"

"ఆ యిరుగుపొరుగులో..."

"మధ్యనున్నవాడు ఘోరాలు చేస్తే - యిటు ప్రక్కనున్నవాడు మౌనం దాల్చాడు. అటు ప్రక్కనున్నవాడు అబద్ధాలు నిజమని అరచాడు"

"ఫలితం?"

"న్యాయం ఖూనీ చెయ్యబడింది"

"న్యాయానికి చావులేదా! అది అమృతం తాగిన దేవత. తగిలిన గాయాలు మానలేదా?"

"బాగా చెప్పావ్ - న్యాయం బ్రతికింది కాబట్టే - ఇదుగో యీ మేనేజస్ భవంతిని నాకొడుకు దుబాయ్‌నించి రాగానే కొనేస్తున్నాడు"

"ఓడలు బళ్ళు, బళ్లు ఓడలైపోతాయన్న సామెత సార్థకం అయ్యిందన్న మాటే" అలానడుస్తుంటే

"ఇదిగో - ఇది అజిల్‌స్కూలు..."

"అంటే"

"ఇదిపేదవాళ్ల పిల్లలకని పోర్చుగీసువాళ్లు కట్టిన స్కూలు. ఇందులో చేరి చదువుకోవాలని యెంత ఆశ పడ్డాను".

## ఓ చెలీ!

ఓ చెలీ! నీవు నా మీద నొక్కొక్కపుడు
అలిగి ఉగ్రమ్ముగా చూచినపుడు, అద్ది
సుంత కోపమ్ము కాదు, వసంత రాగ
మనుకొన్చుచు, నన్ను సరిపెట్టు
కొనెద నేను.


ఓ చెలీ! నీవు నామీద నొక్కొక్కపుడు
పెల్లుబుకు కోపమున చెవి చిల్లు పడున
టుల అరిచినపుడు, అవి కోకిలల కూత
లనుకొనుచు, నన్ను సరిపెట్టుకొనెద నేను.

ఓ చెలీ! నీవు నామీద నొక్కొక్కపుడు
వెర్రిగా పాత్రసామగ్రి విసరినపుడు,
అవ్వి మదనదేవుని మంజులాయుధమ్ము
లనుకొనుచు, నన్ను సరిపెట్టుకొనెద నేను.

ఓ చెలీ! నీవు నామీద నొక్కొక్కపుడు
అలిగి నీ పుట్టినింటికి అరిగినపుడు,
శివుని కంటి మంటకు మడిసిన మదనుడు
గుర్తువచ్చి, నన్ సరిపెట్టుకొనెద నేను.

కాని ఓ చెలీ! నీ వొక్కొకపరి బహు వి
చిత్రముగ హొయల్ చిలికినన్ చేరినపుడు,
ఏదో నా నెత్తిమీదికి ఎత్తుచుంటి
వని యెరింగి నే సరిపెట్టుకొనగలేను.

— విశ్వనాథ పావనిశాస్త్రి



"మరియెవరు చేరారు?"

"అంతా డబున్నవాళ్లే వాళ్ల పిల్లలను యీ స్కూలుకు పంపించారు"!

"ఇదీ యిక్కడి రాజు పరిపాలనేనా?"

"ఇలా దివార్ అంతా తిరుగు, వాడి పేరు కనపడని వీధి లేదు. వాడు కొల్లగొట్టని కొంపలేదు. ఇప్పుడిక్కడ హైస్కూలుంది. వాడి చరిత్ర యీ స్కూల్లో నేర్పరుగానీ యీ దివార్‌లో ఎప్పుడో వచ్చినా ...... ఇంకా వాడు బతికే వున్నాడు".

ఇంతలో "ఫ్రాన్సిస్" అన్న కేక వినబడింది. అది మారియా పిలుపు. అది కోడలు మామగారికి పిలుస్తున్న పిలుపులా లేదు. అది ఒక యజమానురాలు సేవకుని పిలుస్తున్న పిలుపులా వుంది. తనలో జీర్ణించిన బానిసత్వం "వస్తున్నా" అని పరుగులత్తింది.

ఇంకోసారి ఆ కోడలువంక చూద్దామనో లేక వీడి శ్రమ నాకెందుకని టూరిస్టు మళ్లీ బార్ దగ్గరకెళ్లి ఫ్రాన్సిస్ చేతిలో పెట్టి డబ్బు వాడు చూడకుండానే జేబులోకి తోసుకున్నాడు.

"నీతల్లి, కోడల్ని పరిచయంచేసావ్? మరి నీ భార్య...?"

కాస్త ముందుకొచ్చి రిబాందర్‌నించి కోటలా కనిపించే కొండమీద నున్న చర్చిని చూపిస్తూ ,

"అదిగో పియదాద్ చర్చి, ఆ చర్చి ఆవరణలో గ్రేవ్‌యార్డువుంది. ఆ శ్మశానంలో నాపెళ్లానికి పాతిపెట్టిన జాగా గుర్తుంది. గాని - ఆ జాగా కొనుక్కునే తాహతులేక అక్కడ యింకొకరి శవం పాతిపెట్టి దానిపై యింకొకరి సమాధి వుంది. వెళ్లు... ఆ బ్రతికిన మనుషులున్న చర్చితోపాటు, ఆ చచ్చిన మనుషుల సమాధులను కూడా చూడు".

"చూస్తే ప్రయోజనం?"

"పోలీసు సహాయం కోరం - ఫారెన్ గూడ్సు గురించి తాపత్రయపడం - అదీ అక్కడున్నంతసేపే" అంటూ కొత్త కష్టమర్స్‌ను ఆహ్వానిస్తున్నాడు.

బార్ యెద రగానున్న రోడ్డుమీద నించి పోతే పూలతోట ఆవరణల మధ్య చక్కని యిల్లు కనిపిస్తాయి. మతం ఒకటైనా జాతిని మరచిపోలేని మనుషులు, ఒకనాటి హైందవ సాంప్రదాయాలను వదలని కూడలి యిది. ఇక్కడ యింకా బ్రాహ్మణులు, క్షత్రియులు, శూద్రులూ అని క్రైస్తవులు విడిపోయి వున్నారు. మతం ఒకటైన వర్ణాంతర వివాహాలు చేసుకోరు. అగ్రజాతులు బంగళాల మధ్యలో ఒక చర్చివుంది. దీన్ని "అవర్ రిడీమర్ చాపల్" అంటారు. అందులో ఇటలీ నించి కొన్ని శతాబ్దాల క్రితం తెచ్చిన క్రీస్తు విగ్రహం వుంది. అది అనంత పద్మనాభుని విగ్రహంలా పడుకుని వుంటుంది. ఆ విగ్రహం పాదాల మీద తల మోపి మొక్కి కోరికలను విన్నవించుకుంటే తప్పక సాఫల్యం అవుతాయుట.

ఈ చాపల్ యిలా వృద్ధి పొందడానికి కారకులైన వాళ్ల పేర్ల జాబితాలో పెద్ద అక్షరాలతో వున్నది రోసీ పేరు. కోరుకున్న కోరికలు సఫలం కాకపోతే యీబినెరుగని రోసీ యెందుకింత దానాలు చేస్తాడు? ఈ చర్చి దివార్ అధ్యాత్మిక జీవితంలోనే కాదు, ఐహిక జీవితంలో ప్రధాన పాత్ర వహిస్తూ వచ్చింది.

అలా వెళ్తూ పేదాద్ కొండ మీదకు యెగ బ్రాకితే మనోహరమైన ఉద్యానవనం. అందులో అన్ని వేళల్లో తిరగడానికి, తిరిగి పూలవాసనలతో మిళితమైన గాలితో తన్మయత్వం కాడానికి తగ్గ చెట్ల నీడలూ వున్నాయ్. ఆ పియదాద్ చర్చి ప్రాంగణంలో నిల్చొని యెద రగా పశ్చిమానికి చూస్తే మాండవీనదిలో కదుల్తున్న పడవలు... నీలినది ఒడ్డునే దివినించి దిగిన చక్కని చుక్కలు దివ్యంగా మెరిసిపోతున్నట్లు రిబాందర్ కనిపిస్తుంది. దృష్టి దిక్చక్రపు అంచునకు సారిస్తే రంగురంగు పూలతో నిత్యాభిషేకం చేసుకుంటున్న పంజి సాక్షాత్కరిస్తుంది. దక్షిణానికి చూస్తే మయూరం నృత్యం చేస్తున్నట్లుంటున్న పాతగోవా కనిపిస్తుంది. ఒక మూలకు కొండమీద "క్రాస్ ఆఫ్ మిరాకిల్స్" చర్చి. ఆ చర్చే దివార్ చరిత్ర సృష్టించింది. అక్కడ యేసు ప్రభువు కనిపించాడట. ఆ చర్చినానుకున్న భవనంలో ఫాదర్స్, నన్స్, ప్రవర్తన సరిగ్గా ఒకప్పుడు లేనందున దేవునికి కోపం వచ్చి ఆ ప్రాంతంలో ప్లేగు సృష్టించాడట. ప్రస్తుతపు పాతగోవా ప్రదేశం ఒకప్పుడు ప్లేగువాత పడటం కల్పన మాత్రంకాదు. నిజం! ఆ ప్లేగు సమయంలో ప్రాణం మీద తీపితో మాండవీ నదిదాటి వస్తున్న క్రైస్తవ సమూహాలను చూసి, దేవతా విగ్రహాలను పట్టుకుని హిందువులు వుత్తరానికి పారిపోయారట, నిదర్శనం - ఈ పియదాద్ చర్చికి అనుకుని వున్న శ్మశానం ఆవరణలో వున్న ఆలయం ఆకారంలోవున్న కట్టడంలో యిప్పుడు శిలువ వుంది. ఒకప్పుడు అందులో గణపతి విగ్రహం వుండేదట. ఈ చర్చి యెదరగా కప్పకు పోతున్న చిన్న పుష్కరిణి వుంది. చర్చిలయెదరగా చెరువులను త్రవ్వడం పాశ్చాత్యసాంప్రదాయం కాదు.

ఉత్తరానికి మాండవీనదిలోనే షోరాన్ ద్వీపం. తూరుపున పచ్చదనాన్ని పులుముకున్న కొండల సముదాయం. ఆ కొండలను చీల్చుకుని పొర్లుకుంటూ వస్తున్న మాండవీనది.

ఈ కోమల మందహాసాలను వెళ్ల గక్కుతున్న ప్రకృతిలో తిరిగిన మనుషులు




యెందరు కోరికలు సాఫల్యం చేసుకున్నారో, యెందరు దాగిన రోగంలా కోరికలు అణుచుకున్నారో? "వాళ్ల తలపులు, వంపులు, హసనాలు, వ్యసనాలు కుసుమించాయో విషమించాయో, నిర్యాణంజెందాక కూడా విషవాయువులై ప్రసరించాయో, విరితేనియలై ప్రవహించాయో" తెలుసుకోడానికి, ఒకసారి చర్చికి ఆనుకుని వున్న శ్మశాన వాటికలో కాలు పెడ్తే - ఇక్కడకూ మనిషి తన అంతస్థులను, ఆధిక్యతనీ, కులాన్నీ, కుటుంబగౌరవాన్నీ - తను బ్రతికుండగా పాటు బడ్డ సర్వస్వాన్ని మోసుకొచ్చాడు. ఈ గ్రేవ్‌యార్డ్‌లో అగ్రకులాలవారి సమాధులు ఒక వేపుంటే - యిటు మూలకు నిమ్నజాతుల సమాధులున్నాయ్. ఈ లేమివాళ్ల సమాధులవేపే యెక్కడో ఆరడుగుల జాగాలో ఫ్రాన్సిస్ యిప్పటికీ ప్రతియేడాదీ ఒక రోజున ఒక పూలగుచ్ఛం వేస్తూ వుంటాడు. బహుశః భార్యతో గడిపిన రోజుల్లో మధుర క్షణాలను తలచుకుని కన్నీరు తుడుచుకునే బదులు నిశ్శబ్దంగా వెకిలి నవ్వు నవ్వుకుంటాడు. ఒక వ్యక్తికి సంబంధించినదికాక, యీ దివార్ సాంఘిక వ్యవస్థ సవాల్ చేసి, మార్పుకు దోహదం చేసే వాని సమాధియేదైనా వుందని యీ లేమి వాళ్ల సమాధుల్లో వెతికి చూస్తే మీకు ఆ పేరు యెక్కడా కనిపించదు. కానీ యెక్కడో యీ చిన్న జాగాలో ఆరడుగుల మేరలో ఆ మహోన్నతమైన వ్యక్తి అస్తికలుంటాయి.

ఇటూ, అటూకాక మధ్యలో వున్నదో సమాధి. అదెవరిది? ఇటూ అటూ చేరక త్రిశంకు స్వర్గంలో నున్న వాడెవడువీడు? ఆ వ్యక్తి బ్రతికుండగా గోడమీద పిల్లివాటంగా సంచరించాడా? అనాధుల గొంతుకతో అరచి, సంఘానికి మభ్యపరచి, భాగ్యవంతుల భావాలతో దోచి దర్జాగా బ్రతికాడా? లేక బ్రతికుండగా యీరెండు తెగలకూ యెసరు పెట్టాడని రెండు తెగల వాళ్లూ వీడిని తమ మధ్యలో పాతిపెట్టటానికి చోటివ్వడానికి వప్పుకోలేదా?

దగ్గరగా వెళ్లి నిదానించి చూస్తే ఆ సమాధిపై చెక్కిన పేరు కనిపిస్తుంది.

"రోనీ మెనేజెస్"

## 2

మానవుల కార్యక్రమాల్లో, మధ్యమనిషి లేకపోతే సాధారణంగా విజయం సిద్ధించదు. వర్తక వ్యాపారాల నించీ మహా సామ్రాజ్యాలనునిలుపుకునే వరకూ, మధ్య మనిషి ప్రధాన పాత్ర వహిస్తాడు. గోవాలో తమ పాలన శాశ్వతంగా నిలుపుకోడానికి పోర్చుగీసుపాలకులు సృష్టించిన వందలాది మధ్య మనుషుల్లో రోనీ మేనేజెస్ ఒకడు.

దివార్‌లో అతని నివాసం పోర్చుగీసు గవర్నరున్న కోబో నివాసం కన్నా కొన్ని విషయాల్లో మిన్న. కోబో నివాసంలో తివాశీలుంటే రోనీ నివాసంలో గచ్చుమీద రంగురంగుల పింగాణీ గాజు ముక్కలతో మలిచిన అరగని తరగని తివాసీలున్నాయ్. యువతి ముఖానికి శోభకూర్చిన నగవుల హోర్మనీ రీడ్సులాంటి పళ్ల వరసలా, చెక్కిన చక్కదనంతో యింటిలో యేమూలా సింగారం తళుక్కుమంటోంది. పెరట నున్న చిన్న గుట్ట నల్లని సిగలా కనిపిస్తే, దానికి అతుక్కున్న బంగారు నగిషీ నగలా వుందీ భవనం.

ఈ భవనంలో కాలుపెట్టడమే ఒక అదృష్టం. పోర్చుగీసు పాలనతో సంబంధం వున్న ప్రతి పెద్ద. యీయింట్లో మరువలేని ఆతిథ్యం పొందాడు. అధికారుల పొట్ట నింపుకుని వాతాపి జీర్ణం అనకముసుపే రోనీ తన పనులను చెయ్యించుకునేవాడు. అలా అని రోని శూద్రులను తన యింటికి పిలవలేదని పొరపడకండి. అతని యింటి ఆవరణలో కాలుపెట్టడమే ఒక ఘనత. అలాంటిది రోనీ రాజా, రోనీ చక్రవర్తి యింట్లోకి పిల్చి ఒక శూద్రుడ్ని ఆహ్వానించి అపురూపమైన ఆతిథ్యం యిస్తున్నాడంటే యే శూద్రుడీఅవకాశం వదులుకుంటాడు.

అలానే పెద్రోఫెర్నాండిస్‌ని ఒక సాయంత్రం పిల్చాడు. లోనికి రాకుండానే అంగటిపూల తోటలోని బాటలోనే అంతదూరంలోనిల్చుని.

"శలవియ్యండి"

"నిన్ను సేవకునిగాయెంచి పిలవలేదు. సమునిగా చేసి డ్రింక్స్‌కి పిల్చాను - రా - లోపలికిరా - పెద్దలు కూర్చున్న సోఫాలో కూర్చో..."

"మీలో చచ్చిన శవాన్నే, బ్రతికి వున్న మా శూద్రులను ముట్టనివ్వరే! అలాంటిది. మీరునన్ను మీ సమునిగా చేస్తున్నారంటే నమ్మలేనుదొరా!"

ఆరడుగులరోనీ, యైదడుగుల పెద్రోవేపు చూసి నవ్వాడు. ఆ నవ్వు హృదయం వెదజల్లిన విషానికి కృత్రిమ రూపం... ఒక రాక్షసి మోసం చెయ్యడానికి ధరించిన అప్సరస వేషం!

"నేను చచ్చాక నాకేం తెలుస్తుంది? ఇప్పుడు బ్రతికే వున్నాను. ఇప్పుడు నన్ను ముట్టుకోవచ్చు. నాప్రక్కన కూర్చోవచ్చు. నేను తిన్నది తిను. లిజ్‌బన్ నించి దిగుమతి చేసింది. నాతోపాటు తాగు... కొన్నిగంటలు యీ హెచ్చు తగ్గుల వ్యత్యాసాలు మరచి పోదాం రా..."

"అయ్యా! తమరు చక్రవర్తి, నాతో వియ్యమందుతున్నట్లు మాటాడి మమ్మల్ని నవ్వులపాలు చెయ్యకండి"

"ఈ వేళ ఉదయమే ఒక కబురు విన్నాను. దొరా! గుండె నిబ్బరం చేసుకున్నా భూమ్మీద నిల్చొనే పాదాలకు శక్తినిమ్మని చాపల్‌లోని పాదాల మీద తల మోపాను. తమరు కొలుస్తున్నవీ అవేపాదాలు. ఇలా ఆశక్తే మాటాడిస్తున్నాదేమో?"

"అయితే యిద్దరం కొలుస్తున్నదీ ఒక్కరినే... అందుకే మనం ఒకటవ్వాలి... రా...లోనికి రా... నేనిచ్చే ఆతిథ్యం యిప్పటికి ఒక్కరూ కాదనలేదు. ఇప్పుడు కాదన్నావో తర్వాత బాధపడ్తావ్"

"నేను తాగాలని హుకుం యిస్తే తాగుతాను. కానీ మీ యింట్లో చేరి తాగను".

''అయితే అక్కడే వుండు. అక్కడే అందరం తాగుదాం''.

అప్పటికప్పుడే గార్డెన్‌లోనికి కుర్చీలు బల్లలు వచ్చాయి. నిముషాల్లో ఒక మూలకు ఒక బార్ తయారయిపోయింది. దూరంగానే నిల్చుని గ్లాసు అందుకున్నాడు. పెడ్రోకూర్చోమని బలవంతం చేస్తే కాస్త దూరంగా నున్న బల్లమీద కూర్చున్నాడు. లోనించి మంచి సంగీతం వినిపిస్తోంది. అది రికార్డు సంగీతం కాదు. పియానోమీద మేడమ్ క్లాటినా మెనేజెస్ వాయిస్తోంది. అప్పుడప్పుడూ ఒక చిన్న పిల్ల గొంతుక తల్లి గొంతుకతో కలుస్తోంది.

''నీ కూతురు గ్రేస్ గొప్ప సంగీత నిధి అవుతుందని'' తాగుడుమైకంలో పడక ముందే ఒక అతిథి సెలవిచ్చాడు. మిగతా యిద్దరు అతిథులు యేకీభవించారు.

''పెడ్రో! ఈ పార్టీ నీకోసమే యేర్పాటు చేసాను. నీ వాళ్లనే పిలుస్తే నువ్వు సేవకుడివని, శూద్రుడవని అనుకుంటావని యీ పెద్దలను పిల్చాను. మాడు యితను నీకు తెలుసును. డాక్టరు కాదుకాదు లాయరు... కాదు కాదు... డాక్టరు లాయరు. ఎడ్డీ రాడ్రిక్స్...''

''మీర్లు సింహాస నం యెక్కించినా తమలాంటి వాళ్ల నన్ను శూద్రుడే అంటారు. లేకపోతే సింహాసనం యెక్కిన శునకం అంటారు''.

''కాక్‌టెయిల్‌లో దిగకపోతే మనం మన హోదాలను, కులాలను వదులుకోలేం... రండి - తాగుదా - డాన్సు చేద్దాం - ఇది గోవా-గో-గే'' అంటూ గెంతడం మొదలు పెట్టారు. పోర్చుగీసు ట్యూనుకి అనుగుణంగ నలుగురూ! పియానో ఆగిపోయింది.

అలా మాస్తున్న పెడ్రో తాగినట్లే జూగుతున్నాడు. కొద్ది సేపట్లో గెంతడం మొదలు పెట్టాడు. ''గోవా - నాగోవా - నా ప్రియురాలు గోవా... అంగడిలో కోవా - నాగోవా'' అని కొంకిణీలో అరుస్తూ తప్ప తాగిన వానిలా గెంతుతూ వాళ్ల దగ్గరగా వచ్చేసాడు.

'పెడ్రో...పెడ్రో...ఇదిగో... ఈ కాగితం మీద వేలిముద్రపెట్టు...''

''పెడ్రోజూగుతూ వెళ్తాను! నీవు హుకుం జారీ చేస్తే పెట్టడం మాన్తావా? ముందు యీ ముగ్గురెవరు చెప్పు? చెప్తావా లేదా?''

''చెప్పాను కాదా! ఇతను డాక్టరు లాయర్. అతను గాంకర్... మూడోవాడు మమలత్‌దార్...''

''వాళ్లంతా యీ తమ్మార్కకి సాక్షులా?''

''ముందుపెట్టు''

''నేను పెట్టను''

''పెట్టవా?''

''పెట్టను''

''నివ్వా నీ బాభు పెట్తారు. ''అంటూ ఎవరక్కడ? అన్నాడు రోనీ. నలుగురు నిశాచరులు చుట్టూముట్టారు.

''పెడ్రోపెట్టకపోతే ఆ బొటన వేలు విరిచి మరీవేలి ముద్ర పెట్టించండి'' గొణిగాడు రోని.

తాగినా, హద్దులు మీరని పెడ్రో చుట్టూ వున్న నల్గురి వేపు చూశాడు. నిల్చున్న వాళ్లు నల్లపులుల్లా వుంటే, వంగొనివున్నా పెడ్రోమధ్యను చిక్కుకున్న చెవుల పిల్లిలా వున్నాడు. ఇంకోగతిలేదు. పలాయనం చిత్తగించవలసిందే. ఇద్దరి మధ్యనించి ఒక్కటే పరుగును లంఘించుకున్నాడు. అడ్డదారంట పరుగెత్తలేదు. మనుషులు నడిచే మార్గంలో పడ్డాడు. వెనుక నించి రోనీ కేక వినిపించడంచేత ఆ నల్గురు కాంపౌండుదాటి వెళ్లలేదు. తిరిగి వస్తున్న వాళ్లతో.

''అదివేట కుక్కకాదు. అందుకే తోక ముడిచి పరుగెత్తింది. వస్తాడు - వాడే వస్తాడు - నా పేరటవేసిన యెంగిలి మెతుకులు, యెముకలు యేరుకోడానికి వస్తాడు. వాడే వస్తాడు - తప్పక వస్తాడు'' అంటూ నల్గురిచేత నాలుగు బుడ్డీలు వేసి'' వెళ్లండిరా - ఇళ్లకు పోయి యింటంతా తాగండిరా...'' అన్నాడు రోనీ.

మరునటి ఉదయం రోనీ పెరటి తోటకు, నల్లని గుట్టకు మధ్యనున్న జాగాలో జన సంచారం కనిపించింది. ఎప్పుడూ కిటికీలనించి దృష్టి సారించడం ఒక అలవాటుగా పెట్టుకున్న క్లాటినా ''రోనీ అటుచూడు'' అంది. రోని మాస్తుంటే రాబోయే ప్రమాదం గురించి క్లాటినా వర్లిస్తోంది.

''అనుకున్నట్లే వచ్చాడు. రానీ వాడినోట్లో దుమ్ముకొట్తాను. కొరకలేని యెముకలే కొరకడానికిస్తాను. అది కొరుకుతూ కొన్నాళ్లు కుక్కలా కొంతకాలం మనపెరటే వుంటాడు. తర్వాత అలవాటై రాత్రీ పగలూ యీ యింటికి కాపలా కాసుకుంటూ వుంటాడులే...'' అన్నాడు రోనీ.

''నాకేం నమ్మకంలేదు. వాడి బుర్రలో పుట్టిన బుద్ధి కాదిది. ఎవడో వీడ్నిలా ఆడిస్తున్నాడు...''

ఈ మాటలు క్లాటినా నోట్లో వుండనె వున్నాయ్ రోనీ పెరటితోట చివరకు వెళ్లి అరిచాడు.

''నా జాగాలో యెందుకు కాలుపెట్టావ్?''


పెడ్రోతోపాటు పనిలో నిమగ్నమైన పెళ్లం గొరెట్టీ, పండ్రెండేళ్ల కొడుకు పవులో ఆగి చూసారు.

''చెప్పరా! నా భూమిలో యెందుకు కాలుపెట్టావ్?''

''ఇది తాతలకాలంనించీ మాభూమే''

''మీ తాత బలవంతం మీద మా భూమిని ఆక్రమించి రాసుకున్నాడు''

''మీ తాతే బలవంతాన యిప్పుడు తమరున్న భవనం మా జాగాయే



ఆక్రమించుకున్నారు"

"ఇన్నాళ్లా గడ్డి తిన్నావా? ఎముకలు కొరికేవా? ఎప్పుడూ యీ జాగాలోనికి రానివాడివి యిప్పుడే యెందుకొచ్చావ్?"

"నాలుగు రోజుల క్రితమే నాకు తెలిసింది. ఈ జాగాని కాజేసి మామిడి తోట వెయ్యాలనుకుంటున్నారటగా! ఆ తోటనేనే వేస్తాను".

"ఏడిశావ్! తోట వేసి పెంచిన ముఖమే అది. ఇదిగో చెప్తున్నాను. బాగా విను. నివ్వు నాటిన యే మొక్కా మరుసటి రోజుకు మిగలదు. ఇదిగో చూడు... యిప్పుడే వేరుచేసిన యీ తీగెల కంచెను కూడా పీకేస్తున్నాను. ఆ జాగా నాది" అంటూ రోనీ తీగలకంచెను బలవంతాన తన్ని త్రోసివేశాడు.

## 3

ఇది అద్భుతమైన బొమ్మ. ఇక్కడ నించి అక్కడ నించి రాలేదు. వేలాది మైళ్ల ప్రయాణంచేసి లిజ్‌బన్ నించి వచ్చింది. గ్రేస్‌ని ముద్దాడి ఆ బొమ్మని చేతపెట్టూ ఆ పోర్చుగీసు అధికారి "పోర్చుగల్‌లో వున్న అన్ని బొమ్మల్లోనూ అందమైన బొమ్మను యెంచి తెచ్చాను. కానీ నీ అందం యెదరగా యిది దిష్టి బొమ్మలా వుంది" అన్నాడు.

"అది అతిశయోక్తి కాదు" క్లాటినా మనస్సులో నున్న గర్వాన్ని బైటకు యీ మాటతో కక్కేసింది.

అనుకున్నట్లు జరగకపోతే, రోనీ దెబ్బతిన్న సింహంగానో, దెయ్యంపడ్డ మనిషిగానో మారతాడు. తేలుకుట్టినట్లు గెంతుతాడు. తలగొరుక్కున్నట్లు బాధపడ్డాడు. అందుకే బుర్రని రాపాడించి ఒక పిడుగును సృష్టించాడు.


తెల్లారే సరికి ఆపిడుగును ఫిరంగి గుండులా విడిచిపెట్టాడు.

ఊరిబయట పొలాల దగ్గరలో యెలక కన్నాల్లా వున్న పూరిపాకల దగ్గర ఆ పిడుగు పడింది. శబ్దంలేని ఆ పిడుగు వల్లగా జారింది. అంత వరకూ పాక యెదురుగా నున్న పనసచెట్టు మీద కూర్చొని నాటు పిల్లన గ్రోవిని వూదుతున్న పవులో ఆ పిడుగును కనుక్కున్నాడు.

"వస్తున్నారు - అదిగో వస్తున్నారని" అరిచాడు. ఆ అరుపులో సంగీతం వుంది. ఒకరు కాదు, యిద్దరు కారు పాకలో వాళ్లంతా పైకి వచ్చి అదే పనిగా పిల్లిని చూసి పరిగెత్తే యెలుక మందలా చిందర వందరగా పెరట పొలాలవైపు ఆడామగ పిల్లాపిచిక పరుగెత్తసాగేరు.

కదలనిది ఒక్క పెడ్రో. కొడుకును ఆ చెట్టుమీదే వుండమన్నాడు. పెళ్లాన్ని పాకలోనే తలదాచుకోమన్నాడు. వచ్చిన ముగ్గురు పోలీసు జవానుల్లో పెద్ద.

"ఏయ్ - ఇక్కడ పెడ్రో ఫెర్నాండిస్ యెక్కడ?"




"నేనేనండి"

"వాడి కొడుకు పవులో ఫెర్నాండిస్ యెక్కడ?"

"వాడి అవసరం యేం వుందండి?"

"ఏం తెలియనట్లు అంటున్నావ్? వాడు దొంగతనం చేసాడు".

"నా కొడుకు దొంగా? ఈ నేరాన్ని, చెయ్యని నా కొడుకు మీద రుద్దుతున్నారు".

"పెద్దా చిన్నా తారతమ్యం లేకుండా యేమిటావాగుడు?"

"నా కొడుకు చేసిన దొంగ తనమేమిటి?"

"మిష్టర్ రోనీ మెనేజెస్ యింట్లో దొంగతనం చేసాడు"

"ఆ చుట్టుపట్లకే వెళ్లడే - దొంగతనమా?"

"అవును, వాళ్ల అమ్మాయి రబ్బరు బొమ్మను దొంగలించాడు"

"నయం! వాళ్లమ్మాయిని దొంగిలించాడనలేదు"

ఉక్రోశంతో అప్రయత్నంగా పెడ్రోనోట్లోనించి యీ మాటలు యింకా సరిగ్గా రానేలేదు, ఆ పోలీసు అధికారిచేత నున్న పిస్టల్ రివాల్వర్‌తో మూతి మీద ఒక్కపోటు పొడిచాడు. పెడ్రోనోటినించి రక్తం కారింది. మీద వున్న చిరిగిన చొక్కాతో తుడుచుకుంటుంటే, కొడుకు పనస చెట్టుదిగి తండ్రి చెయ్యి పట్టుకుని పోలీసువేపు కొరకొరా చూసాడు.

పోలీసు అధికారి కోపం "ఊ" అని కఠోరమైన స్వరంతో బయటపడగానే మిగతా యిద్దరు పోలీసులు పవులో చెరో చెయ్యి పట్టుకుని యీడ్చుకుంటూ పోతుంటే, కాళ్లూ చేతులు కొట్టుకుంటూ యేడుస్తున్నాడు. తండ్రీ తల్లీ చేసేది లేక వెంటపడ్డారు.

రోని వరండాలో తన యెత్తు కుర్చీమీద కూర్చున్నాడు. పకపక నవ్వుతూ మాటాడుతున్నాడు: న్యాయాన్ని నిలిపే మేజిస్ట్రేటులా వ్యవహరిస్తున్నాడు. పోలీసులు అతని న్యాయాన్ని అమలు పరుస్తున్నారు. అందుకే అప్పటికే ఒక ప్రక్క ఒకడ్ని దొంగతనం చేసాడని కొరడాతో బాదుతున్నారు. ఇంకొకడ్ని యించుమించు నగ్నంచేసి యైసు పలక మీద దొర్లిస్తున్నారు. అమ్మో అన్న కేకలు వినిపిస్తుంటే యింకోడ్ని నిజం చెప్తావా లేద అని భూమిలో సగం వరకు పాతిన బీరు సీసా మీద ముడ్డి ఆన్పించి నొక్కుతున్నారు. ఇవన్నీ చూస్తున్న పెడ్రోగుండె పగిలిపోతోంది. ఇవన్నీ నేరం చెయ్యని తన కొడుకు చేత చెయ్యిస్తారు. ఇంతలో బయట రోడ్డు మీద కోలాహలం. పెద్దలకన్న, పిల్లా పిచుక గోలచేస్తూ నేరస్థుని వెంటవస్తున్నారు. ఆ నేరస్థుని మెడలో వాడు దొంగిలించిన కొబ్బరి కాయలు మాలగా వేసి వూరంతా వీధి వీధిలో త్రిప్పి పోలీసు చౌకీకి తీసుకపోడానికి యిక్కడికి తెచ్చారు.

నవ్వుతున్న నరపశువుని చూస్తున్నాడు పెడ్రో. పెడ్రో మనిషే! అందుకే వాడిలోనూ కలవరం అల్లుకుని కల్లోలమైన మనసుతో ఓ క్షణం "ఒకటే కోర్కె! నాదగ్గిరున్న కత్తితో ఆ పచ్చని చెట్లని నరికే బదులు, యీ నరపశువుని నరికేస్తే లోకానికి వుపకారం జరుగుతుంది.". అనుకున్నాడు తనలో అనుకుని ఆవేశం చెందుతుంటే వెనుకనించి, యింతవరకు గుండెలో దాక్కున్న దుఃఖం వుబికిరాగా యేడుస్తున్న గొరెట్టే వేపు చూశాడు. తనకన్న పొడగరైనా పొట్టిగా వుండాలని నడుమైన వంచుతుంది, లేద తలైన దించుతుంది. గొరెట్టే తండ్రి బ్రాస్‌బేండ్ వాయించడంలో పేరు పడ్డాడు. ఆ బాంధు రంగులో పసుపుపచ్చని శరీరంతోపాటు, ఆమె గొంతుక పలికిన పలుకుల్లో, యేడ్చిన యేడుపులో కూడా సంగీతంబాణీ మిళితమై వుంటుంది.

కొద్ది క్షణాలనించీ తనను వుక్కిరిబిక్కిరి చేస్తూ స్వాధీనం చేసుకున్న అపనమ్మకం, ఆవేశం-రెండూ ప్రేరేపించిన హింస కారుమేఘాల్లా మనసులో ఆవరించింధి. ఆమెవేపు చూస్తూంటే, రానురాను ఆవేశం పటాపంచలై పోయాయ్.

"గొరేట్టే అంటే నాకు పంచ ప్రాణాలు. పవులో అంటే గొరెట్టేకి సర్వస్వం. వీళ్లిద్దరూ బతకాలంటే యీ అన్యాయాన్ని న్యాయంగా స్వీకరించ వలసిందే..." అనుకున్నాడు.

రోనీ ప్రక్కనున్న వ్యక్తి అంతకంటే వున్నతాసనం మీద కూర్చున్నాడు. రోనీ యీ దివార్‌కి రెజిదార్ అంటే గ్రామపెద్ద అయితే, అతను పంజి నించి వచ్చిన పోర్చుగీసు అడ్మినిస్ట్రేటరు. ఆ అడ్మినిస్ట్రేటరు రోనీ మాటాడినది వింటూ

విరునవ్వులు వెలగ బోస్తున్నాడు. నిల్చొని అక్కడ చేరిన వాళ్లనుద్దేశిస్తూ రోనీ అంటున్నాడు.

"ఈ గోవాలో ఘనత వహించిన పోర్చుగీసు పరిపాలన ధర్మమా అంటూ మనకు అంగటి తలుపులు నిత్యం తెరచివుంచే ఆనవాయితీ అలవడింది. ఇళ్లకు ఆరడుగుల కిటికీలున్నా యినుప జివ్వలతో కప్పే అవసరం కలగలేదు. ఒకరి సొత్తు యింకొకరు సాధారణంగా ముట్టుకోరు. ఇక యిన్ని వందల సంవత్సరాల పోర్చుగీసు పాలనలో గోవాలో ఒక్క ఖూని జరగలేదు. కారణం? అదిగో చూడండి. మీ యెదరగా యేం జరుగుతోందో? నేరం చేసిన వాళ్లకు పడ్డ శిక్ష యేమిటో పెద్దవాళ్లకు తెలుసు, పిన్నలకు తెలుసు..."

తల్లి యేడుస్తోంది. గానీ కొడుకు యేడవలేదు. చేతిలో పిల్లన గ్రోవి పట్టుకునే నిల్చున్నాడు. "తల్లి రూపు వాడిది. సరియైన తిండేవుంటే ఆ ప్రక్క యెముకలు కనిపించకపోను. ఆ చర్మంపై మట్టిని రుద్దితే బంగారు ఛాయతో మెరిసిపోయేవాడు. హక్కు అయినవాడు కొడుకు తన దగ్గరున్నాడు. హక్కు అయినా అనుభవించలేనిది, యీ పాతిక బారల భూమి. రోనీ ప్రక్కనున్నవాడు అధికారపు పులి. రోనీ ఆ పులి పంజా, ఈ పంజాతో తనపై పురికాడు. ఆ పులి నన్ను చీల్చి రక్తం తాగి మాంసం తింటుంది. రోనీ నా భూమికి డబ్బిచ్చాడు. డబ్బిచ్చినా ఖర్చు అయిపోతుంది. ఖర్చుకానిదేదో యీ లోకంలో వుంది. అది మనిషిని అన్ని విధాల పైకెత్తుతుంది. తనకులేకపోతే పోయే తన కొడుకుకైనా యెందుకుండకూడదూ?"

మమకారం పెడ్రోని మనిషిని చేసి మంచీ, చెడూ బేరీజు వెయ్యించింది. ఒక నిర్ణయానికి వచ్చాడు. నేరం చెయ్యని తన కొడుకు, నేరం చేసి శిక్ష అనుభవిస్తున్న వీళ్లలో చేరకూడదు. చిన్న సైగ చేసాడు. రోనీకి అర్థమైపోయింది. ఇలా జరుగుతుందని తనకు తెలుసు. తోటలో ఒక మూలకు వచ్చాడు. పెడ్రో యెదరగా నిల్చొని.

"ఆ జాగా మీకు అమ్మేసినట్లురాసేయండి. వేలి ముద్ర పెట్టేస్తాను. కానీ ఒక్క షరతు".

"నాకు తెలుసులే! నీ కొడుకు మీద యీగవాల నివ్వనులే".

అదికాదు, ధనం అడగలేదు గృహం అడగలేదు. తమరు చేయగలిగిందే అడుగుతున్నాను..."

"అడుగు"

'నా కొడుకు అజిల్ బడిలో చదువుకునే అవకాశం యిప్పించండి".

"అలాగేలే కానీ నాదీ ఒక షరతుంది"

"శలవియ్యండి"

"ఆ జాగాలో మామిడితోట నివ్వే వెయ్యాల. ఆ తోట చివర్లో నీకు మంచి పాక వేయిస్తాను. నీ కుటుంబంతో అక్కడ హాయిగ వుండు. తోటని పెంచు"

పెడ్రో సంశయించాడు.

"ఏం? సంశయిస్తున్నావ్?"

"ఉన్న బలగంవదిలి రమ్మంటారా? ఈ పెద్దవాళ్ల దగ్గర్లో యీ పేదవాడుంటే సహిస్తారా?"


"నీ కొడుకూ చదివి పెద్దవాడౌతాడులే!"

పిడుగుపడినా పెడ్రోమీద పడలేదు. పవులో మీద పడలేదు. కానీ యింటి ఆవరణలో వున్న ఒక పచ్చని చెట్టుపై పడ్డట్లు, పేరుకే వున్నట్లు చిన్న ఆస్తిపై పడింది.

## 4

అజిల్ బడిలో అంటరాని వాడిలా వేరేగా పవులోని కూర్చోబెట్టారు. ఆ బడికి వచ్చిన పిల్లలందరూ కలిగిన అగ్రజాతి కుటుంబాలనించి వచ్చిన వాళ్లే! ఆ పిల్లల్లో గ్రేస్ కూడా వుంది. ఉన్న యిద్దరు టీచర్లూ అగ్రజాతి వాళ్లే!

స్కూల్లో కూడా పవులో చిరిగిన సంచిలో ఒక మూల మన్నది పిల్లనగ్రోవి. ఒక రోజు ఆటల్లో కూడా పాల్గొనలేని పవులో, ఒక మూల కూర్చొని పిల్లన గ్రోవి వూదుకుంటున్నాడు. కొద్ది నిముషాల తర్వాత అటు ఆటలను ఆపి ఒక్కొక్కరు దగ్గరగా వస్తున్నారు. ఆ వచ్చిన వాళ్లల్లో మొదటది గ్రేస్ అంత ఆటల అలజడీ ఒక్కసారి ఆగిపోయిందేమో అని టీచర్ కిటికీనించి చూసి, యెవరికి ఏమైందోనని




పరిగెత్తుకువచ్చాడు. వస్తూనే పిల్లలను యిటూ అటూ పొమ్మని కేకలేస్తూనే, అప్పుడే ఆపిన పవులో వేపు చూస్తూ.

"ఎందుకాపేసావ్?"

కాస్త బెదురుగా చూసాడు పవులో.

"ఫరవాలేదు పాడు" అని అంతదూరంలో నిల్చున్నాడు ఆ పిల్లలందరు అతని వెనుక మన్నారు.

సాయంత్రం చల్లని గాలి వీస్తోంది. ఆ గాలి యెంత హాయిగా వుందో యీ వేణుగానం అంత హాయిగానూ వుంది. పూలు విడినట్లు సహజంగా వుంది. వర్షపుజల్లులా శుద్ధంగా వుంది. పట్టు తేనెలా పారుతోంది. అంత దూరాన మున్న టీచరు దగ్గరగా వచ్చి పవులో తలపై చెయ్యివేసి

"పవులో! నివ్వు తప్పక గొప్పవాడివౌతావ్!"

గొప్పవాళ్ల బిడ్డలంతా ఒక్కసారి దిగులుతో చూసినట్టు చూసారు. ఆ క్షణాలనించి ఆ టీచరు పవులో మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడు. శ్రద్ధకు తగ్గ ప్రతిఫలం కనిపిస్తోంది. ఒకటి చెప్తే రెండునేరుస్తున్నాడు.


అవకాశం వున్నప్పుడల్లా పవులో, తండ్రి వెనుకవుండి తోట పనిలో సహాయం చేస్తున్నాడు. నాటిన మామిడితోట పెరుగుతుంటే పవులో చదువులో మెరుగులు దిద్దుకుంటూ వేణుగానంలో ఏపుగా తియ్యగా పెరుగుతున్నాడు. ఇంతవరకూ యజమాని యిల్లులోపల చూడని పవులోకి ఒక రోజు అవకాశం దొరికింది. క్లాటినా గబగబ పెరటికి వచ్చి గొరెప్పేకోసం కేకవేస్తే పవులో వచ్చాడు.

"ఈవేళ పనివాడు రాలేదు. ఇల్లు తుడిచి తడిగుడ్డతో తుడిచె" అని ఆర్డరు వేసింది. ఈ వేళ చాల ఉత్సాహమైన వార్త విన్నది. పొరుగునే వున్న కన్నవారిళ్లు పదేళ్లు పదేళ్లనించీ ఖాళీగానే వుంది. ఆ ఇంటి వారసుడు ఆమె అన్నయ్య జోస్ త్వరలో వస్తున్నాడు. ఈ సారి యింక తిరిగి వెళ్లడట. ఇక్కడే మిగతా జీవితం గడుపుతాడట! వాడికా బిడ్డాపాపాలేరు. పెళ్లాంపోయి ఏడాదైంది. పెళ్లాం పోయాక తోడూ నీడా లేకపోవటం చేత బొంబాయి అంటే విసుకు పుట్టిస్తోందట. అందుకే వచ్చేస్తున్నాడు. అన్నయ్య సాధించవలసింది! చెయ్యవలసింది యేమీ లేదుగానీ కనీసం పది మాటలకు ఒక పలుకైనా పలికి దగ్గరౌతాడని ఆమె ఆశ.

ఈ ఆశలను వెళ్లగక్కడానికి వెంటనే యెవరూ దొరక్కపోవడంతో, తోటలో పెరుగుతున్న మొక్కలవేపు, విడివడుతున్న పూలవేపు, పండుతున్నకాయలవేపు చూస్తూ, యెంత సేపటికోయింటివేపు వస్తుంటే యెవరో లోన విజిల్ వేస్తూ పాడుతున్నట్లు వినిపించింది.

గబగబా మెట్లెగ్రాకి వరండాలోనికి వెళ్తే పవులో విజిల్ వేస్తూ పాడుతుంటే, గ్రేస్ గొంతుక విప్పి పాడుతోంది.

"ఆపుతావా లేదా" అని అక్కడనించే అరచిలోనికి వచ్చింది. తడి గుడ్డతో




హాలు తుడుస్తూ విజిల్ వేస్తూ పాడుకుంటున్న పవులో వేపు యెర్రగా చూసి.

"గొప్ప వాళ్లింట్లో యిలాంటి పన్లు మళ్లీ చేస్తే ఆ నాలిక కోసేస్తారు - తెలిసిందా ? వెళ్లు" అంటూ ఆ గుడ్డను లాక్కుంది. ఎదుటి వాళ్లు తనకన్నా బాగా పాడినా, యింకెవరికైనా మంచి నగలున్నా ఆమె అసలే సహించలేదు.

పవులో మెల్లగా మెట్లుదిగిపోయాడు. ఆ యీలపాట వినడానికి వచ్చిన చిలుకలు, గోరింకలు, బంగారు పిచ్చుకలు ఒకటి తరువాత ఒకటి యెగిరి పోతుంటే యింటికి వెళ్లిపోయాడు. ఇల్లు తుడవమంటే సిగ్గుపడలేదు గానీ, పాట ఆపమంటే బాధపడ్డాడు. ఇప్పుడు పవులోకు నూనూగు మీసాలొస్తున్నాయ్. మంచేదో చెడుగేదో తెలుసుకునే వూహలు తిరుగుతున్నాయ్. అందవందాలంటే ఆపేక్ష కలుగుతోంది. కోరికుంటేగానీ కొనసాగించుకోవాలన్న పట్టుదల రాదన్న భావం మొలకెత్తింది. చదువుతో, గదిలో మూసిన కిటికీ తెరువబడింది. గాలీ వెల్తురూలోనికి వచ్చింది. బయటనున్న మనోహర ప్రకృతి కిటికీ గుండా కన్పిస్తోంది.

ఆర్థికంగా అంతస్థుల వారిగా అధములైన వారి సంతానం తను. అలాంటిది గౌరవం పొందాలంటే ఆర్థికంగా మెరుగుపడాలి. అది అంత సులువుకాదు. ఏదోగారడి చేసో సాముచేసో, సాకులు చెప్పో కాసులు గడించి గౌరవం పొందేకన్నా మెరుపులా వున్న యీ మురళీ ధ్వనిని అందుకుని, దీపంలా నిత్యం వెలిగేటట్లు చేసుకుంటే? దానికి శిక్షణ కావాలి.

ఆశ నిరాశ టగ్ఆఫ్‌వార్‌లో చిక్కుకుని గంతులిడుతున్న వయసు పవులో దిప్పుడు. తృప్తి జెందలేదు. మేను మరువలేదు. ఏవేమో చేసేద్దామన్నా వుబలాటలో చిక్కుకున్నవాడు. మండుటెండల్లో, పండువెన్నెల్లో క్రమంతప్పకుండా వేణుగానం చేస్తున్నాడు.

ఈ స్వరం సహజంగా వుంది. ఇందులో ప్రాణంవుంది. తెరచివున్న కిటికీల దగ్గర నిల్చొని ఎందరెందరో వింటున్నారు. చెట్ల మీదనున్న పక్షులేకాదు - పూచిన పూలు, పూయలేని ఆకులూ వింటున్నాయ్.

ఒక రాత్రి పవులోకు వచ్చిన ఒక స్వరం వినిపించింది. ఏదో దివ్యస్వరంలా అన్పించింది. ఆ స్వరంలో ఒక రీతి వుంది. ఒక సమన్వయం వుంది. అడ్డదిడ్డంగా పరిగెత్తే ఒక గుర్రానికి కళ్లెంలా వుంది. రాలిన ఆరముగ్గిన పండును కోసి యెవరో తినడానికి ప్రసాదించినట్లుంది.

జోస్ యింటినించి వచ్చే బేండు సంగీతం అది. ఏ జన్మలోనో తనతో పరిచయం వున్న స్వరం మళ్లీ తన గొంతుకనించి రాబోతున్నట్లు అనిపించింది. ఒక రాత్రి కాదు. వరుసలా ప్రతిరాత్రీ వినిపిస్తోంది. యెల్లవేళలా తన దగ్గర గౌరవమైన, పవిత్రమైన ప్రాణిగా ఆ కళను తనదగ్గర వుంచుకోవాలంటే, యీ వయసులోనూ సాధన అవసరం వుందని తెలుసుకున్న కళాకారుడీ జోస్. ఇతని సాంగత్యం కుదిరితే ... ఎంత అదృష్ట వంతుణ్ణి అనుకున్నాడు పవులో!

తనంత తాను వెళ్ళి అడుగలేదు. ఆ స్వరం విన్నాక తను అడ్డదిడ్డంగా వాయించే మురళీనాదంమీద మోజుపోయింది. చేతిలో పిల్లన గ్రోవి వున్న చెట్టుపై కూర్చున్నవాడు ఒకసారి వాయించి మధ్యలో ఆపేసాడు.

"ఆపేసావేం?"

తిరిగి చూస్తే తన యింటి కిటికీ దగ్గర్లో నిల్చుని జోస్ అన్నమాటవిని - గబగబా చెట్టు దిగి అటువేపు వెళ్లాడు.

"నేనెక్కడా నేర్చుకోలేదు"

"అందుకే అంత సహజంగా వుంది. కోరకుండా దేవుడిచ్చిన వరంయిది. ఇది విడిచిపెట్టి దేవునికి దూరం కావద్దు పాడు."

పవులో ఒక సంగీత కళానిధి యెదరగ భయపడ్తున్నట్లు వాడి ముఖ భంగిమలే చెప్తోంది.

"అంతస్థులు మనిషి సృష్టించినది - కళ దైవసృష్టి. అంచేత కళకు అంతస్థులు లేవు".

పవులోకు యిదంతా అర్థమౌతోంద. ఎన్నడూ మాటాడని దేవుడు యిప్పుడు తన యెదరగా నిల్చుని మాటలాడుతున్నట్లు అనిపించి తడబడిపోతున్నాడు.

"నీ వేణుగానం రోజూ వింటున్నాను. అది నా మనసును మహోన్నత శిఖరాలకు తీసుకపోయింది. నేనేమైనా నీకోసం చెయ్యగలనేమో చెప్పు". ఆగి జవాబు రాకపోగానే "మనిషి జీవితంలో రెండే రెండు మాటలతో పెనుగులాడి చచ్చిపోతాడు" అన్నాడు జోస్.

పవులో అదేమిటన్నట్లు చూసాడు.

"అవును, కాదూ, అని! అవునన్నమాట గొప్పమాట. దానికి తిరుగులేదు. శాశ్వత రూపం దాల్చుతుంది. కాదన్నమాట రంగులు మార్చే వూసర విల్లి లాంటిది. ఈ వేళనేను కాదూ అని తిరస్కరిస్తే, అది యేనాటికైనా అవునూ అయిపోతూంది. అవును అనడనికి ధైర్యంకావాలి. అంటే మనిషి స్వంత లాభం నించి కొంత బయట పడాలి...'

ఇంత అని కాస్సేపు వూరుకుని "అవునని" యీకాడు నన్ను నివ్వు మించిపోకూడదన్న స్వార్థంతో నేనునీ గురువుని కాకపోతే, నీ స్వయం ప్రకాశంతోనే నివ్వు నన్ను మించిపోతావ్. ఈ నాటివా "కాదు" యింకోనాడు నీ జీవితంలో "అవును" అయిపోతుంది. నాకు తెలుసు - నీ మనసు! రా లోనికి... రా!"

ఒక దైవ గృహానికి వెళ్లినట్లు పవులో తలవంచుకుని జోస్ నివాసంలో కాలుపెట్టాడు. ఆవరణలో కూర్చోబెట్టి, లోనించి తెచ్చిన ఒక బ్రాసుబేండు చేతిలో పెట్టాడు.

"నా కన్నా ఒక గొప్ప కళాకారుడ్ని తయారు చేసానన్న తృప్తితో నన్నుచావనీ" అన్నాడు జోస్.

## 5

జోస్ సంరక్షణలో, పర్యవేక్షణలో, పవులో సంగీతంతో, సంగీత మంత మధురంగా పెరుగుతున్నాడు. పెద్రో చేసిన సేవతో పాటు నిత్యం యీ సంగీత ధ్వనులతో కూడా మామిడితోట ఏపుగా పెరిగిపోతోంది. ఆ తోటను చూసి, పెద్రో పెంచిన మమకారంతో తనదే అన్నట్లు మురిసిపోతున్నాడు. అలానే యేపుగా పెరిగి అతని సహవాసం, సంస్కారం మూర్తీభవింపజేసుకున్న యీ సుందర మూర్తి పవులో తనవాడు కాదన్న ఆలోచనే జోస్‌లో కలుగలేదు.

పశ్చిమాకాశంలో, ప్రతి సాయంత్రం విహంగాలవంటి మేఘాలు యింద్రధనస్సు రంగులను పీల్చుకొని రూపులు మార్చే చిత్రాలై కదల్తున్నాయ్. పది రకాల మందారాలు, పాతిక రకాల బోగన్ విల్లాలు తెగ పూస్తుంటే, ఆకులన్నీ రాల్చేసి తొగరు చెట్టు యెర్రపు పూల గుత్తులతో నిండిపోయింది.

తొలిసారి మామిడి తోటలో అక్కడక్కడా పూలగుత్తులు కనిపించాయి. తొలి వర్షాలకు ఢాలుగా మిగిలిన మామిడి కాయలు పరువుదేరాయి. వర్షాలతో యెగువనించి ప్రవహించిన నీరు, ఉప్పునీటిని సముద్రంలోనికి తోసి వేసింది.

## పక్షులు...

పంజరంలో పక్షులు పాడవు
అరుస్తాయి!

పంజరపు చువ్వల్ని కొరుకుతాయి!
జానెడు జాగాలోనే
రెక్కలు టపటప కొట్టుకుంటూ
సుడులు తిరుగుతాయి!

పంజరంలో చిలకల్ని బంధించి
మొక్కజొన్న విత్తులు విసురుతు
నువ్వు నీ మాటలు
చిలకల మీద రుద్దుతున్నావు!
పంజరంలోని చిలకలు
నీ మాటలు పాడుతున్నాయనుకుంటే
అది వొట్టి నీ మతిభ్రమ మాత్రమే!

పంజరం తలుపులు తెరిచి చూడు
పక్షులు
భూమిని తన్ని
వినీల విశాల ఆకాశాల్లోకేసి దూకేస్తూ
రంగు జెండాలై రెపరెపలాడుతాయి!

నీ దేశపు
సరిహద్దు గాయాల మీద
స్వేచ్ఛాగానాన్ని నీకు దానం చేస్తాయి!

—వి.పి.చందన్ రావు

దివర్ చుట్టూ యిప్పుడు మంచినీరే!

పరువుదేరిన మామిళ్లు పండనారంభించాయ్. ఇంతవరకూ వరండాలోని కుర్చీమీద నుంచో, గది కిటికీనించో క్రీగంట చూపులతో, మెరిసిపడే పవులో అందాన్ని చూస్తుండిని గ్రేస్, యిప్పుడిక కంటిని మనసును అదుపులో పెట్టుకోలేక పోతోంది. పవులో పాడిన పాటలు ఆమెలోనూ పలుకుతున్నాయి. చర్చిలో ఆమె ముందు వరుసలో కూర్చున్నా, వెనుక వరసలో కూర్చున్న పవులో వేపు దృష్టి యెలాగో ఒకలా పోతోంది. ఇప్పుడు చర్చిలోనూ చాపల్ లోనూ, పెళ్లిళ్లలోను, ఉత్సవాల్లోనూ పవులో బేండు వాయిస్తున్నాడు. ఈ కళనించి పవులోకి విలువ వచ్చింది. వాడి రూపు చూసి. కొందరు యువతులు మదనతాపంలో పడితే వాడి వినయానికి మరికొందరు ముగ్ధులౌతున్నారు. ఇంట్లో యిబ్బందులు రానురాను తొలగిపోజొచ్చినాయ్.

కొడుకు యిలా పైకి వస్తుంటే పెద్రో ఒకనాడు చాపల్ లోనికి వెళ్లి "ఆనాటి నష్టంతో, యీనాటి గొప్ప లాభం పొందాను, చివరికి యేది లాభమోయేది నష్టమో నిర్ణయించ గలిగింది. నివ్వొక్కడివే! రాబోయేది చూడలేని కళ్లునావి! అందుకే యీనాడు మనిషిగా మెసలడం నాబాధ్యత" అని మొక్కుకున్నాడు.

ఈ చివరి వాక్యంతో మనిషికే ప్రధాన్యం యిచ్చాడు పెద్రో, అందుకే తనపని తను నిర్వర్తిస్తున్నాడు. యజమాని యెటువంటి అపోహపడనట్లు మెసలుతున్నారు.

వర్షాలు అదే పనిగా పడిపడి పోలాల్లో పచ్చదనాన్ని సృష్టించాయి. వర్షాలు తగ్గుతూ అప్పుడప్పుడూ యెండకు చోటిచ్చి, వరిచేలు పండనిచ్చాయి. ప్రకృతి కన్నుల పండువుగా ప్రశాంతంగా మనోహరంగా వుంది. ఇది పండుగలు చేసుకునే సమయం. అక్టోబరు నెలలో యిక్కడ ప్రధానమైన పండుగ వచ్చింది. దీన్ని "బనేరాఫీష్టు" అంటారు. ఈ ఫీస్టులో అంతస్థులభేదం లేకుండా అందరూ పాల్గొంటారు. అందరూ కలిసిపోతారు. జన్మానికో శివరాత్రిలా, యేడాదికొకసారి యిక్కడ సర్వం జే జగన్నాథం, అందుకే యిది అందరి పండగ. ఉదయమే చర్చిదగ్గర యిరవైమూడు జండాలు యెగరవేసారు. సాయంత్రం సరిగ్గా నాలుగున్నరకు పూరువూరంతా పొలానికి వెళ్లారు. ఆకాశంలో అక్కడక్కడ మబ్బులున్నా, అవి తెలుపెక్కిపోయి వున్నాయి. వరి కొంకులు పట్టేడుకోసి వాటిని వూరేగిస్తూ మొదట చర్చి దగ్గిరికి తెచ్చి తరువాత గ్రామ సావిడీకి తెచ్చారు. అక్కడనించి ఒకవేపు వయసులో వున్న ఆడపిల్లలు యింకోవేపు యువకులు చేతుల్లో వెదురు బొంగులతో చేసిన పిచ్చికారీ గొట్టాలు పట్టుకొని హోళి పండుగ చేసుకున్నట్లు నిల్చున్నారు. డాన్సులు చేస్తూ వూర్లో వీధి వీధుల్లో కదులుతున్నారు. ఈ గుంపులో గ్రేస్ వుంది. పవులో కూడ వున్నాడు. వచ్చిన చుట్టాల్లో యువతులూ యువకులూ కూడా వున్నారు. ఇలాంటి సమయాల్లోనే సాధారణంగా సంబంధాలు స్థిరమౌతుంటాయ్. సర్వం జే జగన్నాథం అన్నాక లవారి సంతానం ఒకవేపు వేరేగా వుండటం పరిపాటి.

ఉత్సవం కదులుతోంది. బేండుకు తగ్గట్టు డాన్సు చేస్తున్నారు. రాను రాను వుద్రిక్తత హెచ్చిపోతుంది. ఆ వెదురు గొట్టాల్లో "ఆసాడే, థిల్ వూ" (చిన్న చిన్న పళ్ళ)లు నింపి ఒకరిపై ఒకరు విసురుకుంటున్నారు. పవులో గ్రేస్ మీద విసిరితే గ్రేస్ పవులో మీదకు విసిరింది. అలా ఆట అయ్యాక ఒకరినొకరు పట్టుకుని ఆడామగ డాన్సు చేయటం మొదలుపెట్టారు. గ్రేస్ పవులోతో డాన్సు చేసింది. అందరూ శభాష్నన్నట్లు డాన్సు చేసారు.

ఇంటికి వచ్చాక క్లాటినా వెర్రి దానిలా కూతురి మీద అరిచింది. పెద్రోని పిలిపించి.

"నీ కొడుక్కు కంట్రోల్ చెయ్యి. అంతస్థులను మర్యాదలను మరచిపోతున్నాడు".

"స్వంతంగా ఆలోచించే వయసు వాడిది, నాకన్నా తెలివైనవాడు. నేను వాడికేం చెప్పగలను?"

"తండ్రిగా నీకు బాధ్యత వుంది!"

"ఏం నేరం చేసాడని వాడ్ని మందలిస్తాను?"

"పోరా" అని అరిచింది కోపం క్లాటినా.

పెద్రో మెల్లగా మెట్లు దిగిపోయాడు. మరుచటి రోజంతా కాలుకాలిన పిల్లిలా యింట్లోనే యీ గదినించి ఆ గదికీ ఆ గదినించి యీ గదికీ కూతురెక్కడుంటే అక్కడ అర్థం పర్థలేకుండా తిరిగింది. పరుపెక్కితే అది కుక్కిమంచంలా అనిపించింది. పచ్చని యింట్లో పవులో పిశాచంలా దాపురించాడు ఆమెకు. వాడితో పబ్లిగ్గా డాన్సు చేసి కూతురు వాడి రూపును మనసులో నాటింపజేసుకుంటే, ఆరూపు రేఖలను చెరపలేదని భయం. అందుకే ఆ రాత్రివాడు వాయిస్తున్నా బేండు కూతుర్ని విననీయకుండా కిటికీ తలుపులు మూసేసి, తన పియానో దగ్గరకు చేయిపట్టుకుని యీడ్చుకొచ్చి కుర్చీమీద కూర్చో బెట్టింది.

"నీకు సంగీతం అంటే యిష్టం - విను" అంటూ పియానో మీద ఒక కొంకిణీ గీతం ఆలాపించింది. క్లాటినా, ఆ గీతం అయిపోయాక దీని అర్థం తెలుసుకున్నావా? అంటే కూతురు జవాబు చెప్పలేదు. ఆగకుండా అదే గొంతుకతో "ఈ రత్నంకోసం యెన్నెన్నో మొక్కులు మొక్కాను. తొమ్మిది నెలలు శ్రమ పడ్డాను. ఈ రత్నాన్ని యెవరు దొంగిలించలేరు" అంటూ దగ్గరగా వచ్చి కూతురిని ముద్దులాడింది.

''దేముడే దొంగిలిస్తే?'' అంది కూతురు.

''వింతగా మాటాడుతున్నావ్. వింతగా ప్రవర్తిస్తున్నావ్ - ఇదంతా యేమిటో?''

''నా ప్రశ్నకు జవాబీయ్''

''పిల్లల ప్రశ్నలకు తల్లులు జవాబివ్వక్కర్లేదు''.

''ఏం?''

''ఆ ప్రశ్నలన్నీ చిలిపి ప్రశ్నలు అయినా అడిగావు కాబట్టి చెప్తున్నాను. అదృష్టవంతులవేవి దేముడు దొంగలించడు. ఇక నేను ఆ అదృష్ట వంతురాలని యెలా చెప్పగలనో తెలుసా? అదృష్ట వంతుడ్ని పెళ్లాడాను. అదృష్టవంతురాలైన కూతుర్ని కన్నాను''.

తిరిగి వెళ్లిపోడానికి లేచింది కూతురు.

''ఎన్నాళ్లయింది నీవు పియానో ముట్టుకోలేదు - రా - రా పాడుతూ వాయించు'' అంటూ బలవంతాన కూర్చో బెట్టింది.

ఆమె వాయిస్తూ పాడుతుంటే యెడారినుంచి వచ్చే వడగాల్పులు చల్లారిపోయినట్లు క్లాటినా కోపం పటాపంచలై, ఆమె పెదిమల్లో చిరునగవు బిందులు తొక్కింది. పూలబాటలా లేడి పరుగులా, నెమలి నృత్యంలా ఆ



సంగీతాన్ని వూహించుకుని, చివరకు ఆ వేడిదెబ్బ తిన్నట్లు, పూలు రాలిపోయినట్లు నెమలి సొమ్మసిల్లినట్లు గ్రేస్ కంటతడి నవ్వులో అర్థం చేసుకున్నట్టుంది! ఈ స్వరం ఆగగానే ఓదార్పులా వాగే బేండు స్వరం. హృదయభారం తగ్గించే మధుర సమ్మిళిత స్వరం అది. సొమ్మసిల్లిన నెమలి యీ ముత్యాల వసతో తేరుకొని, పురి విప్పబోతుంటే, క్లాటినా పెదవి విరిచింది.

ఈ కూతురి పియానో పలుకులతో రాసిన ప్రేమలేఖకు, జబాబులా అటు నించి ఆ బేండు స్వరం! అతుక్కున్న గుండెల అపురూప శబ్దాల రూపకల్పన యీ సంగీతం!

అర్థరాత్రి దాటినా, క్లాటినాకు నిద్దరపట్టలేదు, వరండాలోనికి వస్తే వెన్నెల కురుస్తోంది. అంత అందమైన పూలతోట యెదరగా నున్నా యేంటో ఆవేదన. తన సుఖమంతా యీ కూతురు చుట్టే ప్రదక్షణ చేస్తోంది. ఈ కూతురు లేకపోతే తన బ్రతుకే లేదు. తాను కాంతి విహీన అవుతుంది. చివరి ఘడియల్లో తన కళ్లకు యీ కూతురి అపూర్వమైన అంగసౌష్టవం కనపడాలి. తను వూహించలేని అందంతో పుట్టింది. అది పెరిగాకే, మనిషికన్నా దేముడే అందాన్ని అతివైభవంగా సృష్టించ గలడని నిర్ధారణకి వచ్చింది. కూతురి శరీరంలో ఏ ఒంపు తిరిగినా అందానికే దోహదం చేసింది. అలాంటి కూతురు జీవితమంతా కష్టాలతో ఒంపులు తిరిగితే యెముకల గూడుగా మిగులుతుంది. ఈ సొగసు చూసి సొమ్మసిల్లే బదులు, ఆ సొగసే సొమ్మసిల్లుతుంది. దీనికొక్కటే మార్గం. యౌవ్వనంతో యెగిరి అడవి గుర్రంలా గెంతుతోంది. గుర్రంమీద జీనువేసి రౌతు నెక్కిస్తేగానీ దీని మత్తు అణగదు. సరైన వాడ్ని చూసి దీన్ని కట్ట పెట్టేయాలని నిర్ధారించుకుంది.

## 6

ఇది వరకు వీధిలో వాళ్లపై నున్న కోపం యిప్పుడు యింట్లో వాళ్లపై కూడా క్లాటినా చూపిస్తోంది. కూతురు సహించలేక "ఎందుకింత చిరాకని" విసవిస లాడితే

"నేను కోతిని సృష్టించలేదు. నా గ్రేస్ అందాన్ని దేశ విదేశీయులు మెచ్చుకుంటున్నారు...రా...కళ్లు తెరచిచూడు. ఈ భవనం... యీ బట్టలు... ఈ ఖరీదైన బంగారు నగలూ... యీ సింగారం... తరతరాలు అనుభవించినా తరగని సంపద..."

"ఇవన్నీ దేనికి?" అంది గ్రేస్


"నిన్ను సుఖపెట్టడానికి?"

"ఇదంతా నిజంగా సుఖ పెడ్తుందా?"

"లేమివాళ్లెందుకు దుఃఖంలో మునిగిపోతున్నారు?"

"నీవు చూపిస్తొచినవన్నీ దేవుడిచ్చిన బహుమతులేనా?"

"ఆ దేముడే వల్లని చూపు చూడకపోతే యివన్నీ సేకరించగలమా?"




"ఈ బహుమతులతో మనమే సుఖపడగలం. ఇవే నిజంగా దేవుని బహుమతులైతే అందరినీ సుఖపెట్టగలిగేవే?"

"ఈ చెత్తకబుర్లు నాదగ్గర చెప్పక.ఈ రోజుల్లో నీకే సైతాన్ పట్టాడోగానీ నా జీవిత విధానం, గమ్యం మీద తిరుగుబాటు చేస్తున్నావ్, అధికారాన్ని ధిక్కరించే దేశద్రోహిలా మారిపోతున్నావ్. తల తిరుగుతోందా? బుర్రలో పురుగులు కదుల్తున్నాయా?"

"లేదు ఇప్పుడే స్వతహాగా ఆలోచించగలుగుతున్నాను".

"అలాగా! ఏదీ ఆ వికసించిన బుద్ధితో నీకు సుఖాన్నిచ్చే దేదో చెప్పు?" అని వెటకారంగా అడిగింది. గ్రేస్ కాస్సేపు యిటూ అటూ చూసి యెదరగా గోడపైనున్న ఒక ఆయిల్ పెయింటింగ్‌ని చూపించి

"అది"

"ఇంకా?"

అంతలో బేండు వినిపిస్తోంది జోస్ యింటినించి.

"అది!"

క్లాటినా అరచేతితో బల్లమీద తలకొట్టుకున్నట్లు డబ్బున బాదింది. కూతురు చప్పుడు చేసినా వూరుకోలేదు.

"ఆ సంగీతం, ఈ చిత్రం దేవుని సృష్టి... అందుకే అవి యెవరికైనా ఆనందాన్ని కలుగజేస్తాయ్"

క్లాటినా కూతురి వేపు కొరకొరా చూసింది. చిల్లంగి పెట్టినట్లు చూస్తున్నా మనసులో ఒక నిర్ణయాన్ని రూఢి చేసుకుంది.

ఆ వారంలోనే ఒక సాయంత్రం డ్రాయింగ్ రూములో క్లాటినా గొంతుక వినిపిస్తోంది. ఆమెతోపాటు ఆమె అన్నయ్య జోస్, పొరుగు ఎడ్డీరాడ్రిక్స్ వున్నారు. అటు ఎడ్డీ యిటు క్లాటినా గొంతుకలే వినిపిస్తున్నాయ్.

"అబ్బాయ్ జడ్జికూతురు బదులు గ్రేస్‌ను పెళ్లాడటానికి ఒప్పుకుంటు న్నాడంటున్నావ్. దానిని బట్టి అందందే అగ్రతాంబూలం అని రుజువయ్యింది. అయితే అబ్బాయి లిస్బన్‌లో సెటిల్ అయిపోయాడంటున్నావు. నాదో షరతుంది గ్రేస్‌ని యెవరు కట్టుకున్నావాడు మాయింట్లోనే వుండాలి".

'అలా అంటే యెలాగ?" అన్నాడు ఎడ్డీ.

"నా కూతురి ముఖం చూడకుండా, నే నొక్కరోజు బ్రతకలేను— నిన్ను లాయరుగా అడుగుతున్నాను - నాకు ఆ హక్కులేదా?"

"డాక్టరుగా గ్రేస్ అనారోగ్యానికి మందులిచ్చినప్పుడు నీ ఆరాటం గుర్తుంది. ఆ ఆరాటం చూస్తే తప్పక నీకు ఆ హక్కు సంక్రమించాలి. కానీ లాయరుగా అడిగితే పెళ్లయిన మరుక్షణం నించి గ్రేస్‌పై హక్కంతా భర్తది అవుతుంది. ఎన్ని కోర్టులు తిరుగు అపీలు లేదు.

"ఇదెక్కడి న్యాయం?"

"న్యాయం అదృష్టవంతుల పక్క వుంటుంది.

"ఏం-నాకంటే అదృష్టవంతులు యీ వూర్లో యింకెవరైనా వున్నారా?" అంది సగర్వంగా క్లాటినా.

"ఉన్నారు"

"ఉన్నారా? ఒక్కపేరు చెప్పచూద్దాం".

"పెద్రో ఫెర్నాండిస్..."

"నీ నాలిక యెలా తిరిగింది యిలా అనడానికి?"

"నా నాలిక నిజమే పలికింది"

"ఆ పరమ దరిద్రుడ్ని నాకన్నా అదృష్టవంతుడంటున్నావా?"

"నీకన్నా అదృష్టవంతుడు కాబట్టే కొడుకునుకన్నాడు".

"ఇలా అబద్ధాన్ని నిజం, నిజాన్ని అబద్ధం చెయ్యడానికే కదా డాక్టరు వృత్తి వదిలి లాయరు వృత్తి చేపట్టావ్?"

"మేడమ్ నన్ను యిన్‌సల్ట్ చేస్తే చెయ్యి - నా వృత్తిని తిట్టకు. డబ్బులు చేసుకుంటన్నా డాక్టరు వృత్తి వదిలి లాయరు యెందుకయ్యానో నాకొక్కడికే తెలుసు. అయినా యిప్పటికీ మీ యింటి డాక్టరెవరు? నేనేనా?"

"ఇంత మేం, తలలు మొత్తుకుంటుంటే... ఒక్కమాట - అన్నయ్యా - ఒక్కమాట అంటే నీ ఆయుఃక్షీణం అయిపోతుందా?" అంటూ జోస్ వేపు

తిరిగింది క్లాటినా.

"అతనికి మౌనం మనశ్శాంతినిస్తుంది. మనకు వాగుడు మనం కోతి సంతతి అని గుర్తుకు తెస్తుంద" అన్నాడు ఎడ్డీ.

"వాగేవాళ్లంతా కోతులేనా?"

"మేడమ్ చెప్పు - కోతి చేసిన చేష్టలుమనిషి చెయ్యటం లేదా? మనిషి చేసిన చేష్టలు కోతి చెయ్యటంలేదా? మనుషులం అంతా యేదో ఒక సమయంలో మనలోనున్న కోతి రూపును బయట పెట్టేస్తాం... ఏం జోస్ అంతేనా?"

"ఈ లాయరు వాగుడులో నిజం వుందా అన్నయ్యా" అంది క్లాటినా.

జోస్ మాట్లాడకుండా క్లాటినా వేపు చూస్తుంటే "అలా మూగవాడిలా కూర్చుంటే యెలా? నీ కెందుకు పిలిపించాను? ఇదొక ప్రధానమైన సమస్య, ఎడ్డీయెన్నో సంబంధాలు తెచ్చాడు. ఏదీ యెంచుకోలేక పోతున్నాను. కూర్చున్నా గెంతుతున్నట్లే అనిపిస్తోంది. పడుకున్నాతల పగిలిపోతోంది. ఎడ్డీ అన్నట్లు నేను కోతి చేష్టలుగాని చేస్తున్నానా అన్న అనుమానం వేస్తోంది... నీ సలహాయేమిటో చెప్పు?"

చెప్పనా అన్నట్లు తలెత్తి చూసాడు.

"కూతురి పెళ్లికి తొందరేంటని అతనంటాడు. కానీ నా తొందర అర్థం చేసుకో - చెప్పు - నన్నేం చెయ్యమంటావో?"

ఆగి ఆగి జోస్

"నీ యింట్లో సబంధంకోసం అడుగుపెట్టిన వాళ్లంతా మారు ముఖాలు పెట్టుకున్న వాళ్లు. ఈ మాస్క్ తగిలించేవాళ్లకోసం యేగబడే బదులు- ప్రకాశవంతమైన ముఖం నీదగ్గర్లో వుండగా - దాన్ని చేరదీసి నీ యింట్లో పెట్టుకుంటే - అటు సుఖం - ఇటు నీ కోరిక " అన్నాడు.

క్లాటినా ఒక్కసారి చ్రురునలేచి నాగులా బుసకొట్టింది.

"ఈ చెత్త వాగుడు కట్టిపెట్టు. ఉన్నత కుటుంబంలో పుట్టావు. నీబుర్రలో పుట్టిన ఆలోచన మాత్రం యిదికాదు. ఇలా వాగే బదులు అలా నోరుమూసుకునే వుండు. మా వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నావో చూడు యేం చేస్తానో?" అంటూ అక్కడనించి దూసుకుని లోనికి వెళ్లి పోయింది.

కాస్సేపు అంతా మౌనం తర్వాత ఎడ్డీ, జోస్ ప్రక్కకు వచ్చి కూర్చొని.

'అటు నివ్వు - ఇటు నేను చాలా చిక్కుల్లో పడబోతున్నాం"

జోస్ యెలా అన్నట్లు చూసాడు.

"సాక్ష్యంలో యిరికిస్తాడు రోనీ! సాక్ష్యంలో చిక్కుకుంటే గొప్ప బాధ"

జోస్ కళ్లు ప్రశ్నించాయి.

"సాక్షి నిజం చెప్పాలనుకుంటే లాయర్లు అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేసి ఆ నిజాన్ని అబద్ధంగా మారుస్తారు. ఇక అబద్ధం ఆడితే అన్ని విధాల చిక్కే..."

జోస్ లేచాడు. ఎడ్డీ వెంట పడి "అందుకే నీకో సలహాయిస్తున్నాను. ఈ వ్యవహారం అటుదిటు అయ్యిందా, అందులో నేరాన్ని ప్రోత్సహించిన వానిగా కేసులో నిన్ను యిరికిస్తాడు రోని... అందుకే ఆ పవులోని యింటినించి తరిమేయ్..." "పవులో పెద్ద మనిషి, వాడు చేసే పనులకు వాడే బాధ్యత వహిస్తాడు. మనలనెవర్నీ బలిపశువును చెయ్యడులే!" అంటూ జోస్ తనింటివేపు నడిచాడు.

***  ***

## 7

ఎన్నో తరాల ముందు, మతం మార్చుకున్నా కుటుంబ గౌరవం నిలబెట్టుకుంటున్నా  మన్న గర్వం రోనీ మెనేజెస్ కుటుంబానికి యిచ్చినదేమంటే:

ఈ అపురూపమైన భవనం, ఈ దివార్‌లో తనకున్న అడ్డులేని అధికారం చర్చిలోగానీ, వుత్సవాల్లోగానీ, శుభకార్యాలలోనైనా తన కుటుంబానికి వేసే అగ్రాసనాలు, చూపించినా చూపించకపోయినా కనిపించకపోయినా కనిపించే సంపద. ఆ సంపద తెచ్చిన లక్షణాలు, తరతరాల్లో యెవరూ వేలెత్తి చూపించలేని వాళ్ల అందమైన ఆడవాళ్ల నడవడిక అన్నిటికీ మించి ప్రతి నోటా కీర్తింపబడ్డ గ్రేస్ ముగ్ధ మనోహర రూపలావణ్యం!

ఎంతో చిరాకులో వున్నప్పుడు ఒక్కసారి కూతురి వేపు చూస్తే మనసుమల్లె వాసనలతో నిండినట్లు దరహాసం వచ్చేది. ఇది అపురూపమైన మల్లియ వాళ్లకు.



# అన్నమాచార్య నృత్య విభాగం

"తాళ్ళపాక" అన్నమయ్య ఒక మహా వ్యక్తి. మహోన్నత ప్రతిభాశాలి. భక్తాగ్రేసురుడు. త్రివేణి సంగమంగా భక్తి సాహిత్యం సంగీతం అతనిని పద కవితాపితామహుడుగా తీర్చి దిద్దాయి. అన్నమయ్య సాహిత్యం-ఆలోచనామృతం; సంగీతం- ఆపాత మధురం; భక్తి-జీవన్ముక్తికి సోపానం.

ఏ భారతీయ నృత్య శైలిలోనైనా ఏ నృత్య కళాకారుడైనా అన్నమయ్య పాటలనే కాదు ఏ సంకీర్తనలైన, అష్టపదులైనా, పదాలనైన ఎంతో చక్కగా అభినయించి కవి హృదయాన్ని ప్రేక్షకుల ముందు తన అభినయ కౌశలం చేత నేర్పు చేత "విశద" పరచగలడు.

ఏ వాగ్గేయ కారునికి లేని విధంగా  అన్నమయ్య సాహిత్య-సంగీతాల మీద విస్తృతంగా పరిశోధన చేయడానికి తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టును స్థాపించింది.

అదే విధంగా అన్నమాచార్య నృత్య విభాగాన్ని అన్నమా చార్య కళా మందిరంలో 1985 జూన్ 17వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ ఎస్. లక్ష్మినారాయణ దీపం వెలిగించి ప్రారంభించడంతో అన్నమయ్యకి నృత్య నీరాజనాలు అర్పిస్తోంది.

ఆనాటి సభకి చిత్తూరు పోలీస్ సూపరింటెండెంట్, రచయిత శ్రీ రావులపాటి సీతారామారావు గారు అధ్యక్షత వహించగా శ్రీ శార్వరి శ్రీ పులికంటి కృష్ణారెడ్డి ప్రసంగించారు. "ఇండియన్ బాలే థియేటర్" వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన విభాగ పరిశోధన విద్యార్థి ప్రముఖ పత్రికా రచయిత శ్రీ శార్వరి పుత్రుడు ప్రముఖ నాట్య కోవిదుడు కళా ప్రపూర్ణ శ్రీ వెంపటి చిన్న సత్యం అభిమాన శిష్యుడు అయిన మాష్టర్ రమణని అభినందించారు.

-శ్రీమతి చిర్రావూరి నాగ సరస్వతి



అన్నమాచార్య నృత్య విభాగం ప్రారంభోత్సవం: అన్నమాచార్య విగ్రహానికి హారతి యిస్తున్న టి.టి.డి. కార్యనిర్వహణాధికారి శ్రీ లక్ష్మినారాయణ.



అన్నమాచార్య నృత్య విభాగంలో చిన్ని శిశువు-నృత్యం ప్రదర్శించిన వసుమతి

అలాంటి కూతురు లేచిపోగానే ఆ యింట్లో ప్రళయమే వచ్చినట్లయిపోయింది. ఊరంతా తలోలా వ్యాఖ్యానించారు. ఈ కోటలో సుందరి, బాటమీద యెలా పడిందో తలోలా వూహించుకుంటున్నారు. దాచినా దాగని సత్యం. రోని ప్రళయ రుద్రుడైనా బావుండేది. దైవాంశ వుండేది. పరమ కర్కోటకుడైపోయాడు. విషాన్ని కక్కుతూ పెద్రోపాకకు నిప్పంటించాడు. ఏ ఆర్తనాదం వినపడలేదు. ఏ విన్నపాలు చెవికెక్కలేదు. మింగ వచ్చిన యీ కొండ చిలవ బారినించి తప్పించుకోడానికి పెద్రో దంపతులిద్దరు ఒకనాడున్న తమ బిలంవేపు యెలికల్లా గెంతులేసుకుంటూ పరిగెత్తారు.

ఈ కొండచలవ వీధిలో పడలేదు. పడితే అవమానంతో కదలలేదు. అందుకే తిరిగి యింట్లోనికి వచ్చాడు. పరుగెత్తిపోయిన పెద్రో యిటూ అటూ నమ్మని మనిషైపోయాడు.

"మమ్మల్ని వదిలి వెళ్లావ్, వాడు మూతి మీద తిన్నగా వచ్చిపడ్డావ్ యిప్పుడు. నీనించి మా పాకలు కూడా కాలిపోతాయి...పో...పో..." అంటున్నారు.

ఒకనాడు తనను గౌరవించిన తన వాళ్లు! పనస చెట్టు కింద తలదాచుకున్నా చుట్టూ చేరిన, వాళ్ల తన కొడుకు చేసిన సాహసానికి మెచ్చుకోకుండా నిందిస్తున్నారు. సాహసానికి కూడా సరహద్దులున్నట్లు మాటాడుతున్నారు. తవుడు బుక్కేవోడు చక్కెర తినడం తగదని నమ్మిన అమాయకులు కష్టపడి బ్రతికే మనుషులుగానీ నోటి బూకరింపుతో బ్రతికే వాళ్ల కారు. ఎప్పుడూ తన దిక్కే తప్పుకుంటున్న యెలికల్లాంటి వాళ్ల కాబట్టే నిత్యం భయంతోనూ ఆరాటంతోనూ నలిగిపోతున్నారు.

అలాంటి వాళ్ల అంతదూరం పోలీసు వాళ్లను చూడగానే చెల్లా చెదరవుతున్నా అప్పటికే గాలిలో పిస్తోలు పేల్చాడు పోలీసు. పరిగెత్తుకుపోకుండా నిల్చున్న పెద్రో దగ్గరకు ముగ్గురు పోలీసులు వచ్చారు.

"నీ కొడుకు గ్రేసమ్మతో యెక్కడ దాగున్నాడో చెప్పు?"

"నాకు తెలీదు"

"ఊ - నీకు తెలీదా?" అంటూ పిస్తోలు తిప్పి డొక్కలో ఒక్క పోటు పొడిచాడుపోలీసు అధికారి.

"నాకు తెలీదంటే - తెలీదని" బాధతో ఒంగిపోతూనే అరుస్తుంటే గొరెట్టె వెనుకనించి వచ్చి భర్తను పట్టుకొని కూర్చోబెట్టి కొరకొర చూసింది.

"వదులు..." అరిచాడు పోలీసు పెద్రో భార్య చేతిని ప్రక్కకు పెట్టాడు.

"ఇక్కడ చెప్పడు, ఠాణేదార్ యెదరగా చెప్తాడు. వీడ్ని యీడ్చుకెళ్లండి" అని పోలీసు పెద్ద హుకుంజారీ చేశాడు.

"నేనే వస్తాను..." పెద్రో అన్నా యిద్దరూ వాడి చేతికి బేడీలు వేసి లాక్కుని వెళ్తున్నారు.

"నా మొగుడు యేం నేరం చేసాడని బేడీలు వేసారు?" అని గొరెట్టె అరుస్తుంటే "నీకూ వెయ్యాలా?" అని పోలీసు హూంకరించాడు.

"నా మొగుడికి వుండగా... నాకుంటే తప్పా? వెయ్యండి" అంటూ వెంట పడింది.

త్రోవంతా అరుస్తోంది "బంగారులాంటి నాకొడుకును మాయచేసి లాక్కుపోయింది. పెద్దింటి నేరం మా చిన్నింటి మీద వేసేస్తున్నారు. ఈ అన్యాయానికి వూరువూరంతా తల ఒగ్గేస్తున్నారు. నా పెద్రోకి బేడీలు ఎవరి సొమ్ము దాచేసాడు? ఎవరి మీద పల్లెత్తి మాట అని యెరగడు. నా పెద్రో...కి బేడీలు.

అలా త్రోవంట అరుస్తున్నా మూగిన ప్రజలో ఒక్కడూ ముందుకు రాలేదు.

పెద్రోని ఒక్కసారి వరండాలో యెత్తు కుర్చీ మీద కూర్చున్న రోనీ ముందుకి విసిరారు. వాడ్ని యెత్తుకుర్చీ మీద కూర్చున్న రోనీ ముందుకి విసిరారు. వాడ్ని రోనీ కాలితో తన్ని "నీవు విశ్వాసంగల కుక్కవనుకున్నాను తోడేలైనా గుండెనే చీల్చుతావా?"

పోలీసు పెద్ద నలుగుర్ని వుద్దేశించి అరిచాడు. "పదుగుర్ని చేరతీసి, ఘనత వహించిన పోర్చుగీసు పాలన మీద తిరగబడండి" అని వుపన్యాసం దంచుతున్నాడీ పెద్రో.

"దేశద్రోహానికి యేం చేస్తారో చెయ్యండి" అన్నాడు రోనీ.

చప్పున పెద్రో మీద కొరడా దెబ్బలు పడ్డాయి. ఒకటి కాదు - రెండు కాదు. ఎంత తమాయించుకున్నా ఒక్కోసారి బాధతో ఆక్రందన బయటకు వచ్చేస్తుంటే "అమ్మో" అంటూ ఒక్కసారి తలెత్తి చూసాడు. రోనీ పెద్ద పులిలా కూర్చున్న రోనీ. చూడగానే యేనాడో పూర్తిగా పాతిపెట్టేసాననుకున్నాడు. గానీ మళ్లీ పాతి పెట్టిన కోర్కె యీక్షణంలో పైకుబికి మొలకెత్తి చిగురించి మహా వృక్షమైపోయింది పెద్రోలో.

"మళ్లీ అవకాశం దొరికితే వీడి గుండె మీద నా కత్తితోనే వేటు వేస్తాను అప్పుడే నాకు మనశ్శాంతి!"

అదే మనసులో ప్రతి ధ్వనించడం చేత కొరడా దెబ్బలుపడినా మూలుగుతూ స్పృహతప్పిపడిపోయాడు. కొరడా దెబ్బలు ఆపించాడు రోనీ.

"ఎడ్డీ" అని కేకవేసాడు రోనీ.

ఎడ్డీ వచ్చాడు.

"డాక్టరుగా చూడు వీడు బతికున్నాడో చచ్చాడో?"

ఎడ్డీ పరీక్షచేసి "ప్రాణం వుంది" అంటూ వెళ్లబోతుంటే

"ఆగు"

"నాపని సరికదా"

"లాయరుగా నీపని వుంది"

"చెప్పండి"

ఈ నేరాన్ని ప్రోత్సాహించిన వాడు యింకొకడున్నాడు".

"ఎవరు".

"వాడు నాభార్య తోబుట్టువైనా నేరం నేరమే. నాకు న్యాయం దగ్గర నావాడు యెదుటివాడు అన్నభేదం లేదు".

"కొంపతీసి అతనికీ యీ శిక్షేవేస్తారా?"

"అవసరమైతే వేస్తాను"

"అతనితో యీ విషయం మాట్లాడితే లాభంలేదు".

"ఏం?"

"మౌనం దాల్చాడు"

"ఆ మౌనం వదిలేటట్లు బాదితే..."

"అతను మీ శ్రీమతి ఆదేశాన్ని అక్షరాలా ఆచరిస్తుంటే నేరం అతనిది కాదు".

"నీవు ఆ ఆదేశం యిచ్చినప్పుడున్నావా?"

"నేను చెవులారా విన్నాను, నోరు మూసుకోమంది. మీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దంది".

"అది అన్నా చెల్లెలి మధ్య! నాకు న్యాయంతోనే సమ్మంధం - ఆ జోస్‌ని పిలు..." అని కేక వేసాడు.

కాస్సేపయ్యాక వెళ్లినవాడు తిరిగొచ్చి "ఎంతచెప్పినా మాటాడటంలేదు దొరా! ఏదోయింటంతా వెతుకుతున్నాడు".

పోలీసులవేపు చూసాడు. కనుసైగ చేసేలోగా అంగటి గేటు దగ్గర జోస్ ప్రత్యక్షమయ్యాడు. జోస్‌ని చూసి ఎడ్డీ వెళ్లిపోబోతుంటే, రోనీ వాడి చెయ్యి పట్టుకున్నాడు. కబంధ హస్తాల్లో చిక్కుకున్నట్లు ఎడ్డీ విసుక్కుంటూ నిల్చున్నాడు.

జోస్ వస్తూనే తోటలో చెట్ల చాటున నిల్చొని మెల్లగా యేడుస్తున్న గొరెట్టేవేపు చూసాడు. గబగబ నడిచి వచ్చి వరండాలో పడివున్న పెద్రో వెపు చూసాడు. గబగబలోనికి వెళ్లి ఒక బీరు సీసా తెచ్చాడు. ఆ గాయాలను మౌనంగా కడుగుతుంటే రోనీ హుంకరింపు వినిపించింది.

"నేరస్థుడు యింకో నేరస్థుని రక్షిస్తున్నాడు. ఊ"

జోస్ ముఖం రౌద్ర రసంతో వుబ్బిపోయింది.

"ఎడ్డీ... డాక్టరనిపించుకుని అలా నిల్చున్నందుకు సిగ్గు పడటంలేదూ?"

"ఇప్పుడు నేను లాయర్ని" అన్నాడు ఎడ్డీ.

"న్యాయాన్ని అన్యాయం కోరలనించి లాగి రక్షించే వాడే లాయరు. నివ్వే యిక్కడ నిల్చుని యీ అన్యాయానికి యెలా తల ఒగ్గావ్?"

"మౌనం దాల్చావనుకున్నాను, ఉపన్యాసాలు దంచుతున్నావే! ఇప్పుడు నీ సంగతి ఆలోచించవయ్యా" అన్నాడు ఎడ్డీ.

"నన్నూ అలా బేడీలు వేసి కొరడా దెబ్బలు కొట్టిస్తాడా?"

"ఆనాడే నీకు నేను వార్నింగ్ యిచ్చాను. పవులోని యింటినించి తగిలేమంటే విన్నావూ? పవులో జెంటిల్ మెన్ - పెద్ద మనిషన్నావు? ఏదీ అటు కన్న తండ్రిని, యిటు విద్యాదానం చేసిన గురువుని నేరంలో యిరికించి పోయాడు".

"లేదు పవులో పెద్ద మనిషి కాబట్టే తగిన సాక్షం వదలి వెళ్లాడు" అనే సరికి పెద్రో ప్రాణాన్ని కూడ గట్టుకుని లేచాడు.

జోస్ పోలీసు పెద్ద వేపు తిరిగి "మీరు యే న్యాయ సూత్రలు ఆధారంగా తీసుకుని యీఅనాథుడ్ని యిలా రక్తాలు చిమ్మేటట్లు కొట్టారో కోర్టులో చెప్పవలసి



అన్నమాచార్య నృ ్ ేభాగంలో నాట్యం చేసిన
కుమారి భువనేశ్వరి

వస్తుంది. ఇద్దరూ మేజర్లే, కోరుకున్నవాడి వెంట గ్రేస్ వెళ్లిపోయింది. ఇది నేరం యెంత మాత్రం కాదు. ఇందులో నేనుకానీ పెద్రో కానీ యే మాత్రం జోక్యం చేసుకోలేదన్న పవులో స్వదస్తూరితో రాసిన చీటి యిప్పుడే నాకు దొరికింది. ఇది కోర్టు కాదు. ఈ ఎడ్డీ లాయరు కాదు. ఇక్కడ జడ్జీలేదు. ఇవన్నీ వున్నా చోటే నేను ఆ చీటీని చూపిస్తాను. ఆ బేడీలు వెంటనే విప్పుతారా లేదా? ఊ"


పోలీసు పెద్ద రోని వేపు చూసాడు. ఎవరి నోటా యే మాటా రాలేదు. కొద్ది క్షణాల తర్వాత గొలుసులు కదిలిన చప్పుడు వినిపించింది. బేడీలు విడిపడ్డాయి. పెద్రోలేచి నిల్చున్నాడు.


## 8

పవులో గ్రేస్ తీయని రాగాలు, తీపితీపి కలయికలూ వూహల్లో యింకా వుంచుకోలేక, యెదరగా వున్నా వియోగం భరించలేక, యిలా చేస్తేగానీ చింతతో ప్రాణాలు పోతాయేమోనని యింత సాహసానికి దిగాడు. ఇక యీ మూగ బాధను సహించలేక బ్రతుకు బాండు వాయిద్యంలా అనుభవించాలని రోనీ క్లాటివా పంజి వెళ్లిన రాత్రి యిద్దరూ పరారయ్యారు. వీళ్ల అమరప్రేమ అవధులను దాటించేసింది.


దివార్‌కి వుత్తరాన మాండవీనది పాయ అవతలి వడ్డున చిన్న ద్వీపం వుంది. ఆ ద్వీపం పేరు షోరాన్. ఈ చిన్న ద్వీపంలోనికి యెవ్వరూ వెళ్లరు. కారణం అక్కడ దెయ్యాలున్నాయని భయం. దానికి దయ్యాలద్వీపం అని కూడా అంటారు. ఆ ద్వీపం దివార్‌నించి చూస్తే, ఒక చిన్న అడవిలాగ కనిపిస్తుంది. అది కొన్నివందల యేళ్ల క్రితం క్రిష్టియన్ల ఫాధరీలను తరిఫీదు చేసే కేంద్రం. దానికి ఆనుకునే బాగా పాడుపడిపోయిన చర్చి వుంది. అది పాడవడానికి యెన్నెన్నో కారణాలు చెప్తారు. అందులో వుండిన మనుషులు మానవుల మనుగడకు సృష్టించుకున్న నీతులూ నిబంధనలు దాటడం వలన దానవులైపోయారని, ఆ దానవులు వచ్చి దయ్యాలయ్యారని అంటారు. ఇది దైవ శాపంవలన పాడుపడి పోయిందని నమ్మినవాళ్లున్నారు. ఆ చర్చినించి పెద్ద సొరంగం వుందట. ఆ సొరంగం నించి వెళ్తే పాత గోవా చేరుకోవచ్చుట!

ఇలాంటి షోరావోద్వీపంలో అప్పటికి నాలుగేళ్ల క్రితం నించీ ఒక వ్యక్తి నివాసం యేర్పరచుకున్నాడు. వాడిపేరు కైతూ మార్ క్వేస్. ఈ కైతూ చేపలవాడని చూడగానే చెప్పవచ్చు. ముడుకులు దిగని నల్లని లైటు చెడ్డీ, పైన లేసుల







బనియాను. ఒకోసారి ఆ బనీయానూ వుండదు. నలభైయేళ్లుంటాయి. బాగా పెంచిన గెడ్డంలో ఒక్క తెల్ల వెంట్రుక కనపడదు. నల్లని బలిష్ఠమైన శరీరం చూసి పిల్లలు భయపడతారు. పెద్దలు వాడి శరీరపు ఒంపులు చూసి చొంగలు కారుస్తారు.

ఈ కైతూకి స్వంతం అన్నది ఒక చిన్న పడవ చేపల పడవ నదిలో చేపలు పట్టి అమ్ముకోడానికి దివార్ వస్తుంటాడు. వాడికి పవులో మీద యేకలవ్య భక్తి. బ్రాస్ బేండ్ స్వరం వింటే తన్నుతానే మరచిపోతాడు. ఈ యేకలవ్యుడు ఒకసారి పవులోని కలిసాడు. వాడు మాటాడింది తక్కువేగానీ, పవులో కళ్లల్లో ఆవేదన అర్థంచేసుకున్నాడు. సంగీతం వీళ్లని మిత్రులను చేసింది. ఈ సాహసానికి వాడే ప్రోత్సహించాడు. ప్రోత్సహించి బాధ్యత తీసుకున్నాడు. అందుకే ఆ రాత్రి, చీకటి రాత్రి, తన స్వంత పడవ మీద యిద్దరినీ యెక్కించి మండవీనది దాటిస్తున్నాడు.

సాహసానికి యెప్పుడూ అలవాటు పడని ప్రేమికులు, యింత సాహసం చేసినా యెక్కడ పట్టుబడి పోతామోనన్న బెంగ, భయం చీకటంత నల్లగా మనసుల్లో చొచ్చుకొని వుంది. నీరూ, ఆకాశం, పచ్చని ప్రకృతి కూడా నల్లగా కనిపిస్తోంది. ఈ నీటిలో అప్పుడప్పుడూ తెల్లని చేపలు యెగురుతున్నాయ్. ఆకాశంలో చుక్కలు మెరుస్తూ నీటిలో పడ్డ మిణుగురుల్లా వున్నాయ్. చీకటిలో కాంతి రేఖలు కదిలినట్లు వాళ్ల మనసుల్లో కోరికలు కదుల్తున్నాయ్.

ఈ దిగులుతో, ఆశతో మౌనంగా లోన పోరాడుకుంటున్న జంట కైతు స్వరం వినగానే ఒక్కసారి వాడి వేపు తిరిగారు. పడవ నడుపుతున్న వాడు.

"మీ రిద్దరూ పోట్లడుకున్నారా?"

"అబ్బెబ్బే..."

"మూగపోయారేం?"

జవాబులేదు.

"ఎన్నో ప్రశ్నలెయ్యడానికిది సమయం కాదు. కానీ రెండు మాత్రం వేస్తాను" అన్నాడు కైతూ.

ఏం ప్రశ్న వేస్తాడోనని యిద్దరూ యెదురు చూసారు.

"చేతిలో చిన్న పెట్టెతో గ్రేస్ పడవ యెక్కింది కదా. అందులో పవులోకోసం స్వంతంగా కుట్టిన ఎంబ్రాయిడరీ బనియానుందా?"

గ్రేస్ కాస్త సిగ్గు పడుతూ.

"ఉంది" అంది.

"చెప్పు నివ్వు బాగా వంట చేస్తావా?"

"నే నెప్పుడూ రుచి చూడలేదు" అన్నాడు పవులో. "సరే...! ఈ రాత్రి గ్రేస్ వంట రుచి చూసాకే గ్రేస్ గోవా అమ్మాయో కాదో తేల్చేద్దాం" అన్నాడు కైతూ.

పడవను ఆపాడు పడిన జెట్టీకి కట్టేసాడు. చీకటి దగ్గర టార్చిలైటున్న

వెలిగించలేదు. "నా వెంటే రండి. పవులో గ్రేస్ చెయ్యి పట్టుకో. నివ్వు నాచెయ్యి పట్టుకో. మనం యీ కంకర రాళ్లదారి మీద కొండ యెక్కాలి"

"పాములుండవు కదా?" అంది గ్రేస్.

"నేను వస్తున్నానని చూడడానికి వస్తే రావచ్చు. వాటి జోలికి పోకపోతే మననేం చెయ్యవు నడవండి" అంటూ సామానులన్ని కైతూ పట్టుకున్నాడు. చీకట్లో అలా యెక్కుతుంటే రానురాను బాట స్పష్టంగా కన్పిస్తోంది. చెల్ల సంగీతం వినిపిస్తోంది. అక్కడక్కడా, యిటూ అటూ తుప్పల మీద పువ్వుల గుత్తులున్నట్లు ఘుమఘుమలసువాసన వలన పోల్చుకోవచ్చు.

"ఈ మొక్కలన్నీ నివ్వే పెంచుతున్నావా?" అడిగాడు పవులో "నే నెవడ్ని పెంచడానికి? ఇక్కడ అన్నీ అవే పెరుగుతున్నాయి. నన్ను మనిషిగా పెంచుతున్నాయ్".

ఈ ప్రకృతి సంతానంలో అమృత సంతానంగా బ్రతుకుతున్నకైతూ చివరకు వీళ్లను చర్చ్ ప్రాంగణం లోనికి తీసుకు వెళ్లాడు. అక్కడ నిల్చొని చూస్తే, యీ ప్రదేశం చుట్టూ గోవా అంతా ప్రదక్షణం చేస్తున్నట్లుంది. కైతు టార్చి లైటు వెలిగించాడు. "ఇక్కడ నించి వెలుగు, మనుషులూ యేదీ బయటకు కనిపించదు. ఇది ప్రకృతి పచ్చదనపు కోట, ఆకలెయ్యటం లేదా? రండి..." అంటూ చర్చి నానుకుని వున్న చిన్న వసారాలోని తన వంట యింటికి తీసుక వెళ్లి లాంతరు వెలిగించాడు. తనతో తెచ్చిన రొట్టెలు చిన్న టేబిలు మీద పెట్టాడు. గబగబ కత్తితో చేప కొయ్యడం మొదలు పెట్టాడు.

"అదేం చేప?" అడిగాడు పవులో.

"థవ్‌సా!"

"పేరు వినగానే నోరూరిపోతోంది".

"ఆగు గ్రేస్ వండనీ..." అన్నాడు.

చేపలుకోసి, కడిగి స్టౌవ్ వెలిగించి అంతా చూపించి యిటు తప్పుకున్నాడు కైతు. చేపలు గ్రేస్ వండింది. ఈలోగా కైతూ పవులోకి చర్చిలోనికి ఆ ప్రక్కనే వున్న సెమినరీలోనికి తీసుక వెళ్లాడు.

చేప కూరతో ముగ్గురూ బ్రెడ్ తిన్నారు. తింటూనే కైతూ.

"గ్రేస్ పాడుతుంది. లేసులు అల్లుతుంది. బాగా వండుతుంది. బహుశః బాగా డాన్సు కూడ చెయ్య గలుగుతుంది. సెభాసైన గోవన్ వధువు కుదిరింది పవులో నీకు" అన్నాడు.

వీడికి అంతా తెలుసే. అంతా చెప్పకున్నావా. అన్నట్లు గ్రేస్ కొంటెగా పవులో వేపు చూసింది. లేదన్నట్లు కళ్లు తేలవేసాడు పవులో.

భోజనాలయ్యాక యిద్దర్నీ సెమినరీలోనికి తీసుకవెళ్లి ఒక అరుగు చూపించాడు. పాలరాతి పలకలు అరిగి చదునుగా వున్నాయి. ఈ రాతి పాన్పుమీద వుతికిన దుప్పటి ఒకటి కైతూ పరిచాడు. తల క్రిందకు కొబ్బరి పీచుతో కుట్టిన దిండు ఒకటి వేసాడు. కొవ్వొత్తి వెలుగుతోంది.

"ఈ వేళ గ్రేస్‌కి ప్రదానం చేసాం. ఇంకా పెళ్లికాలేదు. ప్రక్కనే చర్చివుంది. ఇది దివార్ కాదు. ఇక్కడంతా సహజంగా వుంటుంది" అన్నాడు కైతూ.

"కైతూ! ఈ రాత్రి యిక్కడుంటే రేపు వుదయానికే పట్టుబడిపోతాం" అన్నాడు పవులో.

"ఈ రాత్రి యిక్కడనించి కదిలితే - ముగ్గురం మిగలం"

"ఎలా?"

"మనం సరిహద్దు చేరేసరికి పోలీసులంతా మనకోసమే కాసుక్కూర్చుంటారు. ఈ వేడి తగ్గాక కానీ యిక్కడ నించి కదలం"

"అనుమానం మీద యిక్కడకు పోలీసులొస్తే"

"నేను నీ కళను ఆరాధిస్తున్నాను. నివ్వు నా కళని నమ్మవా"

"ఇలా పోలీసుల కోరలనించి తప్పించటం ఒక కళగా అభ్యసించావా?"

కైతూ నవ్వేసాడు. ఆ చిరునవ్వు పవులోకి పూర్తిగా అర్థం కాలేదు.

"ఇలా రండి' అని యిద్దర్నీ బయటకు పిల్చాడు. హద్దులు చూపించాడు. "ఈ హద్దులు దాటి మాత్రం వెళ్లకండి. వెళ్తే పోలీసుల దుర్భిణీలో యిరుక్కుంటారు. తప్పించుకోవటం కష్టమైపోతుంది".

ఆ రాత్రి యిద్దరికీ సరిగ్గా నిద్రలేదు. మధుర మోహన మందహాసాలను



అన్నమాచార్య నృత్య విభాగంలో నాట్యం చేసిన
చిరంజీవి బబిత

వెదజల్లుతున్న శరీరాన్ని దరిజేర్చి, రెచ్చకొడదామనుకున్న గ్రేస్, కైతూ పెట్టిన షరతు గుర్తుకురాగానే తేనె పలుకులనూ, తియ్యని పెదిమలనే ప్రియునికి అందిచ్చింది.

తూరుపులో తెలుపు రేకలు మొగిలి రేకుల్లా మారినై. అప్పటికే పక్షులు కిలకిలా నవ్వాయి. సిగ్గు దొంతరలు గ్రేస్ చుట్టూ పొగమంచులా చుట్టుకున్నాయ్. లేచే సరికి కైతూలేడు. స్నానానికి నీటితో సహా అంతా అమర్చివెళ్లాడు. గీచినగీటు దాటకుండా చూస్తే నదిలో బోటు కదలడం కనిపించింది. ఆ బోటు దివార్ వైపు వెళ్తోంది. దివార్‌ని యిక్కడనించి చూస్తుంటే చంద్ర మండలంపై నించి భూమిని చూస్తున్నట్లుంది. ఇద్దరూ ఒకరినొకరు హత్తుకునే చూస్తున్నారు. కులం, సాంప్రదాయం, అంతస్థులు, అన్నిటికీ అతీతమైన ప్రేమతో అంతా వాళ్ల అదుపులో నున్నట్లు భావిస్తున్నారు. కళ్లల్లో మసకపోయింది. ఒకరి శరీర కాంతి యింకొకరి శరీరపు తళుకుతో కలసిపోయి హృదయ స్పందనలో అపురూప నాట్య భంగిమల కదలికలు వినిపిస్తున్నాయి. తమ చుట్టూవున్న నగ్న ప్రకృతిలో భాగమైపోయారిద్దరూ.

పొద్దు నడినెత్తిపై వుండేటప్పటికి కైతూ వచ్చాడు. వీళ్లా అడక్కుండానే వస్తూనే...

"అంతా మామ్మూలుగా వుంది. అంతా మామ్మూలే!"

పవులో యింకేదో అడగ బోతుంటే "అదంతా మరచిపో... రెడీగా వున్నారా? మీ రిద్దరూ ఒకటిగా కావాలని దైవ శాసనం. నేనే ఫాదరీని - మీ పెళ్లియిప్పుడే..."

తన పెట్టెలో వుంచిన వెడ్డింగ్ గౌన్ తీసి "గ్రేస్ యిది వేగంగా వేసుకో... చౌకదే... పవులో - యిదుగో నా సూటు... కొత్తదే అనుకో... వేగంగా తయారవ్వండి" అంటూ ఆ పాత చర్చిలో యేదేదో సరంజామా చేస్తున్నాడు. వీళ్లిద్దరూ తయారయ్యాక కైతూ పాడుపడిన ఆల్టర్ యెదర నిల్చుని తనకు

వచ్చిన బైబిలునించి గీతాలు చదివి వెండితో చేసిన రెండు రింగులను అందించాడు. ఈ నునుపయిన ఉంగరాలను యీ జంట ఒకరి కొకరు మార్చుకున్నాక పెళ్లి శపథం చెయ్యించాడు.

పెళ్లి అయిపోయింది. వైను బాటిల్ తెరిచాడు. ''మీ పెళ్లి దివార్‌లో అయ్యింటే వేలాది మనషులు వచ్చేవారు. విచారించకండి. మీ పెళ్లి చూడ్డానికి యిక్కడకూ వేలాది వచ్చారు'' అంటూ ఆ విరిగిన కిటికీలు రెండు వేపులా తెరిచాడు. పక్షుల కిలకిలలు, రక రకాల పక్షులు, రంగు రంగుల అందమైన పక్షులు. నవ దంపతులు ఒకరినొకరు ఆలింగనం చేస్తూ ఆ కిటికీలు నించి చూస్తుంటే యీ పక్షుల మూకల వుత్సాహమే కాదు వాటికన్నా అందమైన పూలవనం - ఎక్కడా పూలే. తివాసీలు పరచినట్లు రంగురంగుల పూలు. అడవి పూలైనా అపురూపంగ సహజంగా వున్నాయ్. అటుపక్షులు యిటు పూలన్నీ ఒకే రాగంలో పాడుతున్నటున్నాయ్. అందుకే యెంత సేపో నూతన దంపతులు చర్చి ప్రాంగణంలో డాన్సు చేసారు. ఎంతసేపు చేసినా అలసట రాలేదు. మధ్యాన్నం మంచి విందుభోజనం అయ్యింది.

సాయంత్రం క్రైతూ వీళ్ల తావుకు వచ్చాడు. ''నేను యీ రాత్రి వెళ్తున్నాను. నాకోసం యెదురు చూడకండి. ఇంట్లో అన్నీ వున్నాయి. బాగా తినండి. గడపండి. ఏర్పాటులన్నీ పూర్తి చేసుకుని నేను వస్తాను. ఎందుకైనా మంచిది. ఒకప్పుడు యెవరైనా వస్తున్నారని పసిగట్టే మీరు దాగోడానికి చోటు చూపిస్తాను. అందులో దాగుంటే మీరు వాళ్లకు కనపడరు... రండి'' అంటూ తన వెంట యిద్దరినీ తీసుక వెళ్లాడు. సమినరీ వెనుక కొద్ది దూరంలో ఒక చిన్నపాడు పడిన యిల్లుంది. పైకి గోడలోనే కన్పిస్తోంది. ఆ తలుపు తెరవడానికి ఒక చిన్న యంత్రం వుంది. అది తిప్పగానే తలుపు తెరువబడింది. లోపలకు మెట్లున్నాయ్. ఆ మెట్లుదిగి కొద్ది దూరం వెళ్తే ఆ సొరంగంలో వెలుగు కనిపిస్తోంది. ఊపిరి బాగా సలుపుతోంది. అక్కడ యింకో యంత్రం చూపించాడు. ఇది త్రిప్పితే బయటకు వెళ్లిపోవచ్చు. అటు పక్క అడివి ఎవరూ రాలేరు. వెళ్లిపోతున్న వాళ్లను చూపి తిరిగి అదే సొరంగం నించి తిరిగి రావచ్చు.

క్రైతూ వెళ్లిపోయాడు. గ్రేస్ అడిగింది ''క్రైతు పెళ్లి చేసుకోలేదా?''

''నాకు తెలీదు''

''ఏమీ తెలుసుకోకుండానే నమ్మేసావా?''

''మోసం అంటే తెలియని మనిషని నమ్మకం కుదిరింది కాబట్టే సాహసించాను''.

''గొప్ప సాహసమే'' అంది గ్రేస్ కొంటెగా!

''నీది కాదా?''

''నేను కాదంటున్నానా? ఇప్పటి వరకూవున్న దివార్ ఆడవాళ్ల చరిత్రను తారుమారు చెయ్యించేసావ్? నీవు వీరుడు కావంటే ఒప్పుకుంటావా?''

''అలాగా?''

''దివార్‌లో యిప్పటివరకూ అగ్రజాతి పిల్ల యింకొకవూరి కోడలిగా వెళ్లలేదు. ఉన్నవుర్లో శూద్రుడ్ని పెళ్లాడనే లేదు. ఆ రెండు పనులూ నేను చేసాను. ఇందులో యెవరు గొప్ప?''

''నివ్వే వీరవనితవని ఒప్పుకుంటున్నానులే''

ఛలోక్తులతోనే చీకటి పడిపోయింది. ఈ అపురూపమైన రాత్రికోసమే యిన్ని రాత్రులూ కలలుగన్నారు. ఆ రాత్రి యీ రాత్రంటే నమ్మలేక కొద్దిగా గాబరాపడి గుండెలో గుబులు పట్టుకుంది. మాటు మణిగింది. మనసుల్లో నిండిన వలపుల పలుకరింపులతో ప్రేమాయణం మొదలిడి, చివరకు నీరసించిన శరీరాలై నిద్దరలో మునిగిపోయాయి. తెల్లవారి లేచే సరికి జీవితం సార్థకమైనట్లు అనిపించింది. ఒకరి తేజం యింకొకరికి ప్రభవింపజేసింది. ఇద్దరిలో అనురాగం ఒక బంధమై యైక్యం చేసింది.

ఒకరోజు కాదు, రెండు రోజులు, మూడు రోజులు. ఈ ద్వీపం అంతా వాళ్లదే. ఈ చర్చి, సెమినరీ గొప్ప కోటల్లా వున్నాయ్. వీటిలో చక్రవర్తి మహారాణీతో యేలుబడి చేస్తున్నట్లు పవులో భావించుకున్నాడు. తన బ్రాస్ బాండ్ గురించే మరచిపోయాడు. అంతకన్నా తళుక్కుమంటోన్న శరీరం గ్రేస్‌ది. ముట్టుకుంటే పులకరించి పులకరింపజేసే నునుపు. ఆ సంగీతంకన్నా మధురిమలు వలక బోస్తోంది గ్రేస్. నిత్యం సత్యంలా యెదరగా మెసలి, ప్రాణంలో ప్రాణమై, హృదయంలో హృదయమై కదులుతూ కదలిస్తోంది. అందుకే యీ మూడు రోజులూ యింకో తలపులేదు. ఇంకో వ్యసనం లేదు. ఎన్నడూ యెరగని స్వేచ్ఛ. పక్షుల జంటల్లో ఒక జంటగా యెగిరారు. పాముల జంటలా ప్రాకారు. పూల తీవల్లా ఒకరినొకరు అల్లుకున్నారు. వీళ్ల కలయికతో ప్రకృతిలో భాగమైపోయారు.

నాలుగో రోజున క్రైతూ వచ్చాడు. సంచి నింపగా యేపిలు పళ్లూ, ద్రాక్షపళ్లూ తెచ్చాడు సంచిదించుతూ.

''మీ కోసం కాదు'' అన్నాడు. భోజనాలయ్యాక ''ఈ రాత్రే మన ప్రయాణం'' అన్నాడు క్రైతు. ఇద్దరికీ చెరో డ్రెస్ యిచ్చి యివి వేసుకోమన్నాడు.


''ఇవెందుకూ?'' అన్నాడు పవులో.

''నీ విషయంకాదు గ్రేస్ పట్టుబడిందంటే ప్రమాదం''.

''నేను పట్టుబడితే చంపుతారుగానీ... రోనీ ఒక్క కూతుర్నీ యేం చెయ్యగలరు?''

''అదికాదు, పోర్చుగీసుపోలీసులున్నారే, తెల్లటి వాళ్లు కదా - తెల్లని ఆడది కనిపిస్తే సరి ముందు చెరిచి, తరవాత మాటాడతారు''.

''ఊరుకుంటామా? బుర్ర బద్దలగొట్టం!''



''నివ్వు క్రరెత్తేలోగా వాడు నీ మీద చేతిలో నున్న పిస్తోలు పేలుస్తాడు. ఆలస్యం అయిపోతోంది. పదండి...పోదాం'.

క్రైతూ ఆ పళ్ల సంచిలోనే రెండు విస్కీబుడ్లు వేసాడు. ఒక క్రర పట్టుకున్నాడు. ఆ క్రరలో మడచిన కత్తి వుంది. ఆ కత్తిని యే అడవి జంతువు పీకలోనైనా పొడవ వచ్చు. అంతవాడిగా వుంది. ఒళ్ళెలా వుంది. క్రైతూ కొండ దిగుతూ.

''ముసలమ్మా ముసలాడు త్రోవలో ప్రేమాయణంలో దిగకండి. మారు





అన్నమాచార్య నృత్య విభాగంలో నాట్యం చేసిన
చిరంజీవి బృందావని

వేషమని పోల్చేస్తారు.

"ముసలాళ్ళ ప్రేమించుకోరేమిటి?" అడిగాడు పవులో.

"ఇక్కడ పూచీ లేదుగానీ ఆ సరిహద్దు దాటేటప్పుడు వణుకుతూ మాటాడం మరచిపోక గ్రేస్ కడుపు నొప్పితో బాధ పడుతున్నట్లు యేక్టను చేస్తే చాలు".

బోటు యెక్కాక మాండవీ పాయదాటించి అవతలి బిచోలి అడవికి చేరుకున్నారు. వాళ్ళిద్దర్నీ ఒడ్డులో నిల్చోమని చెప్పి పడవపై మళ్ళీ షోరాన్ ద్వీపం వేపు కైతు వెళ్లాడు. పడవను అసలు ప్రదేశంలో కట్టి యీదుకుంటూ వచ్చాడు.

"పడవ యిక్కడుంటే అనుమానం మీద అడవిలో గాలించ వచ్చు - ఇక పూచీ లేదు నడవండి" అంటూ ముందు క్రపట్టుకుని దారి తీసాడు. "మధ్యలో గ్రేస్ నడవనీ. నివ్వు చివరవుండు" అలా నడుస్తూ.

"దీన్నే ప్రభుని వరాలంటాం"అన్నాడు కైతూ మాటల్లో పెట్టి గ్రేస్ ఆయాసం తగ్గించాలని కామోసు.

"దేన్ని" అంది వెనుకనే వున్న గ్రేస్.

"చీకటి రాత్రి. కానీ మనకళ్ళ పిల్లికళ్ళ కాలేదూ?"

"ఎలా?" అన్నాడు పవులో.

"ప్రభువు వలవ, చుక్కలకళ్ల తళుకైమనకు తోవ చూపించలేదూ?"

ఈ మొరటు మనిషిలో యెంత భావుకత వుందనుకుంది. గ్రేస్ కొంత దూరం వెళ్లాక యేదో కదలుతున్న చప్పుడు. గ్రేస్ కంగారు పడుతుంటే.

"పవులో... అడవిలో లేదులు కంగారు పడుతున్నాయ్. నీపెళ్ళాం కూడా అలానే కంగారు పడుతోందే! లేడికళ్ల పెళ్లాన్ని పొందావ్ - ఎంత అదృష్టవంతుడివి".

గ్రేస్ కంగారు పోయింది. పాదాలు గర్వంతో గటగట కదిలాయ్. తెల్లవారే సరికి ఒక యెత్తు ప్రదేశానికి చేరుకున్నారు. అది బిచోలి పీఠభూమి. ఒకచోట సెలయేరు పారుతోంది. ఆ స్వచ్ఛమైన జలంలో కాళ్లూ చేతులూ కడుక్కున్నారు. కాల కృత్యాలు తీర్చుకున్నారు. వెంట తెచ్చుకున్న రొట్టెలు తిన్నారు. కాస్సేపు విశ్రమించి మళ్లీ బయలు దేరారు. "ఈ రాత్రికి యెలాగైనా" సరిహద్దు దాటిపోవాలి" అన్నాడు కైతూ. నడవక తప్పదన్నట్లు గ్రేస్ నడవటం లేదు - ఉత్సాహంగానే నడుస్తోంది. ముందు నడుస్తున్న కైతూ నెత్తి మీదనున్న వల్లని వెంట్రుకల మధ్య చిన్ని బట్ట తల కనిపిస్తోంది. బహుశః దానినించే కామోసు యీ మోటు మనిషిలో యింత జ్ఞాన పుంజం కదులుతోందనుకుంది. పవులోకన్నా గ్రేసేనయం అన్నట్లు నడుస్తోంది. అక్కడక్కడా వున్న గ్రామాల దరిదాపుల్లోనికి వెళ్లకుండా మళ్లీ అడివి మార్గం పట్టించేసాడు కైతూ. ఈ మార్గంలో ప్రతి అంగుళంతోనూ కైతూకు పరిచయం వున్నట్లుంది. ఎన్నిసార్లు యిలా వచ్చాడో? ఇలా తమలా ఆపదల్లో చిక్కుకున్న వాళ్లను రక్షించాడో?"

అలాపొద్దు పడమటకు పూగేవరకూ నడిచారు. త్రోవలో దొరికిన పళ్లు తింటూనే వున్నారు. కాస్సేపు విశ్రాంతి తీసుకుని అలానడుస్తూ కైతూ త్రోవకు రెండు వేపులా వున్న తుప్పల నించి పువ్వుల గు త్తులను తెంపుతున్నాడు. ఎందుకు తెంపుతున్నాడో చెప్పడం లేదు. మౌనంగా నడుస్తున్నాడు. భక్తితో చేతులు కట్టుకొని ఆ పుష్ప గుచ్ఛా న్ని ఒక చేత్తో పట్టుకుని నడుస్తున్నాడు. ముందుకేదైనా క్రాసు వుం దేమో? ఆ శిలువ ముందు యీ పూలగుత్తుపెట్టి ప్రార్థిస్తాడేమోనని పవులో అనుకున్నాడు.

అలా కొంత దూరం నడిచాక పడమటి యెండ ప్రశాంతంగా పడుతోంది. పైన వున్న సామానులు కైతూ దించాడు.

"మీరలా నిల్చోండి. ఇప్పడే వస్తాను" అన్నాడు. చేతిలో పూల గుచ్ఛంతో కొంతదూరం నడిచాడు. ఆ అడవిలో యీ బాటకు కొద్ది గజాల దూరంలో ఒక సమాధి వుంది. చుట్టూ పువ్వుల చెట్లున్నాయ్. ఆ సమాధి మట్టితో కట్టినది. ఒక చిన్న క్రాసు తల వేపు పాతిపెట్టి వుంది. ఆ సమాధిపై ఆ పూల గుచ్ఛం పెట్టి మోకాళ్లపై బడి ప్రార్థించాడు తిరిగివచ్చాక.

"ఎవరి సమాధి అది?" అడిగాడు పవులో.

"నాపెళ్ళాం - రితూ" అంటూ సామాను మళ్లీ మీద వేసుకుని నడుస్తున్నాడు. వాడి వెనుక చెయ్యి చెయ్యి పట్టుకుని గ్రేస్ పవులో నడుస్తున్నారు, కాస్సేపయ్యాక

"ఇంత దూరంలో యెలాపోయింది?"

కైతూ పెద్ద నిట్టూర్చి "అదొక పెద్దగాథ"

"మేం వినకూడదా? తెల్సుకో కూడదా?" అంది గ్రేస్.

ఒకసారి వెను తిరిగి చూసి మళ్లీ నడుస్తూ "రితూకి రెండు కోరికలుండేవట. ఒకటి నన్ను పెళ్ళాడటం. రెండోది కొడుకుని కనడం. నన్ను పెళ్ళాడింది కానీ కడుపులో గంటు నొప్పి నించి బిడ్డల్లేరు. ఇక్కడ ఆసుప త్రులు మాలాంటి పేదలకోసం కాదు. ఇక్కడనించి మందూ మాకుల కోసం సరి హద్దు దాటడనికి మాకు పాసుపోర్టు లెవరిస్తారు? ఈ త్రోవ వుందని సరిహద్దుదాటితే మంచి ఆసుపత్రి వుందని అక్కడ వూరకే చికిత్స చేస్తారనీ ఒకడు చెప్పాడు. త్రోవ చూపించాడు. బయలుదేరాం. ఇక్కడికొచ్చేసరికి - ఇది వరకు నొప్పిలాంటి దనుకున్నాను. ప్రక్కలో నొప్పి వచ్చింది. అదేం మాయనొప్పో గంటలో ప్రాణం తీసేసింది. నేనే గొయ్యి తీసి యీ ఒంటరి స్థలంలో నారితూని యిక్కడ దాచుకున్నాను. ఆ క్షణంనించీ మావూరు విటాజన్ వదిలేసి - నేనూ ఒంటరిగా ఆ షోర్యాన్‌ద్వీపంలో బసపెట్టుకున్నాను".

ఆగి ఆగి చెప్పినా కైతూ ఆవేదనను యిద్దరూ అర్థం చేసుకున్నారు. కైతూ మీద వీళ్లిద్దరికీ యెంతో గౌరవం యేర్పడింది. అలా నడుస్తూనే సాయంత్రమైనా

చీకటి పడనట్లుంది. దట్టమైన అడవిలో కోతుల గుంపులు కదుల్తున్నాయి కంగారుగా!

"మా మిత్రులు దగ్గరగా వున్నారు" అన్నాడు కైతు.
"ఈ కోతులు నీ మిత్రులా?" అన్నారు పవులో.
"కాదు కోతులుతినే మనుషులు".
"మనుషులు కోతుల్నితింటారా?"
"అదొక తెగ, కానీ వాళ్ళు చాలా సహాయం చేస్తారు".
అలా కొంత దూరం కదిలే సరికి ఒక గుంపు తారస పడ్డారు. వాళ్ళకి కైతూకి మంచి పరిచయం. ఆ రాత్రి ఆ గుంపుతో గడిపారు. ఇంకా చుక్కలు ఆకాశాన వున్నాయ్. కైతూ యింకో మనిషి పవులోని లేపారు.

"తెలిసిన వాడే వున్నాడు. తెల్ల తొక్కకాదు. అప్పడే తాగి స్పృహ తప్పి వున్నాడు. పళ్ళన్నీ ఆరగించేసాడు".

లేవగనే ముసలమ్మ ముసలాడు వణుకుతూ బయలు దేరారు. త్రోవలో కైతూ పవులో దగ్గరగా వచ్చాడు. చేతిలో కొంత డబ్బు పెట్టాడు. "పెట్టిలో బేందు వున్నాది. నాలుగు రాళ్ళు వచ్చే దాక బతకడానికి యిది వుంచు" అని డబ్బు అందించాడు.

తెల్లవారే సరికి సరహద్దుదాటి పోయారు.

## 9

ఇది చిన్న పడవకాదు. అందరి దృష్టి లగ్నమైన పెద్ద పడవే మునిగిపోతే దివార్‌లో యెన్నెన్ని పుకార్లు, కారణలు వూహలు అల్లుకున్నాయ్.

సిగ్గుతో క్లాటినా వరండాలోకే రాలేదు. బాధతో రోసీ మంచం దిగలేదు.

"పౌరుషం తగ్గించి, తెచ్చి పెళ్లి చేసేయ కూడదూ?"

"పెళ్లే - పట్టుబడితే ఆ వువులో పీకే తెగేస్తాడు".

"వాళ్లా? యే పవడ పట్టుకొని పారిపోయరో?"

"ఏ అడవి దారంటపడి బోర్డరుదాటి వెళ్లి పోయారో?"

వారం రోజులైన వారిజాడ తెలియక పోతే " వాళ్ళింక వీళ్లకి చిక్కరు" అనేసారు. పరామర్శకు వచ్చిన వాళ్లను చూస్తూంటే యేదుపొస్తోంది. రోసీ దంపతులకు. అయినా యేడ్పపల్సి నెందుకై పోవడమని మనసు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

"ఎరిగెరిగి పాపం చేసి, ఆ భూమి కాజేసుకున్నాడు. దాని ఫలితం యేడ్చేడ్చి అనుభవించకపోతే - ఈ చర్చిలెందుకు? ఈ దేముళ్లెందుకు?" అన్నారు కొందరు.

ఇలాంటి ప్రశ్నలు తేలికైన మనుషులు వేస్తున్నారు. దివార్‌లో యేదో మార్పు వచ్చేసింది. ఈ మార్పును తెచ్చినాడెవడు? ఇంటి ప్రక్కనే చేరి తన యింటి వాసాలు లెక్క పెట్టి, తన యింటికి కన్నం వేసే వాడెవడు?

ఇటు మౌనంగా వున్న జోస్ అని కాస్సేపు అనుకున్నాక, అటు వాగుతున్న ఎడ్డీయేమోనన్నా అనుమానం కలుగజేస్తోంది.

తన అథారిటీని, అంత బాహాటంగా యీ దివార్ చరిత్రలో సవల్ కాగితాల మీద వెయ్యగలిగినవాడు యిద్దరిలో యెవడు? పంచి పెట్టిన కరపత్రాలు చదివి ఆలోచిస్తే, యిది తన అధికారాన్నే కాదు. తను యే ప్రభుత్వ రథంలో ఒక చక్రమో, ఆ రథ గమనాన్నే ఆపాలని ప్రయత్నిస్తున్నారెవరు?"

ప్రభుత్వపు అతినమ్మకమైన సేవకునిగా తన కర్తవ్యం తను నిర్వర్తించాలి. ఊర్లో నాలుగు మూలలనించి వచ్చిన పెద్ద మనుషులను వుద్దేశించి ఆ కరపత్రాలు చదివి వినిపించి రోసీ అన్నాడు.

"ఘనత వహించిన యీ పోర్చుగీసు పరిపాలనలో దొంగతనాలూ దోపిడీలు లేవు. మనిషి యింకా పశువై మనిషిని చంపడం యెరుగం. అంతా హాయి. ఒక బాటిల్ ఫెన్నికి నాలుగణాలకి పోస్తున్నారు. పని చేసినా చెయ్యకపోయినా ప్రజ తింటున్నారు, తాగుతున్నారు, డాన్సు చేస్తున్నారు. మూడు మతాలవారు ముచ్చటగా కలిసిమెలిసి బతుకుతున్నారు. ఇంత హాయిగా వున్నా, ప్రజలు దేముణ్ణి



అన్నమాచార్య నృత్య విభాగంలో నాట్యం చేసిన
చిరంజీవి జ్యోతి

మరువలేదు. ఈ ప్రభుత్వాన్ని వదులుకున్నామో మనకు పుట్టగతులుండవు. గోవాలో బ్రతకలేం. గోవాను గోవన్లు పాలించరు. ఇండియానించి దిగబడ్డ కొత్త దొరలు మనల్ని పైకి లేవకుండా పాతిపెట్టి వలాయిస్తారు..."

అందరూ అతను చెప్పిందంతా నిజమేనన్నారు. ఇటువంటి చిలిపి చేష్టలు ప్రతిఘటించడానికి ఒక కమిటీని యేర్పాటు చేస్తే బాగున్నని రోసీ సూచించాడు.

ఎడ్డీ తప్పక అవసరం వుంది అనగానే రోసీ వెంటనే

"ఈ కమిటీకి పెద్దగా ఎడ్డీ వుంటేనే మంచిది, తెలివి, వాకచక్యం రెండూ వున్నవాడు, రెండు వృత్తుల్లో దిట్ట".

అందరూ సరేసరే అంటే ఎడ్డీ తనకీ బాధ్యత అప్పజెప్పవద్దని కోరాడు.

"ఏం?" అడిగాడు రోసీ.


"నా కేసులు... వాగొడబలు నాకే వున్నాయ్".

"ఎల్లప్పుడూ స్వంతమే అనుకుంటే యెలా? నీకు రెండు నాలుకలు మాత్రం లేవుగా?"

"అందుకే యీ బాధ్యత వద్దంటున్నాను".

"ఈ కరపత్రాల్లో నీ ప్రమేయం వుందని అనుమానించేటట్లు మెసలుతున్నావే" వన్నాడు రోసీ చప్పన.

ఎడ్డీ ఒక్కసారి చక్రుమని "పైనించి పేదవాళ్లకని వచ్చిన పాలూ, పంచదార, గోధుమలు, వెన్న, బిస్కత్తులు నేనేం అమ్మలేదు. తినలేదు. అలాచేసిన వాళ్లని



* Licensed user of T.M. Geoffrey Manners & Co. Ltd.
GM-HW-85-TL



యింకా తినడానికి యీ కమిటీలో వుంచండి నేనుండను''.

''కోపం నివ్వు డాక్టరువని అనుకోవడం వలన వచ్చింది ఎడ్డీ! ఇప్పుడు నీవు లాయరువనుకుని చెప్పు - సరవ సమ్మతంగా ఏకగ్రీవంగా యింతమంది యెన్నుకున్న నీహోదాని వదుకుంటావా?''

''ఈ హోదా వలన నాకు వచ్చినవి తిట్లు.ఎవరు చేసిన తప్పులకీ నన్నే దుయ్య బట్టారు''.

''ఇంకా లాయరుగా మారలేదు నివ్వు, ఈ సంఘం పెద్దగా ఘనత వహించిన ప్రభుత్వ ప్రతినిధివవుతున్నావా లేదా?''

''అది నిజమే!''

''ఇప్పుడు లాజికల్‌గా ఆలోచిస్తున్నావ్, నీ విశ్వాస పాతమైన సేవకు, ప్రభుత్వం మెచ్చి నీకో జడ్జీగా వేస్తే...''

ఆఖరికి ''సరే!'' నన్నాడు ఎడ్డీ,

ఈ యెండలో, యిది తడి గుడ్డని ముట్టుకుంటే అది గొంతు కోసుకోడానికి పని కొచ్చింది. ఎలా బయ పడడమో ఎడ్డీకి తెలియలేదు. ఇంటికెళ్లి లాపుస్తుకాలన్ని తిరగ వేస్తున్నారు. ఎక్కడా యేమీ తట్టలేదు. చివరకు జోస్ దగ్గరకు వెళ్లాడు.

''నీ పుణ్యం వుంటుంది బాబో! ఇక కరపత్రాలు వెయ్యించకు'' అన్నాడు.

''నేను వెయ్యిస్తున్నానని యెవరు చెప్పారు?''

''రోని నివ్వో నేనో వెయ్యిస్తున్నా మని నమ్ముతున్నడు నేను వెయ్యించలేదు. నివ్వు ఒక స్వతంత్ర దేశం నించి వచ్చావుకదా... నీవు వచ్చిన దగ్గరనించి యీ గొర్రెలకు కొమ్ములు మొలిచాయ్. పొడవ నేరుస్తున్నాయ్''.

''నేనేం నీలా వుపన్యాసాలివ్వటంలేదే!''

''మౌనంగా యీ నమూాల కూర్చొనే దివార్‌లో శూద్రులందరినీ రెచ్చ గొడుతున్నావ్! నీ ఉన్నతమైన కుటుంబ చరిత్ర మరచిపోవద్దని కోరుతున్నాను''.

''ఏ మతంలో యీ హెచ్చు తగ్గులున్నాయో చెప్పు? ఏ రాజనీతి యీ హెచ్చు తగ్గులను సమర్థిస్తోంది చెప్పు ''హెచ్చు తగ్గులుండబట్టే సమాజం కొండ పక్కలో లోయలో అందంగా వుంది''

''మనిషి స్వలాభంతో సృష్టించిన హెచ్చుతగ్గులకు నేను తలవంచను''

''నీవు లోయనుపైకెత్తితే అదీ కొండయి కూర్చుంటుంది''.

''అప్పుడు మార్పును చూసి మనుషుల్లో వున్నానని తృప్తి చెందుతాను'' అన్నాడు జోస్.

ఎడ్డీ వెళిపోతూ బయట ఆగి ''ఒకసారినీ జాగా కొలుచుకుని చూసుకున్నావా?''

''అవసరం లేదనుకుంటాను!''

"రోనీ అటువైపు నాజాగా మూడడుగుల పొడవునా ఆక్రమించుకున్నాడు".
"అందుకేనా లాయర్ వయాయవు?"
ఎడ్డీ నవ్వేసి
"బొంబాయి రణగుణ ధ్వనిలో మౌనంతో శక్తిని పుంజుకున్నావు. ఈ దివార్ ప్రశాంతతలో, కొద్దో గొప్పో మాటాడుతున్నావు. తప్పక లీడరువయి కూర్చుంటావ్" అన్నాడు.

# 10

కమిటీ కళ్లు కప్పి పేదాద్ గుట్టమీద వెట్టుపై మూడు వర్ణాల జండా వుదయమే యెగిరింది. నమ్మని దివార్ ప్రజలు దగ్గరగా వెళ్లి ఆ త్రివర్ణ పతాకాన్ని చూసారు.

వెంటనే తీసే బదులు దాన్ని పరిపాలకులకు చూపించి తీయాలి కదా! పంజి నించి అధికారులొచ్చి చూసిన తర్వాత ఆ జెండాను దించేసారు. దించాక రోనీ యింట్లో ఆ పెద్దలంతా సమావేశమయ్యారు. కమిటీ పెద్ద ఎడ్డీ కూడా వున్నాడు. వీళ్లిక్కడ కూర్చొని మంతనాలాడుతుంటే జోస్ యింటినించి స్వతంత్ర భేరీలా బాండు స్వరం వినిపిస్తోంది. ఆ స్వరం వినగానే భారతదేశంలో గౌరవంతో నిల్చున్న స్వరంలా వుంది.

ఇలా జెండా యెగర వెయ్యడానికి కారకులెవరో రోనియే చెప్పాడు. "వీడు దివార్‌లో కాలుపెట్టిన దగ్గర్నుంచే చిన్న పెద్దా తారతమ్యం పోయింది. ఎదురు జవాబులివ్వటం ఒక ఫేషనుగా లేని వాళ్లలోకూడా ప్రాకింది. ఎదిరించడం బెదిరించడం దివార్ జీవితంలో అన్ని రంగాల్లోనూ ప్రాకి అదో జన్మ హక్కు చేసుకుంటున్నారు. ఈ రోగాలను వెంటనే అరికట్టకపోతే ఆ మహమ్మారి, యిక్కడనించి గోవా అంతా ప్రాకి ఘనమైన ప్రభుత్వానికే తాకుతుంది. మందులు యెప్పుడూ పనిచెయ్యవు. పనిచేసినా అందరి తత్వాలమీద ఒకే గుణం యివ్వదు. ఈ రోగాలను పైవించి తెచ్చినాటంది జోస్. వీడ్ని పదుగురు మధ్య వుంచితె మౌనవ్రతం దాల్చే విప్లవ జ్వాలలు సృష్టిస్తాడు. దీని బదులు ఆ అగూడా జైలులో బందీలకు కాస్త మనోల్లాసం కలిగించేటట్లు చూడండి. ఆ బ్రాసు బ్యాండుతో అందులో బంధిస్తేసరి!"

నిలుచున్న పాటున పోలీసు సహాయం అవసరం లేకపోయినా వాళ్లు వెంట వుండగా జోస్‌ని పంజి తీస్తుకపోయారు.

"ఆ యింట్లో యేదో నలుసుంది - లేకపోతే యెవరూ సరిగ్గా వుండటం లేదు. పదేళ్లా దెయ్యాల కొంపలావుంది. ఇప్పుడు యితను వుందామని వస్తే యిదేమి చోద్యం? పరదేశీయులు పోవాలని అరిచే వాళ్లంతమంది దివార్‌లో వుండగా, మాటాడని మునీశ్వరుడ్ని తీసుకపోతున్నారు..." అన్నారు ప్రజ.

జోస్ అరెస్టుని చూడలేని ఎడ్డీ గబగబ రోనీ యింటికి వచ్చాడు.

"స్వంత భార్య ఒకే ఒక సహోదరుడనైనా... ఆలోచించ కుండా... ఎంత పని చేసావ్ రోనీ..."

దిగులుతో కృంగినా కూడా ఎడ్డీతోపాటు వచ్చి అంగటి గదిలో కూర్చుంది.

"నివ్వయినా చెప్పలేకపోయావా?" అన్నాడు ఎడ్డీ క్లాటినాతో.

"రోనీ అధికారుల యెదరగా జోస్‌ని అపరాధిని చేస్తున్నప్పుడు నివ్విక్కడే వున్నావే... నివ్వెందుకూరుకున్నావ్?" అంది క్లాటినా.

"డాక్టరుగా లాయరుగా నావృత్తి ధర్మం యెలాపాటిస్తావో యీ విషయంలోనూ అంతే - పిలవని పేరంటానికి పోయి పీకల మీదకి తెచ్చుకోవడం నాకిష్టంలేదు".

"నివ్వే రోనీ పరిస్థితిలో వుంటే యేంచేసే వాడివి?"

"ఆ జండాని పీకించేసి అవతల పారేసే వాడిన".

"మళ్లీ జండాలు యెగరవేస్తే—"

"ఊడబీక్కుండా వూరుకుంటే అదే గాలికి చిరిగిపోయేవి. లేదా వాళ్ల మట్టుకు వాళ్లే వూడ బీకేసేవారు".

"ఎవర్నో ఒకర్ని అధికారులకు ఒప్పజెప్పాలికదా!"

"అదే అవసరమైతే ఆ పెద్రోని ఒప్పజెప్తే! — వాడు మీకు చేసిన అన్యాయానికి తగిన శాస్తి జరిగి వుండేది".

"వాడు నానెంబరువన్ శత్రువు... వాడికెలా అప్పచెప్తాను?" విసుగ్గా అన్నాడు రోనీ.

"మీ రీజనింగు నాకు అర్థం కాలేదు".

"వాడ్ని అప్పచెప్పి ఒక హీరోని చేసే మంటావ్. ఆ హీరో గౌరవం మా వాడికి చెందింది. వీడు నాబద్దవైరుని సలహా దొరకగపోగానే మళ్లీ కుక్కలాగ దగ్గరకు వస్తాడు చూస్తుండు..."

"అధికారి యెదరగా సామాన్య ప్రజలెలా మారిపోయారో చెప్పారు. ఆ మాటల్లో యే మాత్రం నిజం వువాన మళ్ళీ వాడు మీ గుమ్మం తొక్కడు".

"ఎందుకు తొక్కడు?"

"దివారంతా తెలుసు... నీవిప్పుడు కోరలూడబీకిన పులివని"

"నీవుకూడా యిలా మాటాడుతున్నావా ఎడ్డీ? నన్ను నివ్వు అని సంబోధిస్తున్నావా?"

"ఈ వేళ జోస్‌ని తీసుకపోతున్న పోలీసుల వేపు చూసావా?

"చూసాను"

"ఇదివరకు పోలీసులకు వీళ్లకు యేం భేదం?"

"వాళ్లే వీళ్లు — నాకే భేదం కనపడలేదు".

"కనపడలేదా? నీ దృష్టి మందగించింది. నీ మెదడు ఆలోచించడానికి వెనుకాడుతోంది. నివ్వెవరినైతే భృత్యునిలా కొలుస్తున్నావో సర్వస్వం అని నమ్ముతున్నావో వాళ్లే నీ శీలాన్ని శంకిస్తారు. నిన్ను స్వంత భార్యలా కాదు, ఒక పడుచుకున్న పడతిలా చూస్తారు..." "అబ్బా! ఈ వుపమానాలన్నీ యెందుకు?"


"ఆ విసుగు మంచిది కాదు. రానున్న వుపద్రవం గురించి చెప్తున్నాను. ప్రజలమీద సవారీ చేసే రోజులు పోతున్నయ్"

ఇంతకీ పోలీసుల్లో మార్పులేంటో చెప్పవయ్యా?"

"ఇదివరకు గోవను పోలీసుల చేతుల్లో కూడా పిస్తోల్లుండేవి కదా! ఇప్పుడు మాదు పోర్చుగీసు యిన్స్‌పెక్టర్ చేతిలోనే వుంది. గోవను పోలీసుల చేతుల్లో పిస్తోళ్ల బదులు లాఠీలు వచ్చాయి. దీని భావం యేమిటి? పాలకులు తమ స్వంత సిబ్బందినే నమ్మటంలేదు. స్వంత పెళ్ళాం శీలం శంకించిన వాళ్లు యెంతకాలం యేలుబడి చెయ్యగలరు?'"

ఎడ్డీ వెళ్లిపోయాడు. అంత విశాలమైన గదిలో యిద్దరే మిగిలారు. అంత భవనం బోడిగా కనిపిస్తోంది. ఇది వరకు ముగ్గురున్నా భవనం అంతా కలకల్లాడుతుండేది. గలగల శబ్దాలు వినిపించేవి. వుత్సాహం, వంపులు తిరిగిన సుందరి వయ్యారంగా నడిచినట్లుండేది. ఆ ఒక్క ప్రాణి మసలకపోగానే యిల్లంతా వెలుగు పోగొట్టుకుని చీకటి కొట్టుగా తయారైంది.

అలా నగిషీ చెక్కడాలు నిండిన టేకు పలకలు తాపిన యింటి కప్పు వేపు చూస్తునే రోనీ అన్నాడు.



''దివార్ మారిపోయింది. ఇక మనం పాలించలేం!''

క్లాటినా చ్రరున లేచింది.

''ఆ మాట యెలా అనగలిగావ్ రోనీ! నీకు మెదడు రోగంగాని వచ్చిందా?''

''మిగతా మెదళ్లు రోగ విముక్తి పొందాయి. వాళ్ల హక్కు లేవో వాళ్లు దెలుసుకున్నారు. గొర్రెలనించి మనుషులుగా మారారు. హక్కులు తెలుసుకున్న వాళ్లను పాలించడం చాలా కష్టం...''

''ఎవరి తప్పు? నివ్వు పట్టు సడలించావ్ - అందుకే తప్పించుకు పోయారు. చేతకాని వానికలా యిప్పుడు లోకం మారిందంటున్నావ్? లోకం యెప్పుడూ మారదు. ఏకాలంలోను గొప్పా బీదా వుండనే వుంటుంది''.

''క్లాటినా...''

ఇంకా క్లాటినా విసవిసలాడుతుంటే ''క్లాటినా - నేనుపట్టు సడలించా నంటున్నావ్ - నివ్వేచేసావ్?''

''నేనేం చేసాను?''

రోనీ చప్పున లేచిపోయి బిగ్గరగా

''నివ్వు పట్టు సడలించకపోతే, నా కూతురుయెలా లేచిపోగలుగుతుంది?'' అంటూ అదేపనిగా వెక్కి వెక్కియేడవటం మొదలు పెట్టాడు. క్లాటినా దగ్గరగా వచ్చి భర్తను దగ్గరగా చేర్చుకుని.

''మైడియర్! ఈ అవమానం నేనూ కాటికి పోయే వరకు మరువలేను. పాలకునిగానే వుండు. పాలకునిగానే వెళ్లిపో - మనంగర్వాన్ని మాత్రం చంపుకోవద్దు''.

రోని క్లాటినాని గట్టిగా బాహువుల్లో బంధించి ''నాస్వీట్ - నా డార్లింగ్ - నాక్వీన్...'' అంటూ యేమేమో చేసేవాడు.

## 11

ముగ్గురూ దివార్‌లో యిప్పుడు లేకపోయినా పవులో ధీరత్వానికీ, గ్రేస్ అందానికీ, జోస్ మౌనానికీ రోజుకు రోజూ గౌరవం, మెప్పులు పెరుగుతున్నాయ్. దానికి తగ్గట్లు రోనీ మీద అసహ్యం కూడా పెరుగుతోంది. తనను యేకాకిని చేసినట్లు, యెవరూ యిదివరలా రోనీ వెంట పడలేదు. వెంటపడితే యెందులో యిరికించేస్తాడోనని కలిగిన కుటుంబాల్లోను భీతి పట్టుకుంది. రోజూ టైము తప్పకుండా తన పడక గదిలోనికి వచ్చి దివార్ ముచ్చట్లు చెప్పింది ఎడ్డీయే! వీడు చెప్పినవన్నీ నమ్మతగ్గవిగానే వున్నాయ్.

ఒకనాడు చీకటిపడితే వీధుల్లో తిరగడమే వుండేదికాదు. ఇప్పుడు ప్రజ రాత్రుల్లప్పుడుకూడా తిరుగుతున్నారు. హెచ్చుతగ్గులు, తారతమ్యం లేకుండ కలుస్తున్నారు. ప్రశ్నిస్తున్నారు. సరైనా జవాబివ్వకపోతే, అనుకున్నట్లు జరగకపోతే వూరుకోవటం లేదు. అలజడి చేస్తున్నారు. ఇన్నాళ్ళు అణచి పెట్టిన వుద్రేకాలిప్పుడిప్పుడే బయట కొస్తున్నాయ్. ఉద్రేకాలను సృష్టించే ఆశలు మొలకెత్తి, యెన్నడూ కనీవినీ యెరగని పనులు చేస్తున్నారు. లేమి ప్రజ కమ్యూడిడేడ్ అనే బంజరు భూములను ఆక్రమించుకుంటున్నారు. పంటలో కేటాయించిన నాలుగో వంతు ఫలసాయం అమ్మగా వచ్చిన డబ్బును కాలవలు, గట్టులు కట్టలు రిపేరు చెయ్యడానికి పెద్దలు వినియోగించకపోతే ప్రశ్నిస్తున్నారు.

ఇన్నాళ్లా మూగపోయిన జాతికి మాటలొచ్చాయ్. చౌకగా దొరికిన పానీయాల మత్తులోపడి, ఆశలను మరచి పూలతోటలో విహరించిన సీతాకోక చిలకల్లానో, తుమ్మెదల్లానో ఝుమ్మని రాగాలు తీసుకుంటూ బ్రతికిన ప్రజకు, కాళ్లూ చేతులిప్పుడు స్వాధీనంలో వుండి ఆడుతున్నాయ్. అందుకే నిజం పలకాలని, తెలుసుకోవాలని, అణచి పాలించే క్రూరత్వాన్ని యెదిరించాలనీ ప్రజల్లో కలిగిన సంచలనం రోనీ యిన్నాళ్లా శ్రమించి నిలుపుకున్న క్రమశిక్షణ, సంఘం శాంతియుత జీవితానికి సవాల్‌గా తోచింది.

ఇవన్నీ విన్నాక వుద్రేకం కలిగినా యెవరో రోడ్డురోలరు నడుంమీద నడిపించినంతగా రోనీ చితికిపోయివున్నాడు. అధికారం ఆహారంగా బ్రతికిన మనిషి తరతరాలుగా ఆర్జించిన కీర్తి వెలుగులో సూర్యునిలా రథం యెక్కినవాడు ఒక్కసారి కూతురు తెచ్చిన తలవంపుతో రథ చక్రాలు జారిపోయి బురదగుంటలో మెడ వరకూ కూరుకపోయాడు. అపురూపంగా పరిరక్షించే కోహినూర్ వజ్రాన్ని నాదిర్‌షాయెత్తుకు పోయినంత పనైంది!

తన యిల్లు తడికలేని యిల్లులా మారి అన్ని వూర కుక్కలు దూరే నివాసమై పోయిందనిపించింది. తన శరీరం కుక్కిమంచంలావుంటే క్లాటినా చెప్పే మాటలతో ఆ కుక్కి కాస్త బిగించినట్లనిపిస్తోంది. ఎడ్డీ మాటలు వింటుంటే దుమ్ము కళ్లల్లోపడి మన్ను నోట్లో విసరినట్లున్నాయ్. ఆ క్షణంలో ప్రజాపోరాటం ఆరంభమైందని చెప్పి, మరోక్షణంలో అసలు నిజానికిది ఇండియా పోలీసు చర్యకు నాందీ ప్రస్తావన మాత్రమే అంటాడు.

''నన్ను చాలా తికమకల్లో పెట్టేస్తున్నావ్'' రోనీ విసుగ్గా అన్నాడు. ''పేద ప్రజల గురించి యిలాగే పోర్చుగీస్ పాలకులతో చెప్పి మనం వాళ్లను తికమకలపాలు చేసాం'' అన్నాడు ఎడ్డీ.

''మనం యేం చేసాం?''

''కలిగిన వాళ్లంతా పోర్చుగీసువాళ్లు కలకాలం వుండాలన్నారు. తిండీ, తాగుడూ, బట్టా దొరుకుతోందని లేని వాళ్లకు కూడా పోర్చుగీసు వాళ్లంటే యిష్టమే. ఆ కలిగిన వాళ్లు పోర్చుగీసువాళ్లంటే లేమివాళ్ల కిష్టంలేదని చాడీలు చెప్పబట్టే... ఈ మట్టిలో అపనమ్మకం నాటి పెంచాం''.


''దానివల్ల యీ ప్రభుత్వం పతనం అవుతుందంటావా?'' ''పాలించే వాళ్లు పాలితుల మధ్య అపనమ్మకం పెరిగితే యీ ప్రభుత్వమే కాదు కదా, సూర్యుడు అస్తమించని ఆ బ్రిటీష్ హయా మే ఇండియాలో పతనం అయిపోయింది''.

''ఒకోసారి నివ్వు లాజిక్‌తో మాటాడుతుంటావ్'' అన్నాడు రోనీ.

రోనీ యిల్లు కదలక పోవడంతో, రోగం పెరిగిపోయింది. ఎడ్డీ నీకేం రోగం లేదంటాడు. మానసిక రోగాలకు మందులేదంటాడు. నల్ల బొగ్గులా మనిషి రోజుకు రోజూ మాడిపోతుంటే నాశనం దగ్గర్లోనే వుందని తట్తోంది. పరువుయిచ్చి పరువు అందుకోడానికి యింకేం పరువు మిగల్లేదని పించింది. తన మాటను కోటను చేసే ప్రభువులు, యిప్పుడు ప్రజల మాట వినడానికి కుతూహల పడ్తున్నారు. తను పదునులేని కత్తినై పోయాననుకున్నాడు. ఇటు వెళ్లలేదు అటు వెళ్లలేదు. ముందుకు వెళ్తే పోటు వెనక్కువెళ్తే తన్నులు తప్పదనిపించింది. చలామణి కాని అధికారం యెంత పెరిగినా నష్టమే. అధికారం చలాయించకుండా వుంచినా మొద్దుబారిన కత్తిలా అయిపోతుంది.

ఎవరైనా యెందుకలా చిక్కిపోతున్నావంటే యేం సమాధానం తోచలేదు. ఒకోసారి ''వాడికెందుకు? ఇంకా చిక్కిపోతాను, మరీ మరీ చిక్కిపోతాను. మనసు పుడ్తే చచ్చిపోతాను''-అని అనుకునేవాడు రోనీ.

ఇలా మనసు పట్టు తప్పి, మనిషి చిక్కి మంచం యెక్కాడు. కబుర్లు చెప్పి,



మంగేశ్ ఆలయ అంతర్భాగం

కుదర్చటం కాదనుకుంది క్లాటినా! వయసులో వుండి ముసలైపోయానని యేడ్చేవాళ్ళ ఎంతకాలం బ్రతకరని ఆమెకు తెలుసు. అంతఃపురం బ్రతుక్కు అలవాటు పడినవాడు, ఆకాశంవేపు చూడాలిగానీ, భూమిలో బురద గుంట వేపు చూసేతత్వం అలవరుచుకున్న భర్తని చూసి విసుక్కుంది క్లాటినా! ఇద్దరి దృష్టులు వేరైపోయాయి. క్లాటినా బ్రతకాలని దృఢనిశ్చయంలో వుంది. చావాలని రోని నిర్ణయించుకున్నాడు.

అందుకే అర్ధరాత్రయినా నిద్రపోని రోనీ "క్లాటినా మైడార్లింగ్..." అని మూలుగుతూ పిల్చాడు.

ఆమెలేచి ప్రక్కన కూర్చుంది. గదిలో యెవరూ లేరు. వారిద్దరే, వారి మాటలు వినగలిగే వాళ్లెవరూ దగ్గర్లో లేరు. నెమ్మదిగా ఆగి ఆగి రోనీ అన్నాడు.

"నా కాఫిన్‌కు ఆర్డరిచ్చావా?"

"ఇమ్మంటే యిస్తాను. శవపేటిక్కేం కరువు? కాని నీ రాగటా నాకే నచ్చలేదు".

"నేనేం తప్పుచేసాను నీ దృష్టిలో?"

"శుభంగా పాతిపెట్టాలని కోరుకునే మనిషి గౌరవంగా చావాలి"

ఈ చివరి దశలో కూడా నాకు గౌరవం అన్న పదం అర్థం కావటం లేదు. నాకు గౌరవమైనది యెదుట వానికి అగౌరవం కావచ్చుకదా!"

"నీ గౌరవం నీది. ఎదుట వాని గౌరవం ఆలోచిస్తే నీ మిత్రుడెవడో శత్రువెవడో మరచిపోతావ్"

"ఈ చివరి దశలో కూడా యింకా మిత్రులూ శత్రువులూ అంటే లాభంలేదు. అందరూ మిత్రులే... అందరూ మంచివాళ్లే..." "వచ్చి పోతుంది నివ్వు. నేను మరికొన్నాళ్ల బ్రతికే వుంటాను. నివ్వు సింహంలా వచ్చేబదులు





గాన (గోవా) కోకిల లతా మంగేష్కర్
గోవా అందించిన కలం డావ్ మొరేస్

గుంటనక్కలా ఛస్తావంటున్నావ్. చావు కాదనను. అది నీయిష్టం - కానీ నేను సివంగిలానే చివరి వరకూ బ్రతికి సివంగి రూపంతోనే ఛస్తాను''.

''అంటే...''

''నీ బుర్రపని చెయ్యడం మానింది కాబట్టి వివరిస్తాను విను. నేను దేనికైనా తలవంచుతానుగానీ మోసానికి తలొంచలేను. నా జీవితంలో యే ఒక ప్రాణి చుట్టూ నా ఆశలు అల్లుకున్నాయో దాన్ని మోసంచేసికాజేసిన వాడెవడు?''

''ఎవరు? నీ స్వంత అన్నయ్య జోస్ మద్దత్తుతో సంగీతం, శరీరం మెరుగులు చూపించి ఆ పవులో గ్రేస్‌ని మభ్యపరిచాడు''.

''కాదు వాళ్లెవరూ నేరస్థులుకారు''.

''మరెవరు?''

''అమాయకంగా కనిపించే ఆ పెడ్రో...''

''నాచేత నున్న అధికారం అంతా వుపయోగించి వాడ్ని నాశనం చేస్తుంటే - జోస్ జోక్యంతో''.

ఇంక మాటరాక కాస్సేపు ఆగి

''అందుకే జోస్‌కి జైలుకి పంపిచాను...''

''అయితే యిప్పటినించి కాదు - అప్పటినించే నీ మతి చెడిందన్నమాట!''

''మతి చెడితే యింకా సుఖంగాయెలా వుండ గలుగుతున్నాను?''

క్లాటినా లేని సుఖం గురించి మాటాడుతున్నా యీ మొగుడివేపు నిదానించి చూసింది. రోనీ యేదో ఆలోచించుకుంటున్నవాడు పెళ్లాన్ని ప్రక్కకు రమ్మని సైగ చేసాడు. ఆమె దగ్గర కూర్చుంటే ఆమె చేతిని పట్టుకుని అదే పనిగా ముద్దులాడుతూ యిదే సుఖం అన్నట్లు మొగుడు మెసలుతుంటే... ''సుఖం - ఇది మబ్బులా వచ్చి చినుకులను రాల్చే సుఖం - తర్వాత మళ్లీ మామూలే. జీవితం పెనుగులాటే... సుఖానికి శాశ్వతమెక్కడ?''

''క్లాటినా శాశ్వత సుఖం ఒక్కచోటే వుంది''.

''వేదాంతంకూడా వచ్చిందీ?''

రోనీ క్లాటినా వ్రేలిలోనున్న ఉంగరం తాకుతూ ''ఈ మృదువైన మనోహరమైన చెయ్యి తాకి యీ ఉంగరం తగిలించిన క్షణాలు తల్చుకున్నప్పుడల్లా నా సుఖానికి శాశ్వతత్వం చేకూరుతుంటుంది''. అని ఆవేశంతో పరుపుమీద నించి లేచిపోతూ ''నేను యెందరికో మోసం చేసి వుంటాను... మరెందరికో హాని చేసుంటాను. కానీ నిన్ను మాత్రం యెన్నడూ మోసం చెయ్యలేదు. చచ్చినా చెయ్యబోను...'' అంటే ఆమె భర్తను ఆమె మృదువైన హస్తాలతో తాకి మళ్లీ పరుపు మీద వేసి ఆవేశంతో అదే పనిగా రోనిని పాదాలనించి తలవరకు ముద్దులాడేసింది. తరువాత నిల్చుని రాలుతున్న కన్నీటిని తుడుచుకుంటూ అంది.

''నేను దివార్ చక్రవర్తిని పెళ్లాడాను. అందుకే యీనాటికీ మహారాణీలా బ్రతుకుతున్నాను - నీ మదిలో! ఇంతకన్న అదృష్టం నాకింకేంకావాలి?''




వ్యంగ్య చిత్రాలలో గోవా టూరిస్టులు కార్టూనిస్టు: మేరియోమిరాండా
(1980 ఏప్రియల్ 6-12 ది ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో)

## 12

క్లొటినా మనసులో అనుకున్నవి మాటలై బయటకు దొర్లిపోతున్నాయ్. ఎవరూ లేకపోయినా యెవరితోనో చెప్పుకుంటున్నట్లు ఆవేశం పెల్లుబికి పిచ్చి దానిలా అప్పుడప్పుడంటున్న మాటలుకొన్ని:

"పవులో నాయింటి స్వీపరు".

ఆ కుటుంబమంతా నాయింటి నౌఖర్లు.

స్వీపరు రాజబిడ్డను మాయచేసి యెత్తుక పోయాడు.

దివార్ చరిత్రలో చర్చిలో కాలుపెట్టిన, కడజాతి అమ్మాయైనా లేచి పోలేదు. కూటికి లేకపోయినా ప్రభువు సమక్షంలో జంటగా ప్రమాణం తీసుకున్నారు. ఈ మోసాన్ని కూతుర్లను కనని వాళ్ళు ప్రోత్సాహించాడు. వాడి అంతు చూడనిది నాకు నిద్దర పట్టడంలేదు..."

రోనీ యీ మాటలన్నీ వింటూ ఆలోచిస్తున్నాడు. ఏం చేస్తున్నాడో ప్రజలను కుంటూంటే క్లొటినా చెవి వరకూ వచ్చి మొగుడ్ని ప్రశ్నించింది.

"పేదలకు పంచి పెట్టడానికి మధ్య మనిషెందుకు?" అంది.

"వాళ్ళ గద్దిస్తే నాకు మర్దించే స్తోమతలేక!"

"ఆ పని ఎడ్డీ చెయ్యగలడా?"

"ఆ శూద్రులు తలనొప్పితో, కడుపునొప్పితో ఎడ్డీ దగ్గరకు వచ్చినవాళ్లే. వాడి చేతితో నాపేరున యిస్తే వాడి ద్వారా వాళ్ల నమ్మకం నావరకూ వస్తుంది"

"వాళ్ల నమ్మితే యిప్పుడు నీకేం వస్తుంది?"

రోనీ జవాబు చెప్పలేదు.

ఆ వారం రోజుల్లో వాళ్ల జాతిలో పలుకుబడి వున్న పదిమంది శూద్రులు వచ్చారు. పిల్చినా పెద్రో రాలేదు. వాడు వద్దన్నా వీళ్ల ఎడ్డీ మాటకు కాదనలేక వచ్చారు. వాళ్లకు ఒకప్పుడు యీమహారాజు భవనం చూడాలన్న కోర్కె యీరోజు తీరుతోంది. వచ్చిన వాళ్లను డ్రాయింగు రూములో కూర్చో బెట్టి, ఎడ్డీ తినడానికీ, తాగడానికీ పుష్కలంగా యిచ్చాక

"రోనీ మంచం దిగలేనంత నీరస స్థితిలో నున్నాడు. మీతో మాట్లాడాలని కుతూహల పడ్తున్నాడు. ఒకసారి ఆ పడక గదిలోనికి వస్తారా?" అన్నాడు.

అందరూ ఒకరివెనుక ఒకరు కదలి రోనీని చూడగానే

"ఇంతడీలా చేసిందని మాకు తెలీదే? ఏం జబ్బు ఏమిటి?"

జవాబు యిసారి రోనీ నోటినించే వచ్చింది. "డాక్టర్లు పోల్చలేని జబ్బు. కానీ నాకు తెలుసు యీ జబ్బు యెందుకొచ్చిందో?"

అంతా ఆతృతగా చూస్తుంటే వెనుకనించి పాధర్ పింటో వచ్చి మంచం దగ్గర్లో కూర్చున్నాడు. రోనీ అలసిపోతూ ఆగి ఆగి

"అధికారంతో మీ అందర్నీ నానా హింసలు పెట్టాను. మీ కొంపల్లో దీపాలైనా వెలక్కుండా చేసాను. మీకు దూరమై, దేవునికి దూరమయ్యాను. మీరు గొప్ప వాళ్లు. ఇన్ని హింసలు బాధలు సహించారు. ఇప్పుడు పిలవగా వచ్చి నామీద జాలి పడ్తున్నారు. ఈ చివరిదశలో నాకో కోరిక మిగిలింది. అది తీర్చే వాళ్లు మీరే! హామి యివ్వండి. హాయిగా వచ్చిపోతాను" అన్నాడు.

"చెప్పదొరా!" అన్నాడు ఒకడు రోనీ పాదర్ పింటో వేపు చూసి

"మంచి సమయానికి ఫాదరూ వచ్చారు. ఇది మీరు ఫైసలా చేస్తే అతను అమలు పరుస్తారు".

"సంశయించక చెప్పు దొరా"

"బతికుండగా మీ మధ్య వుండలేని వాడిని, చచ్చాకైనా మీ మధ్య నుండనివ్వరా?"

వాళ్లకర్థం కాలేదు. అందుకే విడమరచి మళ్లీ అన్నాడు "నాశవం శ్రమ జీవుల శవాల ప్రక్కనే పాతిపెట్టేనే నాకు ముక్తి".

"చక్రవర్తివి! చలువరాతితో నీ సమాధి అగ్రకులాల వేపు వుంటేనే అందం".

"వద్దు - వద్దు అటువేపు వద్దంటే వద్దు. నేను బతికుండగా నా చేష్టలతో వాళ్లు బాగుపడ్డారు. శూద్రులు బాధపడ్డారు. నాశవంపై యే చలువరాతి పలకా వుండొద్దు. ఆ ఆరడుగుల జాగా మళ్లీ మళ్లీ వాడ నియ్యండి".

శూద్రులు వాళ్లల్లో వాళ్లు ముఖాలు చూసుకుంటుంటే ఎడ్డీ అన్నాడు " ఏం పెద్ద కోర్కె అని - అలా సంశయిస్తున్నారు?"

అలా చేస్తే అగ్రకులాలవాళ్లు మమ్మల్ని బతకనిస్తారా?" అందరి సంశయాన్ని ఒకడు అనేసాడు.

"అందుకే ఫాదర్ పింటో యెదరగా యీ ఇరారు జరుగుతోంది. వీలూనామా రాసినట్లు యిది కూడా రాత కోతల్లో పెట్టమంటే పెట్తాను" అన్నాడు ఎడ్డీ.

"అందరూ సమ్మతించినట్లేనా?" అని పింటో అడగ్గానే అందరి తలలూ యిందులో యేముందని సమ్మతిని తెలియజేసినట్లూగాయ్.

ఇంతలో అందరికీ ఆశ్చర్యం కలిగించిదృశ్యం..; రోని యేడుస్తున్నాడు. తల్లిని పోగొట్టుకున్న చిన్ని పిల్లవాని మల్లే యేడుస్తున్నాడు.

"ఏం దొరా? ఎందుకేడుస్తున్నావుదొరా?"

"మనిషి మనసు వదిలేసాడుగానీ, ఇది చావుకు వయసు కాద"ని యింకొకడు వాఖ్యానించాడీ పరిస్తితి చూసి.

"అతను చావుకి భయపడే మనిషికాదు" అన్నాడు ఎడ్డీ.




"ఇంకేం బాధో?" అన్నాడొకడు.

"ఇందరొచ్చారు? అసలైనవాడు రాలేదని అతని బాధేమో?

రోనీ అంతేనా? అడిగాడు ఎడ్డీ.

"అవును..."

"పిల్చాను, బతిమాలాను వీళ్లంతా చెప్పి చూసారు. నివ్వు మారినా పెద్రోకి నీ మీద నమ్మకం కుదర్లేదు".

దేముడు నన్ను క్షమించాడు గానీ... పెద్రో నన్ను క్షమించటం లేదు. నిజమే... వాడి భూమి కాజేసాను. వాడిల్లు కాల్చాను. వాడికి రక్తం చిమ్మినట్లు బాదాను.... ఆ రోజుల్లో నేనో కర్కోటకుడ్ని... కానీ యిప్పుడు మంచి పామును - వాడే శ్రమపడి ఆ మామిడితోట వేసి పంచాడు. ఆ తోటతో సహా వాడి జాగా తీసుకోని... చచ్చే ముందు ఒక్కసారి వాడి చేతులు పట్టుకుని క్షమాభిక్ష వేడుకునే అవకాశం మీరు కల్పించండి..."

"ప్రయత్నిస్తాందొరా!" అన్నారు అందరూ యేక కంఠంతో.

వాళ్లు వెళ్లి పెద్రోకి అన్నీ విషయాలు వివరించి "వెళ్లరా" అని కోరారు మందలించారు.

"వాడా? అదంతా బొల్లియేడుపు... అవి వుత్తిత్తి కబుర్లు వాడో సుడిగుండం. అందులో నీటి బుడగల్లా మీరు పడ్డారు నేను పడబోను" అని అన్నాడు పెద్రో.

"వాడు నీ భూమి ఫలసాయంతో యిచ్చేస్తాంటుంటే!"

"అలా అంటాడు, అంకించుకొని కొండ చిలవలా మింగేసాడు. ఇంకెక్కడిస్తాడు?"

"ఇస్తే వెళ్తావా?"

"మీ బిడ్డాపాపను వాడు యేడ్పించలేదుకదా! మీ మీద కొరడా దెబ్బలు పడలేదుకదా. వాడి మొసలి కన్నీరు చూసి మీరు నిజం అనుకుని యేడ్చేస్తున్నారు. ఏడ్వండి, మీరేడ్వండి నేను మాత్రం వాడు చచ్చినా వాడి శవం దగ్గరకైనా వెళ్లను".

"వియ్యంకుడివి, నివ్వెళ్లకపోతే పనులెలా జరుగుతాయ్?" అని ఒకడంటే మిగతావాళ్లంతా నవ్వారు.

"నవులో యెత్తుక పోయిందాన్ని పెళ్లాడాడా? ఎక్కడున్నాడేంటే?" అని మరొకడంటే.

"మీ పుణ్యం వుంటాది. వాడి వూసెత్తకండి, వాడు యీమట్టి మీద కాలు యిప్పుడు కాదుకదా యెప్పుడూ పెట్టడు".

"అలా అని చెప్తిమరీ, లేపించుకపోయాడా?",

"వాడు వస్తే— ఈ దివార్‌లో యెన్నడూ యెవ్వరు చెయ్యని పనిచేసాడని మీరే వాడిమీద కత్తి కట్టారు. వాడు యెక్కడున్నాడని తెలిసినా బతకనివ్వరు. నేనే వాడ్ని మరచిపోతున్నాను. మీరూ యెంత వేగిరం మరుస్తే అంత మంచిది"

"మరిపించలేని పనిచేసాడు కదా - ఎలా మరవమంటావ్ పెద్రో!"

"పెళ్లి వలప ఒక్కచోటే చేసుకున్నడు, అసలు పెళ్లి చేసుకున్నాడో లేదో...?"

"మీ మాటలన్నీ వింటుంటే మీరంతా నన్ను మీతోపాటు బతక నిచ్చేటట్లు లేరు". అని విసుగ్గానే పెద్రో అంటే

"వెళ్ల... అన్నేళ్ల మమ్మల్ని వదిలి వెళ్లావుగా!" అని ఒకడంటే.

"ఎందుకెళ్లాడు?" అని యింకొకడు ప్రశ్నవేసాడు.

"గొప్పోడైపోదామని వెళ్లాడు, పెద్దకులంలోనికి మారిపోదామనుకున్నాడు".

"వాడు యింటికి నిప్పంటించి, వీధిలోపలికి యెగిరినట్లు తంతే మళ్లీ గతిలేక యిక్కడికే వచ్చాడు".

"నేను రావటంవలన మీ కొచ్చిన నష్టమేంటి కష్టమేంటి?" అన్నాడు పెద్రో చుట్టూ మూగిన వాళ్లతో.

"నివ్వొచ్చాకే నాలుగు పక్కలనించి నాగుపాములు చేరాయిక్కడ. మాగెద్దాలన్నీ ఆపెద్ద నక్కలు పీకుతున్నాయి. యే క్షణంలో యే పోలీసొడొస్తాడనో భయంభీతితో బతుకుతున్నాం" అన్నాడు.

జవాబివ్వకుండా నిశ్చేష్టుడై చూసాడు పెద్రో

## 13

ఎడ్డీ ద్వారా రోసీ చెయ్యిస్తున్న పనుల వుద్దేశం క్లాటినాకంతా అయోమయంగా కనిపిస్తున్నాయ్. ఈ దానాలు దర్మాలు చూస్తుంటే, నిజంగా యేదో దిగులూ పశ్చాత్తాపంతో భర్త కుమిలి పోతున్నాడనిపించింది.

"మామిడితోటలో మళ్లీ పాకెందుకెయ్యిస్తున్నావ్" అని అడిగింది క్లాటినా.

"పాకకాదు, ఇల్లు వారం రోజుల్లో తయారవుతుంది".

ఈ వారం రోజుల్లో ఒకనాడు క్లాటినా విసవిసలాడుతూ "వెనుకనించి వెన్నుపోటు పొడవడానికి యింకెవరూ యీ యింట్లో మిగల్లేదు".

"ఈసారి యెదరగా గుండెపోటు పొడిపించు కుందామని" అని గొణిగాడు.

"నీకు నిజంగా పిచ్చెక్కిందని నీ మాటలే చెప్తున్నాయ్"

"దివార్ చక్రవర్తినన్నావుగా! చక్రవర్తికి పిచ్చెక్కితే దివార్ అంతా పిచ్చికుక్కలమయం అవుతుంది. అంచేత తొందరపడి ఒకమాట అనే వద్దు..." అన్నాడు.

ఇల్లు తయారయింది, ఇంటితోపాటు యిది వరకు రోసీ తన్ని వూడ దీకిన కంచెను కూడా మళ్లీ ఎడ్డీ వెయ్యిస్తుంటే

"అంతా నీ యిష్టంలా వుంది. ఎందుకలా చెయ్యిస్తున్నావ్" అరించింది క్లాటినా.

"నా యిష్టం కాదు, రోసీ చెప్పిన పని చేస్తున్నాను".

"మామిడి తోటలోనికి పోడానికి గేటైనా వుంచు"

"రేపటినుంచి ఆ తోటలో కాలుపెట్టడానికి నీకు హక్కులేదు"

"ఎవరన్నారు?"

"ఇదుగో... ఇప్పుడే వెళ్తున్నాను, హక్కయినవాడికి వాడి ఆస్తి అందజేస్తున్నాను..."

క్లాటినా గబగబలోనికివచ్చి "నీ తదనంతరం యెవరూ యీ యింట్లో మెసలరనుకున్నవా?"

"ఎవడి ఆస్తి వాడికిచ్చేస్తున్నాను".

"ఎవరి ఎవరి దగ్గర లాక్కున్నావో వాళ్లందరికీ వాపసుచేస్తే మిగిలింది యేముందీ?"

"అందరిదీ యియ్యలేదు - ఒక్క పెద్రోదే!"

"వియ్యమందావనా ఆ కనికరం?"

"కాలు చాపుకొని చావుకోసం యెదురు చూస్తున్న నాకన్నా, కాలుకాలిన పిల్లిలా పరుగెత్తుతున్న నీలో మరుపు అధికమైందే!" అంటూ రోసీ యింకేం సమధానం



బండోరా లోని నాగేశుడు



హిప్నాటిజం పితామహుడు అబె ఫారియా

యివ్వలేదు.

తను మరచిపదేంటూ అని క్లాటినా ఆ రోజంత గింజుకుంటుంది.

ఎడ్డీ ఆ సాయంత్రం పెద్రో దగ్గరకెళ్లాడు. ఆ చుట్టూవున్న పదుగుర్ని పిలిచాడు. వారం రోజుల క్రితం పెద్రోని అపహాస్యం చేసిన వాళ్లే అంతా! ఆ వేళనించీ వాళ్ల మధ్య గతి లేక మెసలుతున్నట్లు మెసలుతున్నాడు పెద్రో. వాళ్లందరితోనూ మాటలు మానేసాడు. వాళ్లందరంటే అసహ్యించు కుంటు న్నాడు.

"మీరందరూ సాక్ష్యం లాయరుగా నాకీ బాధ్యత అంటగట్టాడు రోసీ! పెద్రోపాక కాల్చినందుకు పశ్చాత్తాపం పడి అక్కడో పెంకుటిల్లు కట్టించాడు. రాత్రీ పగలు శ్రమపడి పెద్రో పెంచిన మామిడితోట పెద్రో పరంచేస్తున్నాడు. పెద్రోనించి కాజేసిన భూమి మళ్లీ పెద్రోకే సంక్రమించింది. ఇది యిదివరకు పెద్రో భూమి అమ్మినట్లు రాసిన పత్రం. ఈ రెండోది ఆ యిల్లు మామిడి తోట అతని పరంచేసిన దస్తావేజు. కావలిస్తే వచ్చి చూడండి. ఒక రోజు వూడ బీకిన కంచె మళ్లీ వెయ్యించాడు". అంటూ ఆ పత్రాలు పెద్రో చేతిలో పెట్టాడు ఎడ్డీ.

ఓ ధన రాశివేపు చూసినట్లు ఆ పత్రాల మీద అందరి కళ్లూ పడగానే పెద్రోకి అవి దాచేయాలనిపించింది. గబగబ యింట్లోకి వెళ్లిపోయాడు. మనిషి ఇలా వాఖ్యానిస్తోంటే వినిపిస్తున్నాయ్. మౌనంగా ఆ పత్రాలవేపు చూస్తుంటే గొరెట్టే ఆశను నింపుకున్న కళ్లతో భర్తవేపు చూస్తోంది. ఈ దుర్భర జీవితం యీనాటితో సరి అన్నట్లు ఆశ ఆమె కళ్లల్లో మెసలుతోంది. హక్కయిన జాగాలో హాయిగా బతుకుతానని వువ్విళ్లూరుతోంది.

అప్పుడే తన చుట్టూవున్న వాళ్ల మాటలు వింటుంటే అమాయవాళ్లను అదునుపదును తప్పించేస్తోంది. ఇలా తప్పిన వాళ్ల మధ్య బ్రతకలేడు. ఎగిరెగిరి వచ్చే ఆ మాటలు నిందలు వచ్చి నెత్తిమీద పడ్డట్లు పడుతున్నాయ్.

"ఎలాగా మీరు నేను వదిలివెళ్లిపోతానంటున్నారు. పోతే పారుబోతంటారు. ఉంటే వేలెత్తి కెలుకుతారు. అన్యాయపు సంపాదనలో అడుగు పెట్టడంలేదు". అంటూ గబగబ వున్న నాలుగు గిన్నెలూ, చిప్పలూ సంచుల్లోవేసి, ఒక సంచి గొరెట్టే తలమీద పెట్టి, రెండో సంచిని తన భుజం మ్మీద వేసుకుని బయటకొచ్చాడు.

చుట్టూ గుమిగూడిన వాళ్లతో బిగ్గరగా "నేను వెళ్లిపోతున్నాను. నావెంట వచ్చిన పామూలూ యికపోతాయ్. ఆ పాముల పుట్టల్లో బతకండి హాయిగా! నాతోపాటు పెద్దవక్కలు పారిపోతాయ్ - మీ పీకని గెడ్డాలను భూమికి తగిలేటట్లు పెంచండి. లోకం కీర్తిస్తుంది" అంటూ కదిలిపోయాడు.

ఒకవారం కొత్తయింట్లో గడిచింది. క్లాటినా ముఖం పెరటివరండాలోనైనా కనపడలేదు. ఇరుగుపొరుగు వాళ్లు యెలావున్నారో పెరటనున్న వాళ్లూ అలాగే వున్నారన్న భావన కలుగుతోంది. కొత్త పరిసరాలలో పాత పరిసరాల్లో లేని సుకం రానురాను చవి చూడగానే మదిలో రగిలివున్న మంటల వుద్రిక్తత రానురాను తగ్గి బూడిద కప్పుకుంటున్నా నిప్పుల్లా మారింది. అలాంటప్పుడు ఎడ్డీ వచ్చాడు.

"బాగున్నారా? అక్కడ కన్నయిక్కడ కాస్త నయంగా వుందా?" అని అడిగితే పెద్రో మౌనంగా వున్నా గొరెట్టే హాయిని అనుభవిస్తున్నా ముఖాన్ని వెళ్లగక్కింది.

"రోసీ యీ చివరి దశలో సుఖానికి నోచుకోలేదు".

"ఆ బాబుగారికి యేం లేదని?"

"రెండు కోరికలు మిగిలాయట! ఒక కోరిక యెలామా తీరదు"

ఇద్దరూ తనవేపు చూస్తే

"అదే కూతురూ అల్లుణ్ని దృష్టివుండగా చూద్దామని - వాళ్లెక్కడున్నారో జాడ తెలియలేదుకదా! మరి రెండో కోర్కె తీరాలంటే..."

"ఏమిటో ఆ కోర్కె" అంది గొరెట్టే అమాయకంగా!

"చచ్చేముందు పెద్రోకి క్షమాపణ చెప్పుకుందామని ప్రతి క్షణం కోరుకుంటు న్నాడు. అతను మంచం దిగే పరిస్థితిలో లేడు! అయినా నన్ను యిక్కడ వరకు మోసుకుని తెచ్చే ఏర్పాటు చెయ్యమన్నాడు".

"అంత పనే... వద్దు... వద్దు... పెద్రో వెళ్తాడు" అన్నది గొరెట్టే.

"నేను అదే కోరాలని వచ్చాను. సరే! ఇంకాపాతను మరచి పోలేను నేను రాను




అంటే నేనే రోసీని నలుగురిచేత మొయ్యించి యిక్కడకు తీసుకవస్తాను" అన్నాడ ఎడ్డీ.

"వద్దు...వద్దు పెద్రో వస్తాడు" అన్నది గొరెట్టే.

పెద్రో మాట వినకుండా ఎడ్డీ వెళ్లిపోయాడు. తర్వాత యింట్లో ఇద్దరూ మూగబోయి యెవరిపన్లోవాళ్లు పడ్డారు. చీకటి పడినా పెద్రో యిల్లు కదల్లేదు.

"చావసిద్ధంగా వున్న వాళ్లతో నీకెందుకింత పంతం?" అంది గొరెట్టే.

"చావసిద్ధంగా వున్న పాముని మీద వేసుకుని ముద్దులాడమంటున్నావ్?" అన్నాడు పెద్రో విసుగ్గా.

"మనిషికి యీగూ గెలుపూ రెండూ వుండాలి. ఓడిపోయిన వాడి మీద యింత కనికరం చూపించడం తప్పా?" అంది.

"నివ్వు ఆ పెద్ద మనిషి దగ్గర ఒప్పుకున్నావని వెళ్తున్నాను" అంటూ లేచాడు పెద్రో.

వాడియింటి యెదరకు వెళ్లేసరికి, మనసు యింకా స్వాధీనంలో రాక యిటూ అటూ రోడ్డు మీద తిరిగాడు. వెళ్లక విధిలేదని తోచిగేటు దాటిలోపలకు వెళ్లి ఆగాడు. ఇదివరకు ఆలోచన యిప్పుడే వచ్చినట్టు అనిపించింది. కత్తితోవాడి గుండె మీద ఒక్కవేటు వేస్తే... శరీరమంతా యింకా ఆనాటి గాయాలు వ్యాపించినట్లే వున్నాయ్.

తనకోసమే యెదురు చూస్తున్నట్లు ఎడ్డీ బయటకు నవ్వుత వచ్చి "వచ్చావా పెద్రో - రా - సంశయించకు - పాతంతా మరచిపో. అతనికి ఆ పెద్ద పేరే మిగిలింది గానీ - ఆనాటి చేష్టలేమీ మిగల్లేదు..."

మాటాడకుండా పెద్రో ఎడ్డీ వెంటపడ్డాడు. రోసీ తప్పించి ఆ యింట్లో ఇంకెవరూలేరు. క్లాటినా కూడా యింట్లో లేనట్లుంది. ఎడ్డీ పెద్రోని తిన్నగా పడగ్గదిలోనికి తీసుకవెళ్లాడు. రాకూడని స్థలంలోనికి, యెన్నడూ అడుగు పెట్టనన్న స్థలంలో అడుగుపెట్టున్నట్లునిపిస్తోంది. పెద్రో కాళ్ళుచేతులు వణకనారంభించాయ్. తన చేత యీగుని చెయ్యించింది తెల్లనన్నీపాలు నల్లనన్నీ నీళ్లు అనుకునే అమాయకరాలు గొరెట్టే. మనుషులందరూ తన తండ్రి ఆలాపించినట్లు సంగీతం ఆలాపించేటంత మంచి వారనుకుంటుంది. "సరే చూద్దాం. వీడెంత మారాడో?" అని మంచం దగ్గరకు వెళ్లాడు. పక్కయెముకలన్నీ కనిపిస్తున్నాయ్. ముఖం గోక్కుపోయి ముడతలు పడిపోయింది. కొవ్వొత్తిలా వెలగవలసినవాడు, హారతి కర్పూరంలా హరించుకపోయాడు.

"ఈ దశలోయితను నిన్నింకేం చెయ్యగలడన్న" ఆలోచన పెద్రోలో పాతుకపోయింది. అయినా మాటాడకుండా నిల్చున్నాడు.

రోసీ కుదించి నీరసించిన కళ్లతో ఒక్కసారి పెద్రో వేపు చూసాడు. ఆ చూపు చూడగానే పెద్రోలో జాలి ముంచుకొచ్చింది.



ఎగసిపడుతున్న సముద్రపు అలల సుందరదృశ్యం

రోనీ మెల్లగా తన గుండె వేపు చూపించుకుంటూ "ఇది దయలేని గుండె దానంతట అదే ఆగి పోకూడదు. చివ్వున రక్తం కారి ఆగాలి" అన్నాక గుండె ఆగిపోయినట్లు బాధతో పట్టుకున్నాడు.

"ఈ జాలిలేని గుండె మంటలు మండించింది. ఆ మంటలతో మంచి మనిషి పెద్రోని సర్వనాశనం చేసాను..." అంటూ చప్పున పెద్రో వేపు రెండు చేతులు త్రిప్పి యేడుస్తూ "పెద్రో... నన్ను క్షమించు..." అన్నాడు. పెద్రో అలా చూస్తూనే వున్నాడు కన్నీరు తుడుచుకోకుండానే.

"చెట్లు నరికే నీకత్తితో నా క్రూరానికి... నాగుండె మీద పొడవాలని యెన్నోసార్లు కోరుకున్నావుకదూ...?"

అవునన్నట్లు పెద్రో ముఖంపైకి లేచింది. "పశ్చాత్తాప పడిన వాడివి నివ్వునాయెదరగా ప్రభువంత వున్నతంగా కనిపిస్తున్నావు. అందుకే నిన్ను నేను కోరుకుంటున్నాను. ఇది నీ నామధ్య జరిగే ఒప్పందం. దానికి మధ్య యెవరూ లేరు".

"ఏమిటో ఆ కోరిక?" పెద్రోనోటనించి అప్రయత్నంగా మాటలు దొర్లాయ్".

నివ్వు ఒకప్పుడు యేమిటి కోరుకుని తప్పించావో యిప్పుడా కోరిక నెరవేర్చుకో! ఆనాటి నీ కోరిక యీ నాటి నాకోరిక!"

"నన్ను పోలీసులు కూనీ కోరని చంపడానికా?"

ఎడ్డీ పెద్రో భుజం మీద చెయ్యివేసి బయట వరండాలోకి తెచ్చి "అతను బతికుండగా పొడవమనలేదయ్యా! నివ్వు శవం మీద కత్తివేటువేస్తున్నావ్. అదేదో వెధవ తృప్తికోసం అలా పిచ్చిపిచ్చిగా వాగుతున్నాడు. డాక్టరునున్నానుగా! చావగానే చెప్తాను... నీ కత్తితో గుండె మీద ఒక గీటు పెట్టి - రక్తం కారాలా ఏమా?" అని అన్నాడు.

"చచ్చాక మాడొచ్చాడా?"

"బతికుంటే చెయ్యగలవాచెప్పు?"

"వాడికి చేసినా తప్పులేదుగానీ..."

"నీతోనేను పూర్తిగా యేకీభవిస్తున్నాను"

"చాలా నీవు బాధ పడ్డావా?"

"పడ్డాను కాబట్టే... నీ బాధకూ నా బాధకూ కారకుడు యీ రోనీయే!"

"నన్ను కుదబొడిచినట్లు నిన్నెక్కడ పొడిచాడు?"

"అంతకన్నా ఘోరంచేసాడు, నీ శరీరం గాయపడితే నా మనసుగాయపడి వుండయి యిప్పటికీ ఆ బాధ తగ్గలేదు"

"ఏం చేసాడు?"

"నీ దగ్గిర లాక్కున్నది నీకిచ్చేసాడు. నా దగ్గర కాజేసింది యిస్తాడనే ఆశతో రాత్రీ పగలూ యీ శవ జాగారం చేస్తున్నాను"

"అయితే నీ ఆసరా చూపి సరేనన మంటావా?"

"శవం మీద కత్తివేసి మెడికల్ స్టూడెంట్‌వి కాబోతున్నావ్!" అని ఎడ్డీ చమత్కరించాడు.

పెద్రో తిరిగొచ్చి

"మీరు హాయిగా కాలం చెయ్యండి, మీ కోరిక తీరుస్తాను"

"ఇంత ప్రేమాభిమానాలతో మనుషుల్లోయెలా వుండిపోయావో పెద్రో..."

అంటూ యెంతో హాయిగా వున్నట్లు యింకా యెప్పుడు పోతేయేం? అన్నిటికీ పెద్రో ఎడ్డీ వుండగా నాకు చింతలేదు" అన్నాడు రోనీ ముఖం రెండో వేపు తిప్పుకుంటూ!

## 14

ఇంటికి వెళ్లాక పెద్రోపెళ్లాం యే మడిగినా మౌనం దాల్చాడు. ఏం చెప్తే యేమంటుందోనన్న భయం. శవాన్నయినా యెందుకుపొడవాలన్న దయగలది. ఈ నోటా ఆ నోటా యీసైనం ప్రాకి వేరే వేరే అర్థాలను, రూపులను దాల్చి చివరకు రోనీ బతికుండగానే తను చంపినట్లు అనే వాళ్లూ వుంటారు.

ఈ విషయం తనకూ ఎడ్డీకి మధ్యనున్న గుప్తం. మూడో వాళ్లకు తెలిస్తే బటారు బయలౌతుంది. ఉదయం చర్చికి "మాస్"కి వెళ్లేటప్పుడు మనుషులు చేసే ఏ పని యేకాంతంగా చేసినా యింకొకరితో కలిసి చేసినా మూడోవాడెప్పుడూ వుంటాడని తోచింది. వాడెప్పుడూ చూస్తూనే వుంటాడు. లోకం కళ్లు కప్పవచ్చుగానీ ఆ ప్రభువు కళ్లు కప్పలేం! అయినా తనేం ఘోరం చెయ్యటంలేదుకదా. కాటికి కాలుచాపుకున్న వాడు ప్రశాంతంగా చావడనికి యీ పని చేస్తానని ఒప్పుకున్నాడు.

చర్చినించి బయటపడగానే మనసు మళ్లీ అల్లకల్లోలమైపోయింది. తన కొడుకును దూరం చేసి తన బతుకూ నాశనం చేసాడు. వాడికి అవకాశం, అధికారం వుందని నాగుండెను పగిలించి రక్తం కార్పించాడు. ఇప్పుడు నాకు అవకాశం దొరికింది. వాడికి ప్రాణంవుండగా పొడిస్తే తప్పేంవుంది?"

ఇలా తనలో తర్జన భర్జన లౌతుండగానే రోనీ చావు బతుకుల మధ్యనున్నాడని వచ్చేపోయే మనుషులను చూస్తుంటేనే తెలుస్తోంది. తన యిష్టప్రకారం తనను యింటినించి కదల్చవద్దని, యేపరుపు మీద పడుకున్నాడో అక్కడే చివరి ప్రాణాలు వదలాలని కోరుకున్నాడని క్లాటినా వచ్చిన పెద్దలకు చెప్పి కనీసం రిబాందర్ ఆసుపత్రిలో చేర్పించాలన్న పెద్దల కోర్కెలను కాదన్నది.

తన యింటి అరుగుమీద కూర్చుంటే యెవరొచ్చినదీ పోయినదీ కనిపిస్తున్నారు పెద్రోకు. రాత్రి పన్నెండు దాటినా ఎడ్డీ సంకేతం అందలేదు. గొరెట్టి చూసి చూసి లోపలగదిలో పడుకుంది. పంచలోనున్న కత్తితీసాడు.

"ఈ కత్తితో పచ్చని చెట్లని నరికి పొయ్యికి కట్టెలు తెచ్చుకునే వాడ్ని. ఈ శవాన్ని పొడిచి కనీసం తృప్తిని తెచ్చుకుంటాను" అనుకున్నాడు పెద్రో. కత్తి చాలా వాడిగా వుంది.

ఇంతలో ఫాదర్ పింటో వరండాలో నిల్చొని ఎడ్డీతో మాటాడటం కనిపించింది. కాసేపయ్యాక పింటో వెళ్లిపోయాడు. ఎడ్డీ చేతులతో చేసిన సైగ కనిపించింది. గబగబ పెద్రో రోని యింటి వైపు వెళ్లాడు. ఎడ్డీ చెప్పినట్లే యెవ్వరూ లేరు. చీకటి. పెద్రో వస్తూండగానే వరండాలో దీపాలు ఆరిపోయాయ్. చీకట్లో నిల్చున్న ఎడ్డీ మెల్లగా గొణిగాడు. పెద్రో! వచ్చావా?"

"చచ్చాడా?"

"ఆ ఇప్పుడే చచ్చాడు"


"గుండె ఆగిపోయిందా?"

"పూర్తిగా ఆగిపోయింది".

ఇద్దరూ గదిలోనికెళ్లారు. మసగ్గాలైటు వెలుగుతోంది. ఎవ్వరూ లేరు. ఎడ్డీ తనే చలనం లేకుండా పడివున్న రోనీని చూడగానే కనికరం బదులు ఆవేశం మనసు నాక్రమించుకుంది. చచ్చిన శవాన్ని కత్తితో పొడుస్తున్నాననుకోకుండా బతికిన రోనీనే పొడుస్తున్నాననుకున్నంత గట్టిగా ఆ గుండె మీద పదునైన కత్తి దివరపెట్టి నొక్కాడు. రక్తం ఒక్కసారి వుబికి వచ్చింది.

"ఎడ్డీ" అన్నాడు పెద్రో భయంతో కంపించుకపోతూ!

ఎడ్డీ సంతోషంతో ఫరవాలేదన్నట్లు తలాడించాడు.



పెద్రోయిటువేపు వచ్చినా, కాళ్లూ చేతులు వణకడం కనిపిస్తున్నాయ్.

"చచ్చాక రక్తం గడ్డకట్టుకుపోడానికి కొంతసేపు పట్టుంది. నివ్వు శవాన్నే చంపావు గాభరాపడకు".

పెద్రో యింటికి వెళ్లినా నిద్ర పట్టలేదు. ఉదయం వల్గురితోపాటు పెద్రో వెళ్లాడు. ఎవరైతే తనను తూలనాడారో వాళ్లజాతి వాళ్లంతా అక్కడే వున్నారు. వాళ్లను చూసి అగ్రజాతి వాళ్లెవరూ దగ్గరగా చేరలేదు. పెద్రోనికూడా ఒక అగ్రజాతి వాళ్లను చూసి అసహ్యించుకున్నట్లు వారు చూస్తుంటే అక్కడ వుండలేక యింటికి వెళ్లిపోయాడు.

దీవార్ చక్రవర్తిలా బ్రతికిన రోని శవపేటిక వెనుక వెళ్లిన వాళ్లంతా శూద్రులే. చివరకు ఎడ్డీ యేదో సాకుపెట్టి ఆగిపోయాడు.

"ఇలాంటి కోరికతో అగ్రజాతి పరువుతీసాడన్నారు" అగ్రజాతి వాళ్లు.

"అధికారంతో మమ్మల్ని రాపాడినా, చచ్చేముందు మేమూ మనుషులమే అని పశ్చాత్తాపపడి మాకీ గౌరవం యిచ్చాడు" అని అన్నారు శూద్రులు.

శూద్రుల సమాధులవేపు రోనీని పాతిపెట్టడానికి గొయ్యి తవ్వారు. శవ పేటికను దించి మన్నువేసి కప్పబోతుంటే.

"ఆగండి" అంటూ మెనుకనించి కేకవినిపించింది.

పోలీసులు అందరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"ఇది ఖూనీ కేసు".

"ఎన్నాళ్లనించో మంచందిగనివాడిని ఖూని యెవరు చేసారు?"

ఈ ప్రశ్నకు పోలీసులు జవాబు చెప్పకుండా

"ఇక్కడ వున్న మీరంతా యీ శవంతో పంజిరాండి".

"ఇదేమిటి? రోనీ బ్రతికి వున్నప్పుడు మనలను సాధించాడు. చచ్చికూడా సాధించడానికేనా యిలా పన్నాగం పన్నాడు?"

రోనీ శవం శవ పరీక్షకు వెళ్లింది. క్లాటినా ఒక్కర్తె అంగటి గదిలో కూర్చొని వుంటే ఎడ్డీ వచ్చాడు. ఇది వరకుకన్నా క్లాటినా ముఖం నల్ల బట్టలు వేసుకున్నా మెరుస్తోంది.

ఎడ్డీని చూసినా మాటాడలేదు, కూర్చోమనలేదు. ఆలస్యంచేస్తే యింకెవరైనా వస్తే అడగాలనుకున్నది అడగలేదని

"రోనీ కోరుకున్నట్లు అంతా జరిపించాను. నాతో చెప్పకుండా యిలా చెయ్యడంయేంబాగులేదు".

"ఇది కూడా నేను రోనీ కోరినట్లే చేసాను".

"నన్ను సాక్షిగా రోనీ వెయ్యమన్నాడా?"

"అదినాపని"

"ఏం చెప్పమని సాక్షిగావేసావ్?"

"నిజం చెప్పు అబద్ధం చెప్పకు".


# వేకువ

తూర్పంటే నాకిష్టం
తెలతెలవారే వేళ — చీకటి
వెలిబూదిలాగ వుంటుంది
ప్రాతర్మందానిలం సోకి, పొరతొలగి
ప్రాణ సూర్యాంగారం రాజుకుంటుంది

మంచుతో తడిసిన వృక్ష వీధివెంట
మౌనంగా నడిచి పోవాలని వుంటుంది
అప్పుడు వేకువ
ప్రాణహరితమై
ఉచ్ఛ్వాసంలాగ, గుండెలో
ఉత్సాహంగా అలుముకుంటుంది

అంతరంగద్వార మణి కవాటం
తనంతగా విడిపోయి - అప్పుడు
అతిథి వంటి కొత్త ఆలోచనను
ఆహ్వానిస్తుంది.

పడమర చూస్తే
మృత్యుమందిరం గుర్తు కొస్తుంది



కళ్లరెప్పల మీదకు నిద్ర లాగ
చీకటి ముంచు కొస్తుంది

నిన్నటి చీకటిలో
నిన్నటి వయస్సు అస్తమిస్తుంది
నేటి వేకువలో
వయః కుసుమం
మళ్ళీ వికసిస్తుంది

** **

ప్రపంచ యౌవనాన్ని
ఎంత ఆస్వాదించినా తనివితీరని
యయాతిని నేను—
దయచేయమని చేయిజాస్తే
తన యౌవనాన్ని దానం చేసే,
పూరుకారుణ్యం - ఈ వేకువ
అందుకే
తూర్పంటే నాకిష్టం

—ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

"రోసీ శవాన్ని పెద్రో కత్తితో..."

"అబద్ధం అబద్ధ..."

"నిజం... నిజం..."

"రోసీ రక్తంకారిన బట్టలూ, బెడ్‌షీటూ వున్నాయి. పెద్రో శవాన్ని చంపలేదనీ, బతికుండగా చంపాడనీ కోర్టులో రుజువు చెయ్యొస్తాము"

"నేను లాయర్ని..."

"అందుకే బుర్ర వుపయోగించమంటున్నాను".

"నేను శవాన్నే చంపాడని చెప్తాను..."

"పెద్రో నీవాడిలా మాట్లాడుతున్నావు? ఏమిటి సంగతి?"

ఎడ్డీ ఆవేశంతో "అవును నావాడే, రోసీ వాడిని పీక్కుతిన్నట్లే నన్నూ తిన్నాడు, నా ఆస్తినీ కాజేసాడు. నేను కుమిలి కుమిలి రాత్రింబవళ్లూ యేడ్చుకునేటట్లు చేసాడు".

"మూడడుగుల జాగా... అంతేనా?"

"ఒక అంగుళం జాగాయైనా... ఒకడు నిన్ను మోసగిస్తే నివ్వేమీ చెయ్యలేక పోయానన్న బాధ... యెంతబాధో? యుద్ధంలో ఓడిపోయినంత బాధ..."

"ఇంతకీ నేరం నీ మీదే వేసుకోదలచావన్న మాట!"

"అలా అన్నానా" అన్నాడు ఆశ్చర్యంగా, తర్వాత మాటరాలేదు. క్లాటినా చాలా తేలిగ్గా మళ్లీ

"నివు రోసీని పెద్రో చేత ఖూనీ చెయ్యించావ్? ఇప్పుడు నిజం బయట పడిపోయింది!"

"అంత పెద్దనేరం నానెత్తి మీద వేస్తున్నావ్, ప్రభువు నిన్ను..."

"మన ఆవేశాల మధ్యకు ప్రభువునెందుకు తెస్తావ్? ఇది నీకూ నాకూ మధ్య ఒప్పందం. నేను చెప్పినట్లుగా సాక్ష్యం పలికి పెద్రో రోసీని ఖూనీ చేసాడని చెప్పకపోతే... నివ్వే ఖూనీ చెయ్యించావని కోర్టులో నేను సాక్ష్యం పలక వలసి వస్తుంది. ఇంక నీ మాటలు వినే ఓపిక నాకు లేదు వెళ్లు" అని అక్కడ నించి లేచిలోనికి వెళ్లిపోయింది.

"ఆడదానికోపం నాగుపాముపగ అన్నారు పెద్దలు... నిజం...నిజం..." అనుకుని ఎడ్డీ వెళ్లిపోయాడు.

శవపరీక్ష అయి శవపేటిక తిరుగ దినార్ వచ్చింది. ఎడ్డీ సాక్ష్యంతో పెద్రోని అరెస్టు చేసారు పోలీసులు. పెద్రో వున్నదున్నట్లు చెప్పేసాడు. తొందరలో కడక్కుండా అలవాటు కొద్దీ దోపిన కత్తిని కూడా పోలీసులు వశం చేసుకున్నారు. పెద్రోతోపాటు,యీ శవాన్ని శూద్రుల శ్మశాన వాటికలో పాతడానికి తీసుకవెళ్లిన ప్రముఖులని కూడా అరెస్టు చేసారు.

తిరిగి వచ్చిన రోసీ శవాన్ని తమ వేపు పాతి పెట్టడానికి శూద్రులు యెంత మాత్రం ఒప్పుకోలేదు.

"బతికి మమ్మల్ని సాధించాడు. చచ్చిమరి మమ్మల్ని సాధిస్తున్నాడు". అంటూ ఇదివరకు తీసిన గోతిని కప్పేసారు. అగ్రజాతుల వేపు భూస్థాపితం చెయ్యడానికి వెళ్తే" శూద్రులు ముట్టుకున్న శవాన్ని మావేపు పాతడానికి వీల్లేదన్నారు. క్లాటినా యెంత ప్రబతిమాలినా, యెంత డబ్బు ఎరజూపి ఆ ఆరడుగుల జాగాను కొనుక్కుంటానన్నా అగ్రజాతులవాళ్లుససేమిరా ఒప్పుకోలేదు. శవం శ్మశానంలో అలా వుండిపోయింది. ఎన్ని సువాసనలిచ్చే పదార్థాలున్నా శవం కంపుకొట్టోంది. ఫాదర్ పింటో రెండు వేపుల మధ్య కొట్లాట ప్రారంభమౌతుందని పసిగట్టాడు. రెండు వేపుల పెద్దలను చర్చివేపు తీసుకవెళ్లి

"ఆలస్యం చేస్తే లాభంలేదు. ఈ శవాన్ని యింకో దగ్గర పాతి పెట్టలేం".

"కాకులకూ గెద్దలకూ పారేయండి" అరిచాడో శూద్రుడు.

"అది మీకు సమ్మతమేనా? "అడిగాడు ఫాదర్ పింటో అగ్రకులాల వాళ్లను.

"వాళ్లు ముట్టుకున్నారు కాబట్టి శవం వాళ్లపరమైంది. వాళ్లు యేం చేసుకున్నా మాకేం సంబంధంలేదు".

వాగ్వివాదాలతో పౌరుషాలు యిరువేపులా పెరిగిపోతుంటే

"ఇప్పుడీ శవాన్ని భూస్థాపితం చేసే బాధ్యత నామీద పడింది". అన్నాడు పింటో.

"మీ రెందుకేసుకుంటారు? వున్నాదిగా ఆతని భార్య!" అన్నాడొకడు.

"అదికాదు ఎంత పేద వాడవనీ, యెంత ధనికుడవనీ వాడు క్రైస్తవుడుగా వున్నంతకాలం నేను ఆ శవానికి ఆరడుగుల జాగా లేదనలేను. రెండు వేపులా పౌరుషాలతో పోట్లాడుకుని అది మీ స్వంత జాగాలా వ్యవహరిస్తున్నారు. ఇది యీ చర్చి జాగా ఇందులోనే రోసీ శవం పాతిపెట్టబడుతుంది".

"ఎక్కడ? ఎక్కడ?" కేకలు రెండు వేపులనించి వచ్చాయి.

"ఇటుకాదు - అటుకాదు... మధ్యలో... ఆజాగా రెండు వేపులకూ దూరంగానే వుంది".

ఒక్కొక్కరూ జారిపోయారు. ఒక్కక్లాటినా తప్ప యింకెవరూ లేకుండా రోసీ శవం భూస్థాపితమైంది.


## 15


కోర్టులో ఎడ్డీ తనమతాను కాపాడుకోడానికి నేరం అంతా పెద్రో మీద తోసేసాడు. క్లాటినా అందుకే ఎడ్డీ అంత వుత్తముడు, స్వామి భక్తుడు యింకొకడు లేడనీ పెద్రో చెప్తున్నదంతా అబద్ధమని సాక్ష్యం చెప్పింది. ఉన్నది వున్నట్లు నిజం చెప్పిన పెద్రోకి యావజ్జీవ కారాగార శిక్ష తప్పలేదు. జైల్లో యీ అన్యాయానికి కుమిలిపోతూ కొద్ది రోజులకే చచ్చిపోయాడు. ఆ శవాన్ని గొరెట్టేకి అప్ప జెప్పారు. అయితే ఒక విశేషం జరిగింది. ఆ శవం వెంట వందలాది దివార్ ప్రజవెళ్లారు. రోసి దిక్కుమాలిన వాడుగా ఛస్తే, వీడు చక్రవర్తిలా చచ్చాడు అన్నారు. ఇద్దరిలో పెద్రోకే న్యాయం వరించిందన్నారు. ఆ వేళనించి శూద్రుల వెన్నెముకలా చచ్చినా పెద్రో నిల్చాడు.

ఈ సంఘటన జరిగాకే గోవాకు స్వతంత్రం వచ్చింది. దివార్‌లో యిప్పుడు వీళ్లు అగ్రజాతులు వాళ్ళు, వీళ్లు శూద్రులన్న విచక్షణతో యే కార్యాలు జరగటంలేదు. చర్చిలోనూ శ్మశానంలోనూ జాతి పరంగా పొందే ప్రత్యేకతలు లేవు. స్వాతంత్రం తెచ్చిన వెలుగులో కొత్తగా వచ్చిన అవకాశాలను శూద్రులు, నిమ్నజాతి వాళ్లుబాగా వినియోగించుకుని చదువు సంధ్యలు, వృత్తి పనుల్లోనూ బాగా వుత్తీర్ణులై ఆరితేరారు. ఆ పనితనానికి కాస్త తెగువ, సాహసం, కార్యసాధన చేర్చి చాలామంది యువకులు విదేశాలు, ముఖ్యంగా అరబ్ దేశాలుకు వెళ్లి విశేషంగా ధనం ఆర్జించారు. ఇప్పుడు బార్ నడుపుతున్న ఫ్రాన్సిస్ కుటుంబం లేమివలనించి తప్పించుకుని యెగిరిన పక్షులాంటి కుటుంబాలే. ఇలాంటి కుటుంబాలెన్నో దివార్‌లో యిప్పుడు వున్నాయ్. ఇదివరకుండే యెలిక కన్నాల్లాంటి పాకలు లేవిప్పుడు. అందులో ఒకప్పుడు నివశించిన వాళ్ల సంతానాలు యిదివరకు అగ్రజాతులవాళ్లు నివశించే బంగళాలను కొనేసారు. కొనడమేకాదు వీళ్లు యిప్పుడు సిరితో చిందులు త్రొక్కుతూ, ఒకనాటి పగ అగ్రకులాలపై తీర్చుకుంటున్నారన్న అనుమానం కలిగేటట్లు మెసలుతున్నారు. ఒకనాటి అగ్రకులాలవారిప్పుడు బ్రతుకు భారంతో కుమిలిపోతున్నారు. అలా కుమిలిపోతున్న వాళ్లను వీళ్లు నీచుల్లా చూస్తున్నారు సేవకులను చేశారు.

పోర్చుగీసుల హయాంలో దివార్ - ఈ దేవుళ్లదేశ చరిత్రలో స్వలాభం పాలించింది. ఇప్పుడు స్వతంత్ర దేశంలో భాగంగా స్వలాభమే పాలిస్తోంది.

మనిషి! ఎంత గొప్ప సృష్టి!! మనిషి అపూర్వ సృష్టి!!! మనిషి - వీడెంత స్వార్థపరుడు? వీడెంత నీచుడు??



పాత గోవాలోని బామ్ జీసస్ బెసిలికా



ఎద్దుల పోరాటం